నేటి కందం- నేటికి అందం

అవసరముగ రోగులకై
నవపథమున ప్లాను వేసి నాణ్యత నెల్లన్
ప్రవచించుచు నుస్మాన్యా
భవనమ్ముల పనులు ప్రభుత ప్రారంభించెన్ !!

(ఉస్మానియా ఆసుపత్రి నూతన భవన నిర్మాణానికి తెలంగాణా ప్రభుత్వం పనులు ప్రారంభించింది)

-రాధశ్రీ
సెల్:9494481210



# నేటి నిజం

తెలుగు దినపత్రిక



కాషాయం కవాతులో
కదులుతున్న ప్రభుత్వం
గాంధీజీని చంపినోళ్ల
కుటిల నీతి జవసత్వం.
స్వాతంత్ర్యం పోరులోనా
స్వరం లొంగినోళ్ల మీద
నాణాలు స్టాంపులంటే
నేడు దేశ విలువ పోదా

చురక

-వేల్పుల నారాయణ
9440433475

website:www.netinijam.com ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 E-mail:netinijam93@gmail.com

హైదరాబాద్ శనివారం 4-10-2025 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93· Postal No. HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-50 001. సంపుటి :32 సంచిక:48 పేజీలు:6 వెల: రూ.1/-

# కంటోన్మెంట్ ఎన్నికలు నిర్వహించాలి

-మంత్రి పొన్నం ప్రభాకర్

హైదరాబాద్, అక్టోబర్ 3:కంటోన్మెంట్ నుంచి తెలంగాణ ప్రభుత్వానికి యూజర్ చార్జీల భాగం కింద దాదాపు రూ.1,000 కోట్లుపెండింగ్‌లో ఉన్నాయని, వాటిని చెల్లించాలని హైదరాబాద్ జిల్లా ఇంచార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఈ మేరకు రక్షణ శాఖ మంత్రి రాజనాథ్ సింగ్‌కు పొన్నం ప్రభాకర్ లేఖ రాశారు. ఆ లేఖలో జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల విజయ లక్ష్మీ, రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్, సికింద్రాబాద్‌కంటోన్మెంట్ ఎమ్మెల్యే గణేశ్ సంతకాలు కూడా చేశారు.

కంటోన్మెంట్ బకాయిలను సకాలంలో క్లియరెన్స్ చేయడం వల్ల రక్షణ శాఖ పరిధిలో అభివృద్ధి చెందుతున్న ప్రాంతాలలో ప్రజా మౌలిక సదుపాయాలు కల్పిస్తామని, వారికి అవసరమైన పౌర సేవలు కొనసాగించడంలో రాష్ట్ర ప్రభుత్వానికి మద్దతు లభిస్తుందని తెలిపారు. హైదరాబాద్‌లోని కొన్ని రక్షణ శాఖభూములను కీలకమైన ప్రజా ప్రయోజనాల కోసం రాష్ట్ర ప్రభుత్వానికి విడిచిపెట్టడానికి సానుకూలంగా పరిశీలించి నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చిన రక్షణ మంత్రిత్వ శాఖకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.

రోజురోజుకు అభివృద్ధి చెందుతున్న హైదరాబాద్, సికింద్రాబాద్ లో నివసిస్తున్న ప్రజలకు కీలకమైన మౌలిక సదుపాయాల అవసరాలను తీర్చడంలో, పౌర సౌకర్యాలను మెరుగుపరచడంలో రక్షణ శాఖ భూములు ఎంతగానో ఉపయోగపడతాయని మంత్రి పొన్నం తెలిపారు. ప్రజా వినియోగం కోసం కొన్ని రక్షణ భూములను ఇవ్వడానికి అంగీకరించినందుకు భారత ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. అయితే ఈ భూములను అప్పగించే ప్రక్రియను వేగవంతం చేయాలని ఆయన అభ్యర్థించారు.

నగర అభివృద్ధికి, ప్రజా సౌకర్యానికి అధిక ప్రాముఖ్యత కలిగిన కొనసాగుతున్న మౌలిక సదుపాయాలు, మొబిలిటీ ప్రాజెక్టులను అమలు చేయడానికి ఈ భూ మార్పిడి కీలకంగా ఉందని మంత్రి అభిప్రాయ పడ్డారు.

గత కొన్ని సంవత్సరాలుగా సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు ఎన్నికలు జరగడం లేదని, ఈ ఎన్నికలను వీలైనంత త్వరగా నిర్వహించడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్ అభివృద్ధికి కీలకమైన ఈ అంశాలపై రక్షణ మంత్రిత్వ శాఖ తగిన పరిశీలన చేస్తుందని విశ్వసిస్తున్నట్లు లేఖలో పేర్కొన్నారు.

# ఇక సిందూర్ 2.0నే.. పాక్‌కు ఆర్మీ చీఫ్ స్ట్రాంగ్ వార్నింగ్



న్యూఢిల్లీ, అక్టోబర్ 3: సీమాంతర ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తున్న దాయాది పాకిస్థాన్‌కు ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు. రాష్ట్ర ప్రాయోజిత ఉగ్రవాదాన్ని ఆపకపోతే దాని చారిత్రక, భౌగోళిక ఉనికి ప్రమాదంలో పడుతుందని హెచ్చరించారు.

రాజస్థాన్‌లోని ఆర్మీపోర్టును సందర్శించిన ద్వివేది.. అక్కడ ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆపరేషన్ సిందూర్ అంశాన్ని ప్రస్తావిస్తూ పాక్‌కు గట్టి హెచ్చరికలు చేశారు. 'ఆపరేషన్ సిందూర్ 1.0 సమయంలో భారత్ కాస్త సహనాన్ని ప్రదర్శించింది. మరోసారి రెచ్చగొడితే.. భారత్ ఎలాంటి సంయమనం చూపదు. మరో అడుగు ముందుకేస్తాం. సిందూర్ 2.0 ఉంటుంది. ప్రపంచ చరిత్ర, భౌగోళికంలో తన స్థానాన్ని నిలుపుకోవాలా.. లేదా.. అనే దానిపై పాక్ పునరాలోచించుకోవాలి. ప్రపంచ పటంలో ఉండాలనుకుంటే ప్రాయోజిత ఉగ్రవాదాన్ని ఆపాలి. లేదంటే చరిత్ర నుంచి తుడిచిపెట్టుకోవాల్సి ఉంటుంది.. జాగ్రత్త' అంటూ హెచ్చరించారు.

# అవన్నీ అందమైన కట్టుకథలు: ఎయిర్‌ఫోర్స్ చీఫ్ ఏపీ సింగ్

న్యూఢిల్లీ, అక్టోబర్ 3: ఆపరేషన్ సింధూర్ సమయంలో భారతీయ యుద్ధ విమానాలను కూల్చినట్లు పాకిస్థాన్ చేస్తున్న ఆరోపణలను ఎయిర్ ఫోర్స్ చీఫ్ ఎయిర్ చీఫ్ మార్షల్ అమర్ ప్రీత్ సింగ్ కొట్టిపారేశారు. అవన్నీ పాకిస్థాన్ అల్లిన అందమైన కట్టుకథలన్నారు. పాకిస్థాన్ వద్ద యుద్ధ విమానాల కూల్చివేతకు చెందిన ఆధారాలు లేవన్నారు. కానీ ఆపరేషన్ సింధూర్ సమయంలో పాక్‌లో ఉన్న అనేక స్థావరాలను ఇండియా ధ్వంసం చేసిందని, వాటికి సంబంధించిన చిత్రాలను రిలీజ్ చేసినట్లు ఆయన చెప్పారు. తమ ప్రజల నుంచి రక్షణ పొందేందుకు పాకిస్థాన్ ఆ కథలు అల్లినట్లు ఆయన పేర్కొన్నారు.

ఢిల్లీలో జరిగిన మీడియా సమావేశంలో అమర్ ప్రీత్ సింగ్ మాట్లాడుతూ.. ఒకవేళ మన దేశానికి చెందిన 15 యుద్ధ విమానాలను పాకిస్థాన్ కూల్చివేసిందని అనుకుంటే, అలా వాళ్లను అనుకోనివ్వండి అని, వాళ్లు దానిక గురించి కన్విన్స్ అవుతారని, అంటే మన దళంలో 15 యుద్ధ విమానాలు తక్కువ అవుతాయని, అప్పుడు దాని గురించి తాను మాట్లాడాల్సిన అవసరం ఏముందని ఆయన అన్నారు. ఇప్పటికి కూడా ఏం జరిగిందో తానేమీ చెప్పలేనన్నారు. ఎంత నష్టం జరిగింది, ఎలా జరిగిందో తెలియదన్నారు. ఆ అంచనాలన్నీ పాకిస్థాన్ చేయాలన్నారు.

మన ఎయిర్ బేస్‌ల వద్ద ఏదైనా శిథిలం పడినట్లు మీరేమైనా ఫోటోలను చూశారా, ఏదైనా మనల్ని తాకినట్లు గమనించారా, ఏదైనా హ్యాంగర్ ధ్వంసమైందా అని ఆయన ప్రశ్నించారు. పాకిస్థాన్‌లో ధ్వంసమైన అనేక ప్రాంతాలకు చెందిన పిక్‌లను చూపించామని, కానీ వాళ్లు మాత్రం ఒక్క పిక్ కూడా మనకు చూపించలేదన్నారు. అంటే వాళ్లు మాట్లాడేది మనోహరమైన కట్టుకథలే అని ఆయన అన్నారు. ఆ కథలతో వాళ్లు సంతోషంగా ఉండనివ్వండి అని, దేశ ప్రజల ముందు వాళ్లు కూడా తమ ముఖాన్ని చూపించాల్సి ఉంటుంది కాబట్టి, దీంట్లో పెద్దగా బాధపడేది ఏమీ లేదన్నారు.

# దామోదర్ రెడ్డి పార్థివ దేహం వద్ద సీఎం రేవంత్ నివాళి



హైదరాబాద్, అక్టోబర్ 3:కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డి అనారోగ్యంతో కన్నుమూసిన విషయం తెలిసిందే. అయితే ఈ రోజు ప్రజల సందర్శనార్థం నగరంలోని జూబ్లీహిల్స్ లోని దామోదర్ రెడ్డి నివాసంలో పార్థివ దేహాన్ని ఉంచారు.

ఈ క్రమంలో తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి అక్కడకు చేరుకొని పార్థివదేహానికి పూలమాల వేసి, నివాళులు అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులతో మాట్లాడి ధైర్యం చెప్పారు.

ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. రాంరెడ్డి దామోదర్ రెడ్డి మృతి కాంగ్రెస్ పార్టీతో పాటు నల్గొండ జిల్లా ప్రజలకు తీరని లోటని అన్నారు. అంతకు ముందు మంత్రులు పొన్నం ప్రభాకర్, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, మేయర్ గద్వాల విజయలక్ష్మి నివాళులు అర్పించారు.

# ఆర్యవైశ్య కార్పొరేషన్‌కు నిధులు కేటాయించాలి

-ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క



ఖమ్మం, అక్టోబర్ 3: ఆర్యవైశ్య కార్పొరేషన్‌కు నిధులు కేటాయించాలని మధిర ఎమ్మెల్యే రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కకి మధిర మండల ఆర్యవైశ్య సంఘం విజ్ఞప్తి చేసింది. శుక్రవారం ఖమ్మం జిల్లా ఆర్యవైశ్య మహాసభ గౌరవ అధ్యక్షుడు వనమా వేణుగోపాలరావు (సూరి) నివాసంలో ఏర్పాటు చేసిన బ్రేక్ ఫాస్ట్ మీటింగ్‌కు డిప్యూటీ సీఎం హాజరయ్యారు. ఈ సందర్భంగా మధిర మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు చారుగుండ్ల నరసింహమూర్తి మాట్లాడుతూ.. ఆర్యవైశ్యుల అభివృద్ధి, సంక్షేమానికి కార్పొరేషన్‌కు నిధులు అత్యవసరం అన్నారు. దీని ద్వారా అనేకమంది యువకులకు స్వయం ఉపాధితో పాటు విద్యావకాశాలు మెరుగుపడతాయన్నారు.

ఈ సమావేశంలో మధిర మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రంగా హనుమంతరావు, మిర్యాల వెంకటరమణ గుప్తా, దేవిశెట్టి రంగారావు, మధిర టౌన్ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు వనమా కిరణ్ కుమార్, కోశాధికారి వేములపల్లి శ్రీనివాసరావు, మండల మాజీ అధ్యక్షుడు పల్లపోతు ప్రసాదరావు, కుంచం కృష్ణారావు, నేరెళ్ల శ్రీనివాసరావు, కాజా శ్రీనివాసరావు, ఇరుకుళ్ల సురేశ్, వనమా పూర్ణచంద్రరావు పాల్గొన్నారు.

# అరేబియా సముద్రంలో తొలి తుఫాను.. 'సైక్లోన్ శక్తి' గా నామకరణం

న్యూ దిఒల్య అక్టోబర్ 3 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );ఈ ఏడాది అరేబియా సముద్రం లో తొలి తుఫాను ఏర్పడింది. భారత వాతావరణ విభాగం తాజాగా ఈ విషయాన్ని వెల్లడించింది. అరేబియా సముద్రంలో ఈశాన్యం వైపు ద్వారకకు 240 కిలోమీటర్ల దూరంలో, పోరుబందర్‌కు 270 కిలోమీటర్ల దూరంలో అల్పపీడనం ఏర్పడింది.అది వాయుగుండంగా బలపడి గంటకు 12 కిలోమీటర్ల వేగంతో పశ్చిమ-వాయవ్య దిశగా కదులుతూ తుఫానుగా మారింది. రానున్న 24 గంటల్లో తీవ్ర తుఫానుగా మారే అవకాశం ఉందని ఐఎండీ తెలిపింది. ఈ తుఫాను కు 'సైక్లోన్ శక్తి' గా నామకరణం చేశారు. ప్రపంచ వాతావరణ సంస్థ ఆదేశాల ప్రకారం.. హిందూ మహాసముద్రం తీరప్రాంతంగా కలిగిన 13 దేశాలు ఈ తీరంలో ఏర్పడే తుఫానులకు పేర్లను నిర్ణయిస్తాయి.భారత్, బంగ్లాదేశ్, ఇరాన్, మాల్దీవులు, మయన్మార్, ఒమన్, పాకిస్థాన్, ఖతార్, సౌదీ అరేబియా, శ్రీలంక, థాయిలాండ్, యూఏఈ, యెమెన్ దేశాలు తుఫాన్‌లకు పేర్లు పెడుతాయి. కొన్ని తుఫానుల ప్రభావం చాలారోజులు ఉంటుంది. అదే సమయంలో మరో తుఫాను వస్తే ఎక్కడ ఏ తుఫాను ప్రభావం అనే విషయంలో తికమక లేకుండా ఉండటం కోసం తుఫానులకు పేర్లుపెట్టే సంప్రదాయాన్ని ప్రారంభించారు.తాజా తుఫానుకు 'శక్తి' అనే పేరును శ్రీలంక పెట్టింది. తుఫానులకు పేర్లు పెట్టడం ద్వారా డిజాస్టర్ మేనేజ్‌మెంట్‌కు, మీడియాకు, సాధారణ ప్రజలకు ఇది ఫలానా తుఫాను చెప్పడం, అర్థం చేసుకోవడం సులువు అవుగుంది. అయితే తుఫానులకు పెట్టే పేర్లు వీలయినంత చిన్నగా.. సులభంగా పలికే విధంగా ఉండాలనే నిబంధన ఉన్నది.కాగా ప్రపంచవ్యాప్తంగా ఆరు ప్రాంతీయ ప్రత్యేక వాతావరణ కేంద్రాలు, నాలుగు ప్రాంతీయ ఉష్ణమండల తుఫాను హెచ్చరిక కేంద్రాలు ఉన్నాయి. ఈ కేంద్రాలు తుఫానులకు సంబంధించి సూచనలు, సమాచారం ఇస్తుంటాయి. ఆరు ప్రాంతీయ ప్రత్యేక వాతావరణ కేంద్రాల్లో భారత వాతావరణ కేంద్రం కూడా ఒకటిగా పనిచేస్తోంది. అక్షర క్రమాన్ని అనుసరించి ఒక్కో దేశం ఒక్కో తుఫానుకు పేరును సూచిస్తాయి. ప్రతిసారి ఆ పేరు కొత్తగా, మళ్లీ పునరావృతం కాకుండా ఉండాల్సి ఉంటుంది. తుఫానులకు పేర్లు పెట్టే విషయంలో పలు నిబంధనలు ఉన్నాయి. 'తుఫాను పేరు 8 అక్షరాలకు మించరాదు. అది ఏ సభ్య దేశానికీ అభ్యంతరకరంగా ఉండకూడదు. ఏ వర్గం ప్రజల మనోభావాలను దెబ్బతీయకూడదు' అనేవి ప్రధాన నిబంధనలుగా ఉన్నాయి.

# బయటి ఒత్తిళ్లకు భారత్ తలొగ్గదు.. అమెరికాకు పుతిన్ కౌంటర్

న్యూ డిల్లీ అక్టోబర్ 3 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తోందన్న కారణంతో భారత్‌పై అమెరికా సుంకాల మోత మోగిస్తోన్న విషయం తెలిసిందే. యూస్ చర్యపై రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ తాజాగా స్పందించారు. ట్రంప్ నిర్ణయాన్ని తీవ్రంగా ఖండించారు. ఈ నిర్ణయం వాషింగ్టన్‌కే ఎదురుదెబ్బ అని హెచ్చరించారు.దక్షిణ రష్యాలోని సోచిలో జరిగిన ఓ చర్చా వేదికలో పుతిన్ మాట్లాడారు. 'రష్యా వాణిజ్య భాగస్వాములపై అధిక సుంకాలు విధిస్తే అది ప్రపంచ ఇంధన ధరలపై తీవ్ర ప్రభావం పడుతుంది. యూఎస్ ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లను ఎక్కువగా పెంచేలా చేస్తుంది. యూఎస్ ఆర్థిక వ్యవస్థ నెమ్మదిస్తుంది' అని పుతిన్ హెచ్చరించారు. అదేవిధంగా భారత్‌తో తమకు ఎప్పుడూ సమస్యలు, అంతర్రాష్ట్ర ఉద్రిక్తతలు లేవని ఈ సందర్భంగా పుతిన్ తెలిపారు. ప్రధాని మోదీ తో తనకు మంచి స్నేహం ఉందన్నారు. న్యూ ఢిల్లీ బయట ఒత్తిళ్లకు తలొగ్గదని వ్యాఖ్యానించారు. డిసెంబర్‌లో భారత్‌లో పర్యటించనున్నట్లు ఈ సందర్భంగా పుతిన్ తెలిపారు.

న్యూ డిల్లీ అక్టోబర్ 3 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తోందన్న కారణంతో భారత్‌పై అమెరికా సుంకాల మోత మోగిస్తోన్న విషయం తెలిసిందే. యూస్ చర్యపై రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ తాజాగా స్పందించారు. ట్రంప్ నిర్ణయాన్ని తీవ్రంగా ఖండించారు. ఈ నిర్ణయం వాషింగ్టన్‌కే ఎదురుదెబ్బ అని హెచ్చరించారు.దక్షిణ రష్యాలోని సోచిలో జరిగిన ఓ చర్చా వేదికలో పుతిన్ మాట్లాడారు. 'రష్యా వాణిజ్య భాగస్వాములపై అధిక సుంకాలు విధిస్తే అది ప్రపంచ ఇంధన ధరలపై తీవ్ర ప్రభావం పడుతుంది. యూఎస్ ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లను ఎక్కువగా పెంచేలా చేస్తుంది. యూఎస్ ఆర్థిక వ్యవస్థ నెమ్మదిస్తుంది' అని పుతిన్ హెచ్చరించారు. అదేవిధంగా భారత్‌తో తమకు ఎప్పుడూ సమస్యలు, అంతర్రాష్ట్ర ఉద్రిక్తతలు లేవని ఈ సందర్భంగా పుతిన్ తెలిపారు. ప్రధాని మోదీ తో తనకు మంచి స్నేహం ఉందన్నారు. న్యూ ఢిల్లీ బయట ఒత్తిళ్లకు తలొగ్గదని వ్యాఖ్యానించారు. డిసెంబర్‌లో భారత్‌లో పర్యటించనున్నట్లు ఈ సందర్భంగా పుతిన్ తెలిపారు.

# బహిరంగ సభలు, సమావేశాల్లో తాగునీరు, పారిశుద్ధ్య సౌకర్యాలు, అంబులెన్స్ సౌకర్యాలు కల్పించాలి

## -కరూర్ తొక్కిసలాట ఘటనపై విచారణ సందర్భంగా రాజకీయ పార్టీలకు మద్రాస్ హైకోర్టు కీలక సూచనలు

మద్రాస్ అక్టోబర్ 3 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ); కరూర్ తొక్కిసలాట ఘటనపై విచారణ సందర్భంగా రాజకీయ పార్టీలకు మద్రాస్ హైకోర్టు కీలక సూచనలు చేసింది. భవిష్యత్తులో నిర్వహించే బహిరంగ సభలు, సమావేశాల్లో తాగునీరు, పారిశుద్ధ్య సౌకర్యాలు, అంబులెన్స్ సేవలు, నిష్క్రమణ మార్గాలు వంటి ప్రాథమిక సౌకర్యాలు కల్పించాలని పేర్కొంది. ప్రజల ప్రాణాల రక్షణకే తొలి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించింది. ఈ క్రమంలో సీబీఐ దర్యాప్తు కోరడం సరికాదని పేర్కొంది. ఈ సందర్భంగా కోర్టులను రాజకీయ వేదికలుగా మార్చవద్దని వ్యాఖ్యానించింది. సీబీఐ దర్యాప్తు కోరుతూ బీజేపీ న్యాయవాది జీఎస్ మణి దాఖలు చేసిన పిటిషన్‌ను కూడా కోర్టు కొట్టివేసింది.

# కేంద్ర ప్రభుత్వానికి వచ్చే మూడేళ్లు కీలకం: కిషన్‌రెడ్డి



హైదరాబాద్, అక్టోబర్ 3: కేంద్ర ప్రభుత్వానికి వచ్చే మూడేళ్లు చాలా కీలకమని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ప్రతి శాఖ అనేక రిఫార్మ్స్ తీసుకువస్తోందని చెప్పుకొచ్చారు. కొత్త సమస్యలు వచ్చే అవకాశం ఉందని... వాటిని సమర్థవంతంగా ఎదుర్కోవాలని సూచించారు. బ్రిటిష్ చట్టాలు ఇప్పటికీ అమలు అవుతున్నాయని తెలిపారు. వర్తమాన ప్రజల ఆలోచనలకు అనుగుణంగా చట్టాలు తేవాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆలోచిస్తున్నారని చెప్పుకొచ్చారు. ఇవాళ(శుక్రవారం) హైదరాబాద్‌లోని బీజేపీ స్టేట్ ఆఫీస్‌లో ఆ పార్టీ స్టేట్ లీగల్ సెల్ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా కేంద్ర న్యాయ శాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘవాల్, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి హాజరయ్యారు. ఈ సమావేశంలో బీజేపీ తెలంగాణ చీఫ్ రాంచందర్ రావు, ఎంపీలు కే.లక్ష్మణ్, రఘునందన్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు.

అర్జున్ రామ్ మేఘవాల్ ఐఏఎస్‌గా ఉన్నప్పటికీ రాజీనామా చేసి కేంద్ర మంత్రి స్థాయికి ఎదిగారని ప్రశంసించారు. బీజేపీ శ్రేణులు కేంద్ర ప్రభుత్వ ఇమేజ్ పెంచే ప్రయత్నం చేయాలని దిశానిర్దేశం చేశారు. కేంద్రం పాలసీలకు అనుగుణంగా కోర్టుల్లో మనం వాదిస్తామనేది చాలా కీలకమని తెలిపారు. రానున్న మూడేళ్లు మోదీ ప్రభుత్వానికి చాలా కీలకమని ఉద్ఘాటించారు. అందుకు ప్రత్యేకమైన శిక్షణ తరగతులు నిర్వహించాలని మార్గనిర్దేశం చేశారు. కేంద్ర ప్రభుత్వ స్టాండ్ బలంగా వినిపించేందుకు ఎఫర్ట్ పెట్టాలని సూచించారు. తెలంగాణలో అధికారంలోకి బీజేపీ రావాలి అంటే అందరం కలిసి కట్టుగా పని చేయాలని దిశానిర్దేశం చేశారు కిషన్‌రెడ్డి.

### కాలం చెల్లిన చట్టాలను ప్రధాని మోదీ రద్దు చేశారు: ఎంపీ లక్ష్మణ్

కాలం చెల్లిన చట్టాలను ప్రధానమంత్రి నరేంద్రమోదీ రద్దు చేశారని బీజేపీ ఎంపీ కే.లక్ష్మణ్ తెలిపారు. దేశాన్ని ఆర్థికంగా విచ్ఛిన్నం చేసేందుకు ఇతర దేశాలు కుట్రలు పన్నుతున్నాయని విమర్శించారు. ప్రధాని మోదీ విజనరీ లీడర్ కాబట్టి వేగంగా స్పందిస్తున్నారని చెప్పుకొచ్చారు. జీఎస్టీ తగ్గింపుతో మోదీ దీపావళి వెలుగులను పేదల ఇళ్లల్లో నిప్పుతున్నారని వివరించారు. అగ్రదేశాలు అడ్డగోలు టారిఫ్‌లతో భారతదేశాన్ని ఉక్కిరిబిక్కిరి చేయాలని చూస్తున్నాయని ధ్వజమెత్తారు. ఇండియా ఎదుగుదలను చాలా దేశాలు జీర్ణించుకోలేక పోతున్నాయని ఫైర్ అయ్యారు. స్వదేశీ వస్తువుల వినియోగించడం ద్వారా.. భారతదేశ ఆదాయం ఇతర దేశాలకు వెళ్లకుండా ఉంటుందని వెల్లడించారు. దీని ద్వారా పెట్టుబడులు పెరుగుతాయని... ఇతరులకు ఉపాధి కలుగుతోందని ఎంపీ లక్ష్మణ్ పేర్కొన్నారు.

### న్యాయవాదులకు భద్రత కల్పించే చట్టాలు రావాలి: రాంచందర్ రావు

ప్రజలకు త్వరితగతిన న్యాయం దక్కాలని గత చట్టాలను రద్దు చేసి.. భారత న్యాయ సంహిత చట్టాలను మోదీ సర్కార్ తెచ్చిందని బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు రాంచందర్ రావు తెలిపారు. హైదరాబాద్ నడి రోడ్డుపై గతంలో ఓ న్యాయవాది దంపతులను నరికి చంపారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కేసు వేసిన వాళ్లను వెనక్కి తీసుకోకపోతే హత్య చేశారని చెప్పుకొచ్చారు. ఈ కేసులో సీబీఐ దర్యాప్తు ప్రస్తుతం జరుగుతోందని వివరించారు. న్యాయవాదులకు భద్రత కల్పించే చట్టాలు దేశంలో రావాలని రాంచందర్ రావు ఆకాంక్షించారు.

# నాగార్జున సాగర్ జలాశయానికి కొనసాగుతున్న వరద.. 22 గేట్లు ఎత్తివేత

హైదరాబాద్ అక్టోబర్ 3 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ):: నల్లగొండ జిల్లాలోని నాగార్జున సాగర్ ప్రాజెక్టుకు వరద కొనసాగుతోంది. ఈ క్రమంలో జలాశయం నిండుకుండలా మారింది. దీంతో సాగర్ 22 గేట్లు ఎత్తి దిగువకు 1.7 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. సాగర్ ఇన్‌ఫ్లో 2.94 లక్షల క్యూసెక్కులు, ఔట్‌ఫ్లో 2.22 లక్షల క్యూసెక్కులుగా ఉంది. నాగార్జున సాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి సామర్థ్యం 312.04 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 302.91 టీఎంసీలుగా ఉంది.శ్రీశైలం ప్రాజెక్టుకు కూడా స్థిరంగా వరద కొనసాగుతోంది. జూరాల, సుంకేశుల ప్రాజెక్టుల నుంచి శ్రీశైలం ప్రాజెక్టుకు వరద వచ్చి చేరుతుంది. శ్రీశైలం ప్రాజెక్టు ఇన్‌ఫ్లో 3,95,563 క్యూసెక్కులు కాగా, ఔట్ ఫ్లో 3,46,374 క్యూసెక్కులుగా ఉంది. శ్రీశైలం 10 స్పిల్ వే గేట్లు ఎత్తి 2,75,700 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం జలాశయం పూర్తి సామర్థ్యం 215.80 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 209.15 టీఎంసీలుగా ఉంది.

# డ్రగ్స్‌పై తెలంగాణ పోలీసుల ఉక్కుపాదం..

హైదరాబాద్, అక్టోబర్ 3:డ్రగ్స్‌పై తెలంగాణ పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. ప్రధానంగా హైదరాబాద్‌లో డ్రగ్స్ గ్యాంగుల ఆటకట్టిస్తున్నారు పోలీసులు. నైజీరియా నుంచి డ్రగ్స్ తీసుకువచ్చి హైదరాబాద్‌లో సప్లై చేస్తున్న ఓ వ్యక్తిని పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు.

పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొన్నిరోజుల క్రితం గ్రిండర్ అనే గే డేటింగ్ యాప్ ద్వారా నైజీరియాకు చెందిన వ్యక్తి జియోఫ్రీ.. హైదరాబాద్‌లో డ్రగ్స్ సప్లై చేశాడు. అయితే, ఆ వ్యక్తి కదలికలపై పోలీసులు నిఘా పెట్టారు. భాగ్యనగరానికి డ్రగ్స్ ఎక్కడి నుంచి తీసుకువస్తున్నాడు.. ఎవరెవరికి ఇస్తున్నాడనే సమాచారాన్ని తెలుసుకున్నారు. ఇందుకోసం ప్రత్యేక పోలీసు టీమ్ ను ఏర్పాటు చేశారు ఉన్నతాధికారులు. అనంతరం నిందితుడిని పట్టుకుని ఆట కట్టించారు హైదరాబాద్ పోలీసులు.

అయితే, సదరు వ్యక్తి 2019లో ఫేక్ పాస్‌పోర్ట్‌తో ఐవరీ కోస్ట్ నుంచి నేపాల్‌లోకి ప్రవేశించాడు. అక్కడి నుంచి ఇండియాకు వచ్చాడు. ఢిల్లీ నుంచి డ్రగ్స్ తీసుకొచ్చి హైదరాబాద్, బెంగుళూరులో సప్లై చేస్తున్నాడు సదరు నైజీరియన్. ఈ క్రమంలో ఆ వ్యక్తిని పట్టుకున్న పోలీసులు హైదరాబాద్ నుంచి తన సొంత దేశమైనా నైజీరియాకు పంపించారు. డ్రగ్స్ అమ్మినా, సేవించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డ్రగ్స్ జోలికెళ్లి విలువైన జీవితాన్ని నాశనం చేసుకోవద్దని హైదరాబాద్ పోలీసులు హెచ్చరిస్తున్నారు.

# అంతరిక్షంలో ఆవాసం చేయబోతున్నామా !

## (04 - 10 అక్టోబర్ "ప్రపంచ అంతరిక్ష వారోత్సవాలు" సందర్భంగా)

ప్రపంచవ్యాప్తంగా 04 నుంచి 10 అక్టోబర్ వరకు "ప్రపంచ అంతరిక్ష వారోత్సవాలు" లేదా "వరల్డ్ స్పేస్ వీక్" వేడుకలను ఘనంగా నిర్వహించుకుంటున్న శుభ సందర్భంగా ప్రపంచ మానవాళి, ముఖ్యంగా విద్యాలయాల్లో చదువుకుంటున్న విద్యార్థినీవిద్యార్థులు, యువతరం రేపటి అంతరిక్ష ఘన చరిత్రకు నేడు గట్టి పునాదులు వేయడానికి యువత పూనుకోవాలి. 04 అక్టోబర్ 1957 రోజున మానవ నిర్మిత తొలి ఉపగ్రహం 'స్పుత్నిక్-1' అంతరిక్ష కక్షలోకి ప్రవేశపెట్ట బడింది. అదే విధంగా 10 అక్టోబర్ 1967 రోజున ఐరాస చొరవతో అంతరిక్ష పరిశోధనలతో శాంతి స్థాపనకు మాత్రమే కృషి చేయాలని తీర్మానం చేయడం జరిగింది. ఈ రెండు చారిత్రాత్మక అంతరిక్ష ఘటనలకు గుర్తుగా 04 నుంచి 10 అక్టోబర్ వరకు ఈ వారోత్సవాలు పాటించడం ఆనవాయితీగా మారింది. ప్రపంచ అంతరిక్ష వారోత్సవాల్లో భాగంగా భారతదేశవ్యాప్తంగా డాక్టర్ సచిన్ బాంబా నేతృత్వంలో విద్యాలయాల్లో యువతకు అంతరిక్ష శాస్త్రం పట్ల అవగాహన కలిపిస్తూ భవిష్యత్తులో వారు అంతరిక్ష రంగాన్ని కెరీర్‌గా తీసుకునే విధంగా ప్రేరణ కల్పించడానికి కృషి జరుగుతున్నది.

### ప్రపంచ అంతరిక్ష వారోత్సవాలు-2025:

ప్రపంచ అంతరిక్ష వారోత్సవాల వేదికగా మన ఇస్రో సాధించిన ఘనకార్యాలను నేటి యువతకు వివరించడం, భారత అంతరిక్ష టెక్నాలజీలో వస్తున్న పెను ఆధునిక మార్పులను ఎక్కువుగా పెట్టడం, నేటి యువ తరాన్ని అంతరిక్ష రంగం వైపుకు ఆకర్షించడం, అంతరిక్ష రంగంలో వస్తున్న టెక్నాలజీ మార్పులను ఆసక్తికరంగా ప్రయోగ పూర్వకంగా వివరించడం లాంటి కార్యక్రమాలను నిర్వహించడం ఉచితంగా ఉంటుంది. భారతీయ యువతను 'స్టెమ్' కోర్సుల వైపు ఆకర్షించడానికి "స్పేస్ ఆన్ వీల్స్", "స్పేస్ ట్యూటర్స్"లను వినియోగించడం, అంతరిక్ష ఆవిష్కరణ గూర్చి విడమర్చా తెలుపడం, జాతీయ అభివృద్ధితో పాటు సమైక్యతను సాధించడం, విద్యాలయాల్లో అంతరిక్ష అంశాల్లో పలు పోటీలను నిర్వహించడం లాంటివి నిర్వహించాలి.

### ప్రపంచ అంతరిక్ష వారోత్సవాలు-2025 ఇతివృత్తం:

2025 ప్రపంచ అంతరిక్ష వారోత్సవాల ఇతివృత్తంగా "అంతరిక్షంలో ఆవాసం" లేదా "లివింగ్ ఇన్ స్పేస్" అనబడే అంశాన్ని తీసుకొని వివరించడం కొనసాగుతున్నది. సాంప్రదాయ ఖగోళ శాస్త్రంతో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అనుసంధానం చేస్తూ ముందుకు సాగడం ముఖ్యమని కూడా అవగాహన కల్పించడం జరుగుతోంది. అంతరిక్ష శాస్త్రం పట్ల యువత దృష్టిని ఆకర్షిస్తూ, వారిని అంతరిక్ష కోర్సుల వైపు మరల్చడం అనే ప్రధాన ఉద్దేశంతో పలు కార్యక్రమాలను పాఠశాలలు, కళాశాలల్లో నిర్వహించడం నేటి అవసరంగా భావించాలి. ఇస్రో శాస్త్రవేత్తలతో ముఖాముఖి, ప్లానిటోరియం సందర్శనం, శాస్త్రజ్ఞులతో ప్రసంగాలు, అంతరిక్ష అంశాల్లో పోటీలు, శుభాంశ్ శుక్లా లాంటి వ్యోమగాములతో ప్రసంగాలు లాంటివని ఏర్పాటు చేయడం వల్ల మంచి ఆశించిన ఫలితాలు సిద్ధిస్తాయని నమ్మాలి.

మన ప్రతిష్టాత్మక ఇస్రో విభాగం మన జాతి గౌరవవేతనం చిహ్నంగా ప్రస్తుతించాలి. భారత అంతరిక్ష పరిశోధనలతో మానవాళికి ఎనలేని ప్రయోజనాలు ఒనగూరుతాయని తెలుసుకోవాలి. కమ్యునికేషన్స్, వాతావరణ మార్పులు, విపత్తుల ముందస్తు అంచనాలు, టెలివిజన్ ప్రసారాలు, వ్యవసాయరంగ ప్రయోజనాలు, విపత్తు నివారణ చర్యలకు ఉపక్రమించడం, దేశ ఆర్థికాభివృద్ధి, జీవన ప్రమాణాలు పెరగడం, స్మార్ట్‌ఫోన్,/ ఆన్‌లైన్ లాంటి అనువర్తనాలను కలిగిస్తున్న ఇస్రో సేవలకు కృతజ్ఞతలు తెలియజేద్దాం, అంతరిక్ష శాస్త్రవేత్తలకు సలాం కొడదాం.

-డా॥బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

# ప్రసిద్ధ శాస్త్రీయ సంగీత విద్వాంసుడు పండిట్ ఛన్నులాల్ మిశ్రా మృతికి ప్రధానమంత్రి సంతాపం

న్యూఢిల్లీ, అక్టోబర్ 3:ప్రసిద్ధ శాస్త్రీయ సంగీత విద్వాంసుడు శ్రీ పండిట్ ఛన్నులాల్ మిశ్రా మరణంపై ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఈ రోజు తీవ్ర విచారం వెలిబుచ్చారు. భారతీయ కళాసంస్కృతులకు ఆయన తన జీవితాన్ని అంకితమిచ్చారని ఈ సందర్భంగా కొనియాడారు.

కాశీ సంప్రదాయాల్లో అంతర్భాగమైన హిందూస్థానీ శాస్త్రీయ సంగీత పాఠశాల 'బనారస్ ఘరానా' వ్యవస్థాపకులలో పండిట్ జీ ఒకరు. ఆయన ఆలపించిన గీతాలు ఈ నగర సంగీత వారసత్వాన్ని శ్రోతలకు విశదం చేస్తాయి. తన సంగీత వారసత్వాన్ని అసంఖ్యాక సంగీత విద్యార్థులకు సంక్రమింపజేయడం ద్వారా కాశీ నగర సంగీత సంప్రదాయాల పరిరక్షణ, వ్యాప్తికి ఆయన తన వంతు కృషి చేశారు. వారణాసిలోని తన నివాసాన్ని సంగీతాభ్యాస, భక్తి, కళా నైపుణ్య కూడలిగా తీర్చిదిద్దారు.

ఈ నేపథ్యంలో పండిట్ జీతో తన అనుబంధాన్ని ప్రధానమంత్రి స్మరించుకున్నారు. ముఖ్యంగా 2014 లోక్‌సభ ఎన్నికల్లో వారణాసి నుంచి తాను పోటీ చేసినపుడు తన ప్రతిపాదకుడుగా సంతకం చేయడం ద్వారా ఆయన ఆశీస్సులు, మద్దతు లభించడం తన అదృష్టమని అభివర్ణించారు. నగరం మీద, పురోగమిస్తున్న దాని వారసత్వంపైనా ఆయనకుగల ప్రగాఢ నిబద్ధతకు ఇది ప్రతీక అని పేర్కొన్నారు.

పండిట్ జీ తనపై చూసిన ఆదరాభిమానాలు, కురిపించిన ఆశీస్సుల గురించి తరచూ ప్రస్తావిస్తూ- అదంతా తనకు దక్కిన అదృష్టంగా భావిస్తానని శ్రీ మోదీ వ్యాఖ్యానిస్తారు. భారత ప్రాచీన సంప్రదాయాలు, ఆధ్యాత్మిక ఔన్నత్యం, సంస్కృతుల పరిణామాత్మక శక్తిపై గౌరవాన్ని వారిద్దరి అనుబంధం ప్రతిబింబిస్తుంది.

భారత శాస్త్రీయ సంగీత రంగంలో విశిష్ట కృషికిగాను ప్రస్తుత ప్రభుత్వం 2020లో దేశ రెండో అత్యున్నత పౌర పురస్కారం 'పద్మవిభూషణ్'తో పండిట్ ఛన్నులాల్ మిశ్రాను సత్కరించింది.

పండిట్ జీ వారసత్వం సంగీత, కళాసాంస్కృతిక ఔత్సాహికులకు తరతరాల పాటు సదా స్ఫూర్తినిస్తుందని ఈ సందర్భంగా శ్రీ మోదీ వ్యాఖ్యానించారు.

ఈ మేరకు సామాజిక మాధ్యమం 'ఎక్స్' ద్వారా పంపిన సందేశంలో:

"ప్రసిద్ధ శాస్త్రీయ సంగీత విద్వాంసుడు శ్రీ పండిట్ చన్నులాల్ మిశ్రా కన్నుమూశారన్న సమాచారం నన్ను తీవ్రంగా కలచివేసింది. భారతీయ కళాసంస్కృతులను సుసంపన్నం చేయడానికి ఆయన తన జీవితాన్ని అంకితం చేశారు. అంతర్జాతీయ వేదికలపై భారత శాస్త్రీయ సంగీత సంప్రదాయాలను చాటడానికి విశేషంగా కృషి చేశారు. అంతేకాకుండా తన సంగీత వారసత్వాన్ని ప్రజలకు సంక్రమింపజేశారు. ఆయన ప్రేమాభిమానాలను, ఆశీర్వాదాలను పొందే అదృష్టం నాకు దక్కింది. వారణాసి నియోజకవర్గం నుంచి నేను 2014లో పోటీ చేసినపుడు ఆయన నా ప్రతిపాదకుడుగా వ్యవహరించడం నాకొక చిరస్మరణీయ జ్ఞాపకం. ఈ విషాద సమయాన పండిట్ జీ కుటుంబ సభ్యులకు, అభిమానులకు నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను. ఓం శాంతి!" అని ప్రధానమంత్రి పేర్కొన్నారు.

# నెల్లూరులో మెడికో ఆత్మహత్య..

## -సంతజూటూరు కన్నీరు మున్నీరు

నంద్యాల, అక్టోబర్ 3: తండ్రి సాధారణ రైతు. అక్క ఆత్మహత్య చేసుకుంది. అమ్మానాన్న తల్లడిల్లిపోయారు. బాగా చదవాలి డాక్టరవ్వాలి అనుకుంది. అలాగే పోటాపోటీగా చదివింది. ఎంబీబీఎస్ సీటు సాధించింది. ఏం జరిగిందో.. ఈ చిట్టి తల్లి డాకరమ్మ కాకుండానే ఆఎందరినో కంటతడి పెట్టిస్తున్న ఈ ఘటన నంద్యాల జిల్లా బండి ఆత్మకూరు మండలం సంత జూటూరు గ్రామస్థుల్ని దుఃఖసాగరంలో ముంచింది.

సంత జూటూరు గ్రామానికి చెందిన బన్నెల సంజీవరాయుడు ఓ సాధారణ రైతు. ఆమె భార్య లక్ష్మీదేవి. వీరికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. పెద్ద కుమార్తె రెండేళ్ల కిందట కడుపునొప్పి తాళలేక ఆత్మహత్య చేసుకుంది. రెండవ కుమార్తె గీతాంజలి మనోస్థైర్యంతో కష్టపడి చదివి ఎంబీబీఎస్ సీటు సంపాదిం చింది.

ఇక కుమారుడు ఇంటర్మీడియట్ చదువుతున్నాడు. ఇక గీతాంజలి నెల్లూరులో ఏసీ సుబ్బారెడ్డి మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ ఫస్టియర్ చదువుతోంది. తల్లిదండ్రుల ఆనందానికి అవధి లేదు. అంతలోనే అమ్మానాన్న ఆనందం ఆవిరైపోయింది.

దసరా పండగకి గీతాంజలి ఇంటికి వచ్చింది. కానీ ఏమి జరిగిందో.. అకస్మాత్తుగా ప్రాక్టికల్ పరీక్షలు ఉన్నాయి, ప్రిపేర్ కావాలని నెల్లూరుకు వెళ్ళింది. శుక్రవారం ఉదయం తన సన్నిహితులతో జోష్ గానే మాట్లాడిం ది. టిఫిన్ చేసింది. మరో అరగంటలో తన గదిలో ఉరివేసుకుని ప్రాణాలు తీసేపుకుంది.

ఈ దృశ్యం చూసిన విద్యార్థినులు హాస్టల్లో గీతాంజలి ఆత్మహత్య చేసుకుందని సమాచారం ఇచ్చారు. నెల్లూరు పోలీసులు కేసు నమోదు చేశారు. దర్యాప్తు జరుపుతున్నారు. ఇద్దరు కుమార్తెలూ అర్ధరంతరంగా బల్వన్మరణం చెందటంతో ఆ తల్లిదండ్రుల బాధ వర్ణనాతీతం.

గీతాంజలి మనో ధైర్యశీలి. చిన్నప్పటి నుంచి శ్రమించే మనస్త త్వం. ఎవ్వరతోనూ వివాదాల జోలికి వెళ్ళేది కాదు, అని బంధువులు చెబుతున్నారు. అక్కడ ఏమైంది అనేది ఎవరికి తెలియటం లేదు. తల్లిదండ్రులు బంధువులు హుటా హుటిన నెల్లూరుకి వెళ్లారు.

# కలెక్టర్‌తో ఎంపీ, ఎమ్మెల్యే భేటీ



అమరావతి, అక్టోబర్ 3:విజయనగరం సిరిమానోత్సవం ఏర్పాట్లపై పార్లమెంట్ సభ్యులు కలిశెట్టి అప్పలనాయుడు , ఎమ్మెల్యే పూసపాటి అదితి గజపతి రాజు శుక్రవారం జిల్లా కలెక్టర్ ఎస్.రామ్ సుందర్ రెడ్డితో కలిసి సమీక్షించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. గత ఏడాది నిర్వహించిన అన్ని వేదికల్లో కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, వెన్యూ ఇంచార్జ్ అధికారులంతా ఏర్పాట్లలో నిమగ్నమై ఉన్నారని కలెక్టర్ పేర్కొన్నారు.

అమ్మవారి గుడి నుంచి బొంకుల దిబ్బ వరకు నిర్వహించే ర్యాలీని జిల్లా ఇంచార్జ్ మంత్రి వంగలపూడి అనిత హాజరై, ప్రారంభిస్తారని కలెక్టర్ తెలిపారు. ప్రజా ప్రతినిధులంతా ప్రారంభోత్సవ కార్యక్రమానికి రావాలని కలెక్టర్ కోరారు. బొంకుల దిబ్బ వద్ద ప్రారంభమైన తర్వాత మిగిలిన అన్ని వేదికల్లో కార్యక్రమాలు జరుగుతాయని వివరించారు. ఉత్సవాలను ఘనంగా నిర్వహించడానికి అధికారులు, ప్రజలు, ప్రజా ప్రతినిధులు సహకరించాలని కోరారు.

## పాకిస్తాన్ వైమానిక రక్షణ వ్యవస్థలోని లోపాలను బహిర్గతం చేసి..

# భారత నిర్ణయాత్మక సామర్థ్యాన్ని నిరూపించిన ఆపరేషన్ సిందూర్: రక్షణ మంత్రి శ్రీ రాజ్‌నాథ్ సింగ్

న్యూఢిల్లీ, అక్టోబర్ 3:విజయదశమి సందర్భంగా గుజరాత్‌లోని భుజ్ మిలిటరీ స్టేషన్‌లో రక్షణ మంత్రి శ్రీ రాజ్‌నాథ్ సింగ్ ఈ రోజు ఆయుధ పూజ నిర్వహించారు. ఆపరేషన్ సిందూర్ సందర్భంగా భారత రక్షణ వ్యవస్థపై దాడికి పాకిస్తాన్ చేసిన ప్రయత్నాలను విజయవంతంగా అడ్డుకున్న భారత సాయుధ దళాలను రక్షణ మంత్రి ప్రశంసించారు. "లే నుంచి సర్ క్రీక్ సెక్టార్ వరకు పాకిస్తాన్ భారత రక్షణలోని భూభాగంలోకి చొచ్చుకువచ్చేందుకు ప్రయత్నించింది.. కానీ భారత దళాల వేగవంతమైన, ప్రభావవంతమైన ప్రతిఘటన పాకిస్తాన్ వైమానిక రక్షణ వ్యవస్థలోని బలహీనతలను బహిర్గతం చేసింది. భారత్ తాను ఎంచుకున్న సమయంలో, ప్రదేశంలో, పద్ధతిలో భారీ నష్టాన్ని కలిగించగలదని ప్రపంచానికి స్పష్టమైన సందేశాన్ని పంపింది" అని ఆయన వ్యాఖ్యానించారు.

చర్చల ద్వారా సమస్యను పరిష్కరించడానికి భారత్ పదేపదే ప్రయత్నిస్తున్నప్పటికీ.. స్వాతంత్ర్యం వచ్చి 78 సంవత్సరాలు గడిచినా సర్ క్రీక్ సెక్టార్ విషయంలో పాకిస్తాన్ వివాదాలు సృష్టిస్తూనే ఉందన్నారు. సర్ క్రీక్ సెక్టార్‌లో పాకిస్తాన్ ఇటీవల సైనిక మౌలిక సదుపాయాలను విస్తరించడం దాని దురుద్దేశాన్ని ప్రతిబింబిస్తుందని ఆయన తెలిపారు. సర్ క్రీక్ సెక్టార్‌లో పాకిస్తాన్ చేసే ఏదైనా దుస్సాహసానికి ప్రయత్నిస్తే, నిర్ణయాత్మక ప్రతిస్పందన తప్పదని రక్షణ మంత్రి హెచ్చరించారు. "సర్ క్రీక్ సెక్టార్‌లో పాక్ దుస్సాహసం చేసే పక్షంలో, భారత్ ఇచ్చే సమాధానం చాలా బలంగా ఉంటుంది. అది చరిత్రను, భౌగోళిక రూపురేఖలనూ మారుస్తుంది. 1965లో భారత సైన్యం లాహోర్‌కు చేరుకోవడం ద్వారా తమ ధైర్యాన్ని చూపించింది.. 2025లో కరాచీకి వెళ్లే మార్గం క్రీక్ గుండానే వెళుతుందని పాకిస్తాన్ గుర్తుంచుకోవాలి" అని ఆయన వ్యాఖ్యానించారు.

రికార్డు సమయంలో ఆపరేషన్ సిందూర్ విజయవంతం కావడం పట్ల రాజ్‌నాథ్ సింగ్ ప్రశంసలు కురిపించారు. సాయుధ దళాల సంపూర్ణ సహకారం వల్లే ఇది సాధ్యమైందన్నారు. ఎటువంటి పరిస్థితుల్లోనైనా తన ప్రత్యర్థులను ఓడించగల భారత్ సామర్థ్యాన్ని నిరూపించిన సైనికులు-అధికారుల వ్యూహం, ధైర్యం, సామర్థ్యాలను ఆయన అభినందించారు.

ఆపరేషన్ సిందూర్ ప్రధాన లక్ష్యం ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడమే అయినా సంఘర్షణలు చెలరేగకుండా భారత్ సంయమనాన్ని ప్రదర్శించిందని రక్షణ మంత్రి స్పష్టం చేశారు. ఆపరేషన్ సిందూర్ ద్వారా సైనిక లక్ష్యాలన్నీ విజయవంతంగా సాధించడం పట్ల ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. ఉగ్రవాదంపై భారత్ పోరాటం పూర్తి దృఢ సంకల్పంతో కొనసాగుతుందని పునరుద్ఘాటించారు. భారత సాయుధ దళాలూ, సరిహద్దు భద్రతా దళం నిరంతర అప్రమత్తతో దేశ సరిహద్దులను కాపాడుతున్నాయని రక్షణ మంత్రి తెలిపారు.

ఆయుధ పూజ కేవలం ఒక ఆచారం మాత్రమే కాదనీ.. భారత నాగరికతలోని తాత్వికతను ప్రతిబింబిస్తుందని సాయుధ దళాలనుద్దేశించి చేసిన ప్రసంగంలో శ్రీ రాజ్‌నాథ్ సింగ్ స్పష్టం చేశారు. ఆయుధాలను హింసకు సాధనాలుగా కాకుండా ధర్మ పరిరక్షణ సాధనాలుగా పరిగణిస్తారని తెలిపారు. రైతులు నాగలిని పూజించడం.. విద్యార్థులు తమ పుస్తకాలను గౌరవించడం.. సైనికులు తమ ఆయుధాలను గౌరవించడం భారత సంప్రదాయంలోని గొప్పతమని ఆయన పేర్కొన్నారు. న్యాయం-ధర్మాన్ని కాపాడుకోవడానికే ఆయుధాలను ఉపయోగించాలని ఆయన స్పష్టం చేశారు.

"తనను తాను రక్షించుకునే శక్తి లేని జ్ఞానం దుర్బలమైనది. జ్ఞాన మార్గదర్శనం లేని శక్తి గందరగోళానికి దారితీస్తుంది. శాస్త్రం- శస్త్రం సమతుల్యత మన నాగరికతను శక్తిమంతంగా, అజేయంగా ఉంచుతుంది," అని రక్షణ మంత్రి వ్యాఖ్యానించారు.

ఎల్లప్పుడూ జ్ఞానంతో సుసంపన్నంగా ఉండే భారత్ నేడు రక్షణ తయారీలోనూ స్వయం-సమృద్ధి సాధిస్తున్నదని రక్షణ మంత్రి తెలిపారు. ఆత్మనిర్భర్ భారత్ దార్శనికతకు అనుగుణంగా భారత్ రక్షణ పరికరాల తయారీదారుగా, ఎగుమతిదారుగా అభివృద్ధి చెందుతోందన్నారు.

సైన్యం, నావికాదళం, వైమానిక దళాల సమష్టి పనితీరునూ శ్రీ రాజ్‌నాథ్ సింగ్ ప్రశంసించారు. ఈ త్రివిద దళాలను భారత జాతీయ భద్రతకు మూడు బలమైన స్తంభాలుగా ఆయన అభివర్ణించారు. ఈ రంగంలో నిర్వహించిన వరుణాస్త్ర ప్రక్రియను గురించి ప్రస్తావిస్తూ.. ఇది త్రివిధ దళాల సంయుక్త కార్యాచరణ సామర్థ్యాన్నీ, ఏదైనా ముప్పును తిప్పికొట్టడంలో వారి సంసిద్ధతను ప్రదర్శించిందన్నారు.

శస్త్ర ప్రాముఖ్యతను స్పష్టం చేస్తూనే దేశ సరిహద్దుల్లోని సవాళ్లనూ రక్షణ మంత్రి ప్రస్తావించారు. సవాళు ఎప్పుడూ సరళంగా ఉండవనీ, అవి వేర్వేరు రూపాల్లో వస్తాయని ఆయన అన్నారు. "కొన్నిసార్లు ఈ సవాళ్లు విదేశీ దురాక్రమణ రూపంలో, కొన్నిసార్లు ఉగ్రవాద సంస్థలుగా, నేటి ప్రపంచంలో సైబర్ యుద్ధం, సమాచార యుద్ధం రూపంలోనూ కనిపిస్తాయి" అని ఆయన తెలిపారు.

విజయదశమి సందర్భంగా అందరికీ శుభాకాంక్షలు తెలిపిన శ్రీ రాజ్‌నాథ్ సింగ్.. చెడు ఎంత శక్తిమంతమైనదిగా కనిపించినప్పటికీ చివరికి విజయం సాధించేది ధర్మమేనని ఈ పండగ మనకు గుర్తుచేస్తుందన్నారు. "ఈ రోజున ఆయుధ పూజ భారత జాతీయ జీవనంతో లోతుగా ముడిపడి ఉంది. దేశ సమష్టి బలం, భద్రత, స్వేచ్ఛ పట్ల గౌరవాన్ని ఇది సూచిస్తుంది" అని ఆయన వ్యాఖ్యానించారు. సాయుధ దళాల ధైర్యం, వ్యూహం, సామర్థ్యాలనూ రక్షణ మంత్రి ప్రశంసించారు. వారి సంసిద్ధత, సంకల్పం భారత సార్వభౌమత్వాన్నీ, సమగ్రతను ఎల్లప్పుడూ కాపాడుతూనే ఉంటుందన్నారు.

మహాత్మాగాంధీ జయంతి సందర్భంగా ఆయనకు నివాళు లర్పించిన రక్షణ మంత్రి.. మహాత్మాగాంధీని నైతిక ధైర్యానికి అసలైన ఉదాహరణగా అభివర్ణించారు. గాంధీజీ తన ఆత్మ శక్తితో మాత్రమే ఆ కాలంలోని బలమైన సామ్రాజ్యాన్ని తలవంచేలా చేశారని ఆయన వ్యాఖ్యానించారు. "మన సైనికులు ధైర్యం, ఆయుధాలు రెండింటినీ కలిగి ఉన్నారు. వారి సంకల్పం ముందు ఏ సవాలూ నిలువలేదు" అని ఆయన స్పష్టం చేశారు.

వ్యూహాత్మక క్రీక్ సెక్టార్‌లో టైడల్ ఇండిపెండెంట్ బెర్తింగ్ ఫెసిలిటీ, జాయింట్ కంట్రోల్ సెంటర్ (జేసీసీ)లనూ రక్షణ మంత్రి శ్రీ రాజ్‌నాథ్ సింగ్ వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ సౌకర్యాలు సమగ్ర తీరప్రాంత కార్యకలాపాలకు ఎంతో సహాయకరంగా ఉంటాయన్నారు. అదే సమయంలో ఉమ్మడి కార్యాచరణ సామర్థ్యాన్ని, తీరప్రాంత భద్రతా సమన్వయాన్ని, ఏవైనా ముప్పుల కోసం వేగవంతమైన ప్రతిస్పందననూ ఇవి గణనీయంగా మెరుగుపరుస్తాయని తెలిపారు. భుజ్ మిలిటరీ స్టేషన్‌లోని బలగాలతో రక్షణ మంత్రి సంభాషించారు.

ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది, సదరన్ ఆర్మీ కమాండర్ లెఫ్టినెంట్ జనరల్ ధీరజ్ సేథ్, జోధ్‌పూర్‌లోని 12 కార్ప్స్ కమాండర్.. లెఫ్టినెంట్ జనరల్ ఆదిత్య విక్రమ్ సింగ్ రాఠీ, ఎయిర్ ఆఫీసర్ కమాండింగ్, భుజ్ ఎయిర్ ఫోర్స్ స్టేషన్, ఎయిర్ కమోడోర్ కేపీఎస్ ధామ్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# బాపట్లలో 250 మందికి శిక్షణ



బాపట్ల,అక్టోబర్ 3:విద్యార్థులను భావి భారత పౌరులుగా తీర్చిదిద్దే భాధ్యత ఉపాధ్యాయులు లపై ఉందని, ప్రభుత్వం అందిస్తున్నశిక్షణ ను అవగాహన చేసుకుని భవిష్యత్తులో ఉత్తమ ఉపాధ్యాయులు గా ఎదగాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వాసుదేవ వినోద్ కుమార్అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన డీఎస్సీలో నూతనంగా ఎంపికైన ఉపాధ్యాయులు ల శిక్షణ తరగతులను శుక్రవారం బాపట్ల ఫార్మసి కాలేజీ లో ఆయన ప్రారంభించారు.

జోన్ 3 పరిధిలోని ఉమ్మడి గుంటూరు కృష్ణా, ప్రకాశం జిల్లాలో పరిధిలో ఎంపికైన ఉపాధ్యాయులకు బాపట్ల, చీరాల, ఒంగోలు ప్రాంతాల లో శిక్షణ తరగతులు 8 రోజులపాటు నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి పురుషోత్తం తెలిపారు.

బాపట్లబాపట్ల ఫార్మసీ కళాశాలలో 250 మంది వివిధ విభాగాలకు చెందిన ఉపాధ్యాయులు శిక్షణ తరగతుల్లో పాల్గొన్నారు. వీరందరికీ ఆడియో, వీడియో విజువల్స్ ద్వారా రిసోర్స్ పర్సన్స్ వివిధ అంశాలపై శిక్షణ అందిస్తున్నారు. శిక్షణకు సంబంధించిన పుస్తకాలను అందిస్తున్నారు. శిక్షణ సంస్థ నిర్వాహకులు అనంత నగేష్, జిల్లా అధికారులు శిక్షణా తరగతులను పర్యవేక్షిస్తున్నారు.

# స్వచ్ఛత పరిరక్షణ, రికార్డుల నిర్వహణతో పాటు ఎలక్ట్రానిక్ వ్యర్థాల తొలగింపుపై ప్రధాన దృష్టి

న్యూఢిల్లీ, అక్టోబర్ 3:జవాబుదారుతనంతో కూడిన పాలనకూ, సువ్యవస్థిత పాలన సంబంధిత కార్య ప్రణాళికకూ కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖలో భాగమైన యువజన వ్యవహారాల విభాగం మార్గదర్శకంగా నిలుస్తోంది. 'ప్రత్యేక ప్రచార ఉద్యమం 4.0' (స్పెషల్ క్యాంపెయిన్ 4.0)లో సాధించిన విజయాల ఆధారంగా, ఈ విభాగం స్పెషల్ క్యాంపెయిన్ 5.0 కోసం సన్నాహక చర్యలను మొదలుపెట్టింది. ఈ సారి స్వచ్ఛత, రికార్డుల నిర్వహణలతో పాటు 'ఈ-వేస్ట్ మేనేజ్‌మెంట్ రూల్స్ - 2022'కు అనుగుణంగా ఎలక్ట్రానిక్ వ్యర్థాలను బాధ్యత తీసుకొని తొలగించడం సహా దీర్ఘకాల ప్రాతిపదికన అమలు చేసే పద్ధతులపైన దృష్టి సారిస్తోంది.

స్పెషల్ క్యాంపెయిన్ 4.0ను కిందటి ఏడాది అక్టోబరు 2 నుంచి అక్టోబరు 31 వరకు నిర్వహించారు. అప్పట్లో యువజన వ్యవహారాల విభాగంతో పాటు ఆ విభాగానికి చెందిన జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్), నెహ్రూ యువ కేంద్ర సంఘటన్, రాజీవ్ గాంధీ జాతీయ యువజన వికాస సంస్థ కలిసి దీనిలో పాల్గొన్నాయి.

పార్లమెంటు సభ్యులు నివేదించిన అంశాలు, పార్లమెంటులో ఇచ్చిన హామీలు, పీజీ అప్పీళ్లలో అసంపూర్తిగా ఉండిపోయిన పనులను చాలా వరకు పూర్తి చేశారు. రికార్డులకు ఒక చక్కని పద్ధతిని పాటించడమే కాక, తుక్కును కూడా వదిలించుకున్నారు. ఔ స్వచ్ఛత పరిరక్షణ కార్యక్రమాలను పెద్ద ఎత్తున అమలు చేశారు.

దేశవ్యాప్తంగా సముద్ర తీర ప్రాంతాలలో పారిశుధ్య కార్యక్రమాన్ని కూడా చేపట్టారు. ఈ కార్యక్రమంలో భాగంగా 700 బీచులు, కోస్తా ప్రాంతాల్లో సీనియర్ అధికారులు, 6.22 లక్షల మంది మై భారత్ స్వచ్ఛంద సేవకులు వివిధ పారిశుధ్య పనుల్లో పాలుపంచుకున్నారు. ఇలాంటిదే ఒక కార్యక్రమాన్ని కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల శాఖ మంత్రి డాక్టర్ మన్‌సుఖ్ మాండవియా నాయకత్వంలో గుజరాత్లోని పోర్‌బందర్ బీచ్‌లో నిర్వహించారు.

"స్వచ్ఛతా హీ సేవా" ప్రచార ఉద్యమంలో భాగంగా, ఒక లక్షా ఇరవై తొమ్మిది వేల కన్నా ఎక్కువ కార్యకలాపాలను దేశమంతటా నిర్వహించి, 15.82 లక్షల కిలోల ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించారు. పరిశుభ్రత విషయంలో మన నడవడికను మార్చుకోవాలని సూచించే కార్యకలాపాలతో పాటు, 'మై భారత్' పోర్టల్‌లో 15,400 కన్నా ఎక్కువ కార్యక్రమాలతో తోడ్పాటును అందించారు.

ఈ నెల 2 నుంచి ఈ నెలాఖరు వరకు అమలు చేసే 'స్పెషల్ క్యాంపెయిన్ 5.0'లో భాగంగా, ప్రధానమంత్రి కార్యాలయం, పార్లమెంటు సభ్యులకూ, రాష్ట్ర ప్రభుత్వాలకూ సంబంధించి అపరిష్కృత వ్యవహారాలను పరిష్కరించడంపై యువజన వ్యవహారాల విభాగంతో పాటు ఆ విభాగానికి చెందిన సంస్థలు దృష్టి పెడతాయి. పరిపాలన సంస్కరణలు, ప్రజా ఫిర్యాదుల విభాగం (డీఏఆర్‌పీజీ) జారీ చేసిన ఆదేశాలకు అనుగుణంగా ఈ పనిని చేపడతారు. వ్యవస్థీకృత సమీక్ష, రికార్డుల నిర్వహణ, ప్రజా ఫిర్యాదులు, పార్లమెంటులో ఇచ్చిన హామీలు, తుక్కును అమ్మివేయడం, కార్యాలయాల్లోనూ, క్షేత్రీయ యూనిట్లలోనూ స్వచ్ఛత పరిరక్షణ కార్యకలాపాలపై మరింత శ్రద్ధ వహిస్తారు.

స్వచ్ఛ్ భారత్ ఉద్యమ స్ఫూర్తిని పటిష్ఠపరిచే ప్రచార ఉద్యమాలు, స్వచ్ఛతా పరిరక్షణ కార్యక్రమాల పట్ల చైతన్యాన్ని పెంచుతూ, ఆయా కార్యక్రమాల్లో పాల్గొనేందుకు దేశం నలు మూలలా ఎన్ఎస్ఎస్‌తో పాటు మై భారత్ సంస్థల యువ స్వచ్ఛంద సేవకులను సన్నద్ధం చేస్తారు.

## అస్సాంలో ఎన్ హెచ్ -715 లోని కాలీబోర్ - నుమాలిగఢ్ సెక్షన్ రహదారిని

# 4 లైన్లుగా వెడల్పు చేయడానికి, మెరుగుపరచడానికి క్యాబినెట్ ఆమోదం

న్యూఢిల్లీ, అక్టోబర్ 3:అస్సాంలో కాజీరంగా జాతీయ పార్కు (కేఎన్పీ) మార్గంలో ప్రతిపాదించిన వన్యప్రాణుల సంరక్షణ చర్యలను అమలు చేయడంతో సహా, జాతీయ రహదారి 715 లోని కాలీబోర్ - నుమాలిగఢ్ సెక్షన్ రహదారిని నాలుగు లైన్లుగా వెడల్పు చేయడానికి, మెరుగుపరచడానికి ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన ఆర్థిక వ్యవహారాల క్యాబినెట్ కమిటీ (సీసీఈఏ) ఆమోదం తెలిపింది. ఇంజినీరింగ్, ప్రొక్యూర్మెంట్, కన్ స్ట్రక్షన్ (ఈపీసీ) పద్ధతిలో మొత్తం 85.675 కిలోమీటర్ల పొడవున రూ 6957 కోట్ల పెట్టుబడి వ్యయంతో ఈ ప్రాజెక్టును అమలు చేస్తారు.

ప్రస్తుతం ఎన్ హెచ్ - 715 (పాత ఎన్ హెచ్ -37) లోని కాలీబోర్ - నుమాలిగఢ్ మార్గం రెండు లైన్లుగా జఖలాబంధ (నాగావ్), బోకాఖత్ (గోలాఘాట్) పట్టణాలలోని ప్రాంతాలను కలుపుతోంది. ఇందులో కొంతభాగం పేవ్ మెంట్ తోను, కొంతభాగం పేవ్ మెంట్ లేకుండా ఉంది. ప్రస్తుత రహదారిలో అధిక భాగం కాజీరంగా జాతీయ పార్క్ మీదుగా లేదా పార్క్ దక్షిణ సరిహద్దు వెంబడి వెళుతుంది. దీనికి 16 నుంచి 32 మీటర్ల పరిమిత రైట్ ఆఫ్ వే (ఆర్ఓడబ్ల్యు) ఉంది. దీనికి తోడు రోడ్డు నిర్మాణ లోపాలు పరిస్థితిని మరింత క్లిష్టతరం చేశాయి. వర్షాకాలంలో, పార్కు లోపలి ప్రాంతం ముంపునకు గురవుతోంది. దీనివల్ల వన్యప్రాణులు పార్కు నుంచి ఎత్తయిన కర్బీ-ఆంగ్లాంగ్ కొండల వైపు వెళ్లడానికి ప్రస్తుత రహదారిని దాటాలి. అయితే, రహదారిపై రాత్రింబవళ్లు ఉండే భారీ ట్రాఫిక్ కారణంగా, వన్యప్రాణులు తరచుగా ప్రమాదాలకు గురై మరణిస్తున్నాయి.

ఈ సవాళ్లను పరిష్కరించడానికి, ఈ ప్రాజెక్ట్‌లో భాగంగా కాజీరంగా జాతీయ పార్క్ నుంచి కర్బీ - ఆంగ్లాంగ్ కొండల వరకు వన్యప్రాణులకు అడ్డంకుల్లేకుండా స్వేచ్ఛగా రాకపోకలు సాగించేందుకు దాదాపు 34.5 కిలోమీటర్ల ఎలివేటెడ్ కారిడార్‌ను నిర్మిస్తారు. ఇప్పటికే ఉన్న 30.22 కిలోమీటర్ల రహదారిని అప్‌గ్రేడ్ చేయడంతో పాటు జఖలాబంధ, బోకాఖత్ చుట్టూ 21 కిలోమీటర్ల గ్రీన్‌ఫీల్డ్ బైపాస్‌లను కూడా నిర్మిస్తారు. ఇది కారిడార్‌లో రద్దీని తగ్గిస్తుంది. భద్రతను మెరుగుపరుస్తుంది. గౌహతి (రాష్ట్ర రాజధాని), కాజీరంగా జాతీయ పార్క్ (పర్యాటక ప్రదేశం), నుమాలిగఢ్ (పారిశ్రామిక పట్టణం) మధ్య అనుసంధానాన్ని పెంచుతుంది.

ప్రాజెక్ట్ అలైన్‌మెంట్ 2 ప్రధాన జాతీయ రహదారులు (ఎన్ హెచ్-127, ఎన్ హెచ్ -129), ఒక రాష్ట్ర రహదారి (ఎస్ హెచ్ - 35 )తో అనుసంధానమై అస్సాం అంతటా కీలక ఆర్థిక, సామాజిక, రవాణా కేంద్రాలకు నిరంతర అనుసంధానాన్ని అందిస్తుంది. అప్‌గ్రేడ్ చేసిన కారిడార్ 3 రైల్వే స్టేషన్లు (నాగావ్, జఖలబంధ, విశ్వనాథ్ చార్లీ), 3 విమానాశ్రయాలు (తేజ్‌పూర్, లియాబరి, జోర్హాట్) లతో అనుసంధానం కావడం ద్వారా మల్టీమోడల్ సమన్వయాన్ని మెరుగుపరుస్తుంది. తద్వారా ఈ ప్రాంతమంతటా వస్తువుల, ప్రయాణికుల వేగవంతమైన రాకపోకల్ని సులభతరం చేస్తుంది.

# అవగాహన ఒప్పందాలు చేసుకోనున్న ఎన్ఐఈఎల్ఐటీ: శ్రీ అశ్వినీ వైష్ణవ్

న్యూఢిల్లీ, అక్టోబర్ 3:ఢిల్లీలో ఎన్ఐఈఎల్ఐటీ డిజిటల్ విశ్వవిద్యాలయాన్ని (ఎన్డీయూ) కేంద్ర రైల్వేలు, ఎలక్ట్రానిక్స్- ఐటీ, సమాచార-ప్రసార శాఖల మంత్రి శ్రీ అశ్వినీ వైష్ణవ్ ప్రారంభించారు. అధిక నాణ్యతతో కూడిన డిజిటల్ విద్యను అందరికి అందుబాటులోకి తీసుకొచ్చేందుకు ఈ వేదికను రూపొందించారు.

ఇది ఏఐ, సైబర్ భద్రత, డేటా సైన్స్, సెమీకండక్టర్లు, అనుబంధ రంగాల వంటి ప్రత్యేకమైన సాంకేతిక పరిజ్ఞానాలలో పరిశ్రమలకు అవసరమైన విధంగా నైపుణ్య శిక్షణ కార్యక్రమాలను చేపట్టనుంది. ఇది యువతను భవిష్యత్తుకు సిద్ధంగా ఉన్న నైపుణ్యాలతో సన్నద్ధం చేయడానికి సౌకర్యవంతమైన డిజిటల్ బోధన పద్ధతులు, వర్చువల్ ప్రయోగశాలలను అందిస్తుంది.

ముజఫర్‌పూర్ (బీహార్), బాలాసోర్ (ఒడిశా), తిరుపతి (ఆంధ్రప్రదేశ్), డామన్ (దాద్రా నగర్ హవేలీ, డామన్ డయ్యూ), లుంగ్లీలలో (మిజోరాం) అయిదు కొత్త ఎన్ఐఈఎల్ఐటీ కేంద్రాలను కూడా వర్చువల్ పద్ధతిలో కేంద్ర మంత్రి శ్రీ అశ్వినీ వైష్ణవ్ ప్రారంభించారు. ఈ కొత్త కేంద్రాలతో భారతదేశ సాంకేతిక భవిష్యత్తును తీర్చిదిద్దటంలో ఎన్ఐఈఎల్ఐటీ కీలక పాత్ర పోషిస్తూనే ఉంటుంది. ప్రారంభోత్సవ కార్యక్రమంలో మైక్రోసాఫ్ట్, జెడ్‌స్కేలర్, సీసీఆర్‌వైఎన్, డిక్సన్ టెక్, ఫ్యూచర్ క్రైమ్ రీసెర్చ్ ఫౌండేషన్‌లతో ఎన్ఐఈఎల్ఐటీ చేసుకున్న అవగాహన ఒప్పందాలను (ఎంఓయూ) కూడా సంబంధిత సంస్థల ప్రతినిధులు మార్చుకున్నారు.

ఈ సందర్భంగా కేంద్ర మంత్రి శ్రీ అశ్వినీ వైష్ణవ్ మాట్లాడుతూ.. "మూడు సంవత్సరాల క్రితం డిజిటల్ విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేయాలన్న నిర్ణయం తీసుకున్నాం. ఈ విషయంలో పలు రకాల మార్గాలున్నప్పటికీ.. ఎన్ఐఈఎల్ఐటీనే ఉత్తమ మార్గంగా ఉంది. భాగస్వామ్యాలు ఏర్పాటుచేసుకునేందుకు 500 కంపెనీల జాబితాను మనం తయారుచేయాలి. ఇవి తప్పనిసరిగా ఎలక్ట్రానిక్స్ లేదా ఐటీకి మాత్రమే సంబంధించివై ఉండాల్సిన అవసరం లేదు. ఈ సాంకేతికతలు ఇప్పుడు ప్రతి రంగంలో ఉపయోగపడతున్నాయి. ఎలక్ట్రానిక్స్, ఐటీ అవసరాలు ఎక్కడున్నా.. దానికి తగ్గట్లు విద్యార్థులకు శిక్షణ ఇవ్వడం, సిద్ధం చేయడం మన లక్ష్యం. నేడు కేవలం ఎలక్ట్రానిక్స్ తయారీ రంగమే రూ. 13 లక్షల కోట్ల విలువైన పరిశ్రమగా తయారైంది. ఎన్ఐఈఎల్ ఐటీ సమీప భవిష్యత్తులో ఇంకా గొప్ప ఘనతలను సాధిస్తుందని నేను గట్టిగా విశ్వసిస్తున్నాను" అని అన్నారు.

ఈ అవగాహన ఒప్పందాల ప్రాముఖ్యతను కేంద్ర మంత్రి ప్రధానంగా ప్రస్తావించారు. పరిశ్రమ, విద్యా భాగస్వామ్యాన్ని బలోపేతం చేయడంలో ఈ అవగాహన ఒప్పందాలు కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. ఎన్ఐఈఎల్ఐటీ టాప్ 500 కంపెనీలతో చర్చించి.. "పాఠ్యాంశాలను మీరే నిర్ణయించండి" అనే నినాదాన్ని అనుసరిస్తూ అవగాహన ఒప్పందాలు చేసుకోవటం ద్వారా కోర్సులను పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా తయారుచేయాలని తెలిపారు.

కోర్సులు విస్తృతంగా అందుబాటులో ఉన్న దృష్ట్యా.. ఎన్డీయూను ప్రారంభించటం ఒక ముఖ్యమైన ఘట్టమని ఎంఈఐటీవై కార్యదర్శి శ్రీ ఎస్. కృష్ణన్ అన్నారు. మంచి విద్యా శిక్షణ సంస్థల కొరత ఉన్న చాలా క్లిష్టమైన ప్రాంతాల్లో కూడా ఎన్ఐఈఎల్ఐటీ కేంద్రాలు ఉన్నాయని.. ఇది అత్యాధునిక మౌలిక సదుపాయాల ద్వారా మారుమూల ప్రాంతాలకు సాంకేతిక విద్యను అందించడంలో కీలక పాత్ర పోషిస్తోందని చెప్పారు. ఎన్డీయూను ప్రారంభించటంతో.. నైపుణ్యం, ఉపాధికి కావాల్సిన నైపుణ్యాలకు మధ్యనున్న అంతరాన్ని తగ్గించడంలో ఎన్ఐఈఎల్ఐటీ ఉత్ప్రేరకంగా పనిచేస్తుంది.

ఎలక్ట్రానిక్స్ విషయంలో ఎన్ఐఈఎల్ఐటీ అందించే కోర్సులు డిజైన్, తయారీ పరంగా మంచి సమతుల్యంతో ఉన్నాయని మంత్రి తెలిపారు. ఇదే ఉత్తేజంతో రాబోయే సంవత్సరాల్లో ఎలక్ట్రానిక్స్ తయారీలో ఎన్ఐఈఎల్ఐటీ కీలక పాత్ర పోషించగలదని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.

డిజిటల్ పురోగతిలో దేశవ్యాప్త ఐక్యత: ఈశాన్య భారత్ అనుసంధానతను ప్రత్యేకంగా తెలియజేసేలా కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీలు, ఎమ్మెల్యేలు.

ఈ కార్యక్రమంలో దేశవ్యాప్తంగా ఉన్న ఎన్ఐఈఎల్ఐటీ కేంద్రాల నుంచి ఎంపీలు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. ఎమ్మెల్యే శ్రీ విజేంద్ర చౌదరి.. ముజఫర్‌పూర్ నుంచి పంచాయతీరాజ్ మంత్రి శ్రీ కేదార్ ప్రసాద్ గుప్తా.. బాలసోర్ నుంచి ఎంపీ శ్రీ ప్రతాప్ చంద్ర సారంగి.. తూర్పు లుంగ్లీ నుంచి ఎమ్మెల్యే శ్రీ టి. లాల్‌హ్లింపుయా.. డామన్ నుంచి ఎంపీ శ్రీ ఉమేష్ భాయ్ పటేల్.. తిరుపతి నుంచి ఎంపీ శ్రీ మద్దిల గురుమూర్తి వర్చువల్‌గా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఈశాన్య భారత్‌కు చెందిన మిజోరాంలోని లుంగ్లీ గురించి ప్రత్యేకంగా ప్రస్తావించిన కేంద్ర మంత్రి.. కొన్ని నెలల కిందట ఈ రాష్ట్రానికి రైల్వే అనుసంధానత వచ్చినందున ఈ ప్రాంతం డిజిటల్‌గా అనుసంధానమవుతోందని అన్నారు.

దేశవ్యాప్తంగా ఉన్న ఎన్ఐఈఎల్ఐటీ విద్యార్థులు, ప్రముఖ విద్యావేత్తలు, సాంకేతిక నిపుణులతో సహా 1,500 మందికి పైగా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎలక్ట్రానిక్స్, ఐటీకి చెందిన వివిధ విభాగాల్లో నైపుణ్యాభివృద్ధి, అభ్యాస నమూనాలకు సంబంధించిన ఎన్ఐఈఎల్ఐటీ సామర్థ్యాలను ప్రదర్శించే ప్రత్యేక స్టాళ్లను ఏర్పాటుచేశారు.

ప్రారంభోత్సవం తర్వాత 'చదువుల డిజిటలైజేషన్‌లో ఏఐ పాత్ర' అనే అంశంపై వివరణాత్మక ప్యానెల్ చర్చ నిర్వహించారు. ఇందులో ఇంటెల్ సీనియర్ డైరెక్టర్ శ్రీమతి శ్వేతా ఖురానా, ఇన్ఫోసిస్ రెస్పాన్సిబుల్ ఏఐ విభాగాధిపతి శ్రీ ఆశిష్ తివారీ, డాక్టర్ డీ. వై. పాటిల్ ప్రతిష్ఠాన్ చైర్మన్ (ఆర్అండ్‌డీ, ఐఆర్) ప్రొఫెసర్ ప్రభాత్ రంజన్, మైక్రోసాఫ్ట్ కార్పొరేషన్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ విద్యా పరిశ్రమ డైరెక్టర్ డాక్టర్ విన్నీ జౌహరి, ఏఏటూఏటీ సహ వ్యవస్థాపకుడు- గ్లోబల్ సీటీఓ- భారత్ ఎండీ డాక్టర్ రిషి మోహన్ భట్నాగర్, బార్కో ఎలక్ట్రానిక్స్ ఉపాధ్యక్షులు- సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ హెడ్ శ్రీ ఆశిష్ గుప్తా పాల్గొన్నారు. పరిశ్రమ, మార్కెట్ అవసరాలకు అనుగుణంగా నైపుణ్య కార్యక్రమాలను నిర్వహించాలని, డబ్ల్యూబీఎల్(వర్క్ బేస్డ్ లెర్నింగ్) అవకాశాలను పెంచటం, భారతీయ యువతకు ఉపాధి మార్గాలను బలోపేతం చేయడంపై ఇందులో చర్చించారు.

అందుబాటు ఖర్చులో ఉపాధి ఆధారిత ప్రపంచస్థాయి సమ్మిళిత డిజిటల్ లెర్నింగ్ వ్యవస్థను సృష్టించాలన్న ఉద్దేశంతో ఎన్ఐఈఎల్ఐటీ డిజిటల్ విశ్వవిద్యాలయాన్ని (ఎన్డీయూ డిజిటల్) తయారు చేశారు. డిజిటల్ ఇండియా, ఎన్ఈపీ 2020, స్కిల్ ఇండియా లక్ష్యాలకు మద్దతునివ్వటం.. కృత్రిమ మేధ, సెమీకండక్టర్స్, సైబర్ భద్రత, క్లౌడ్ కంప్యూటింగ్ వంటి వర్ధమాన సాంకేతికతలలో ప్రపంచవ్యాప్తంగా పోటీతత్వ మానవ వనరులను తయారుచేయటంతో పాటు అధిక-నాణ్యత డిజిటల్ విద్యకు అందరికి అందేలా చూసుకోవాలన్న లక్ష్యంతో ఈ వేదికను తీసుకొచ్చారు. ఇది అకాడమిక్ బ్యాంక్ ఆఫ్ క్రెడిట్ (ఏబీసీ) ద్వారా క్రెడిట్ల బదిలీ, పరిశ్రమతో అనుసంధానమైన కోర్సులు, వర్చువల్ ల్యాబ్‌లు, బహుభాషా అభ్యాసం, తనిఖీ అయిన డిజిటల్ ధ్రువపత్రాల ద్వారా ఎన్‌సీవీఈటీ ఆమోదించిన, ఎన్ఎస్‌క్యూఎఫ్ స్థాయి కోర్సులను అందిస్తుంది. జీవన మార్గాలు, మార్గదర్శకులు, ఇంటర్వ్యూ సిమ్యులేటర్లు, ఇంటరాక్టివ్ నమూనాలు వంటి ఏఐ ఆధారిత సాధనాలతో దేశవ్యాప్తంగా అభ్యాసకులను శక్తిమంతం చేయాలని భావిస్తోంది. 2030 నాటికి 40 లక్షల మంది అభ్యాసకులను చేరుకోవాలన్న లక్ష్యంతో ఉంది.

భారత ప్రభుత్వ ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖకు (ఎంఈఐటీవై) చెందిన స్వయం ప్రతిపత్తి గల శాస్త్ర విజ్ఞాన సంస్థ ఎన్ఐఈఎల్ఐటీ (నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ ఉ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ).. నైపుణ్యాభివృద్ధి, డిజిటల్ సాధికారతలో మార్గదర్శక సంస్థగా ఉంది.

56 ఎన్ఐఈఎల్ఐటీ కేంద్రాలు, 750కి పైగా గుర్తింపు పొందిన సంస్థలు, 9,000 కంటే ఎక్కువ ఉపకేంద్రాలు ( ఫెసిలిటేషన్ కేంద్రాలు) విస్తృత నెట్‌వర్క్‌తో ఎలక్ట్రానిక్స్, ఐసీటీకి సంబంధించిన అధునాతన సాంకేతికతల్లో లక్షలాది విద్యార్థులకు నైపుణ్య శిక్షణనిస్తూ ధ్రువపత్రాలను ఇచ్చింది.

విద్యా మంత్రిత్వ శాఖ ఎన్ఐటీఎల్ఐటీకి ప్రత్యేక విభాగం కింద "డీమ్డ్ విశ్వవిద్యాలయ" హోదాను ఇచ్చింది. ఎన్ఐఈఎల్ఐటీ ప్రధాన క్యాంపస్ పంజాబ్‌లోని రోపర్‌లో ఉంది. ఐజ్వాల్, అగర్తల, ఔరంగాబాద్, కాలికట్, గోరఖ్‌పూర్, ఇంఫాల్, ఇటానగర్, అజ్మీర్ (కేక్రి), కోహిమా, పాట్నా, శ్రీనగర్‌లలో అనుబంధ క్యాంపస్‌లు ఉన్నాయి. డిజిటల్ టెక్నాలజీలను ఉపయోగించి ఎలక్ట్రానిక్స్, ఐసీటీకి సంబంధించిన ఉన్నత విద్యలో భారీ మార్పులు తీసుకురావాలని ఎన్ఐటీఎల్ఐటీ లక్ష్యంగా పెట్టుకుంది.

# రక్షణతో కూడిన ఉత్పత్తి సాధించాలి : జీఎం ఎస్. రాధాకృష్ణ

ఆదిలాబాద్, అక్టోబర్ 3: రక్షణతో కూడిన ఉత్పత్తి సాధించాలని, సింగరేణి సంస్థ నిర్దేశించిన లక్ష్యాలను సాధించేందుకు అందరూ కృషి చేయాలని మందమర్రి జీఎం ఎస్. రాధాకృష్ణ సూచించారు. శుక్రవారం మందమర్రి ఏరియాలోని కాసిపేట 1 ఇంక్లైన్ గనిపై నూతనంగా 3ఎస్-13, 4ఎస్ 13 రెండు డిస్ట్రిక్ట్ కు అండర్ గ్రౌండ్లో నూతనంగా పనులకు అనుమతులు రావడంతో శుక్రవారం మందమర్రి ఏరియా జీఎం ఎస్ రాధా కృష్ణ పనులను ప్రారంభించారు. ఉత్పత్తి తీసుకురావడానికి తీసుకోవాల్సిన చర్యలపై పనులను పరిశీలించారు.

ఉత్పత్తి, ఉత్పాదకతలను, రక్షణతో కూడిన ఉత్పత్తి సాధించి సింగరేణికి మంచి పేరు తీసుకురావడంలో అందరూ భాగస్వామ్యం కావాలన్నారు.

కాసిపేట గని ఎన్నో రికార్డులను సృష్టించిందని, మళ్లీ పూర్వ వైభవాన్ని తీసుకురావడానికి ఉద్యోగులు పనిచేయాలన్నారు. సరైన పని ముట్లను ఉపయోగించి, నైపుణ్యతతో పని చేయాలన్నారు. ఉద్యోగులలో గైర్హాజరు శాతం ఎక్కువగా ఉందని, వారు సక్రమంగా విధులు నిర్వహించి కుటుంబానికి అండగా నిలవాలన్నారు. విధులకు రాకపోవడం వల్ల ఆర్థికంగా వెనుకబడిన పోతామని, దీని వల్ల ఉత్పత్తి పైన ప్రభావం పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మందమర్రి గ్రూప్ ఏజెంట్ డి.రాంబాబు, మేనేజర్ డి. సతీష్, రక్షణాధికారి నిఖిల్ అయ్యర్, డిప్యూటీ మేనేజర్ వెంకటేష్, సర్వేయర్ ప్రభాకర్, ఇంజనీర్ రామకృష్ణ తదితరులున్నారు.

# స్థానిక ఎన్నికల్లో పోటీకి సీపీఐ(ఎం) సిద్ధం : బండ శ్రీశైలం



నల్గొండ, అక్టోబర్ 3:మునుగోడు నియోజకవర్గంలోని ఎంపీటీసీ, సర్పంచ్ అన్ని స్థానాల్లో పోటీ చేసేందుకు సీపీఐ(ఎం) సిద్ధంగా ఉందని ఆ పార్టీ నల్లగొండ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు బండ శ్రీశైలం తెలిపారు. శుక్రవారం మునుగోడు మండలంలోని సీపీఎం కార్యాలయంలో నిర్వహించిన నియోజకవర్గస్థాయి సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పేద ప్రజలకు ఎక్కడ సమస్య వచ్చినా ప్రజల పక్షాన ప్రశ్నించే గొంతుగా, ప్రజల పక్షాన పోరాటాలు నిర్వహించే సీపీఎం పోటీ చేసే స్థానాల్లో గెలిపించేందుకు పేద ప్రజలు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. మునుగోడు నియోజకవర్గంలో ఎర్ర జెండాకున్న పోరాట చరిత్ర, ప్రజలలో చెదరని ముద్రగా నిలిచి ఉంటుందన్నారు. మునుగోడు నియోజకవర్గ ప్రజలు చాలా చైతన్యవంతమైన ప్రజలన్నారు.

డబ్బు, మద్యంతో ప్రలోభ పెట్టి బరిలో నిలిచే నాయకులను ఓడించి, పేద ప్రజలకు ఎక్కడ అన్యాయం జరిగితే అక్కడ ప్రజల పక్షాన నిలిచి పోరాటం చేసే సీపీఎం నాయకులను గెలిపించాలని కోరారు. నియోజకవర్గంలో నెలకొన్న అనేక సమస్యలను పరిష్కారం చేసుకునేందుకు పోరాటం చేసే ఎర్రజెండాను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు కర్నాటి మల్లేశం, మాజీ ఎంపీటీసీలు చాపల మారయ్య, టి.గోపాల్ రెడ్డి, మునుగోడు, మర్రిగూడ, చండూరు మండల కార్యదర్శులు సాగర్ల మల్లేష్, ఏర్పుల యాదయ్య, జేరిపోతుల ధనంజయ గౌడ్, మండల కమిటీ సభ్యులు మిర్యాల భరత్, యాస రాణి, శ్రీను పాల్గొన్నారు.

# డీఎస్పీ ఉద్యోగానికి ఎంపికైన అఖిల్‌కు ఘన సన్మానం



ఖమ్మం, అక్టోబర్ 3: టీజీపీఎస్సీ ఇటీవల వెల్లడించిన గ్రూప్-1 ఫలితాల్లో డీఎస్పీ ఉద్యోగానికి ఎంపికైన పాపినేని అఖిల్‌ను రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఖమ్మం ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ పార్టీ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు తాతా మధుసూదన్ రావు ఘనంగా సన్మానించారు.

గురువారం రాత్రి ఖమ్మంలోని స్వర్ణ భారతి కల్యాణ మండపంలో గ్రూప్ -1 ఫలితాల్లో రాణించి ఉద్యోగాలను సాధించిన వారికి సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని తూటికుంట గ్రామానికి చెందిన పాపినేని అఖిల్ ను శాలువాతో సత్కరించి, ఆయన తల్లిదండ్రులైన శ్రీనివాసరావు, జ్యోతిని అభినందించి మెమొంటోను అందజేశారు.

ఈ కార్యక్రమంలో మధిర మాజీ ఎమ్మెల్యే కొండబాల కోటేశ్వరరావు, ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ చైర్మన్ పాల్గొన్నారు.

# విషాదం..గోడ కూలి వృద్ధ దంపతులు మృతి

అమరావతి, అక్టోబర్ 3: ఏపీలో భారీ వర్షాలు పలు జిల్లాలను అతలాకుతలం చేస్తున్నాయి. వర్షాలకు వృద్ధ దంపతులు మృతి చెందిన విషాద ఘటన శ్రీకాకుళం జిల్లాలో చోటు చేసుకుంది. మందస మండలం హంసరాలి పంచాయతీ పరిధిలోని చిన్నటూర్‌లో గురువారం రాత్రి ఎడతెరపి లేకుండా కురిసిన వర్షాలకు మట్టిగోడ కూలింది.

దీంతో ఆ ఇంట్లో నిద్రపోతున్న వృద్ధ దంపతులు నవర చిన్న బుడియా, ఆయన భార్య రూపమ్మపై గోడ కూలి వారిపై మట్టి పెళ్లలు పడ్డాయి. స్థానికులు వారిని హరిపురం ఆసుపత్రికి తరలించగా ఊపిరాడక అప్పటికే మృతి చెందారని వైద్యులు ధ్రువీకరించారు. పోలీసులు, రెవెన్యూ అధికారులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# బయోమెడికల్ రిసర్చ్ కెరియర్ ప్రోగ్రామ్ (బీఆర్‌సీపీ) మూడో దశకు ఆమోదం తెలిపిన మంత్రిమండలి

న్యూఢిల్లీ, అక్టోబర్ 3:బయోమెడికల్ రిసర్చ్ కెరియర్ ప్రోగ్రామ్ (బీఆర్‌సీపీ) మూడో దశను కొనసాగించడానికి ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ అధ్యక్షతన సమావేశమైన కేంద్ర మంత్రిమండలి ఆమోదం తెలిపింది. ఈ కార్యక్రమాన్ని మూడో దశ (2025-26 నుంచి 2030-31 వరకు), అలాగే తరువాతి ఆరు సంవత్సరాల వరకు (2031-32 నుంచి 2037-38 వరకు) బయోటెక్నాలజీ విభాగం (డిపార్ట్‌మెంట్ ఆఫ్ బయోటెక్నాలజీ.. డీబీటీ), బ్రిటన్ కు చెందిన వెల్‌కం ట్రస్ట్ (డబ్ల్యూటీ)లతో పాటు ఎస్‌పీవీ, ఇండియా అలయన్స్‌ల మధ్య భాగస్వామ్యంతో అమలు చేస్తున్నారు. రూ.1500 కోట్ల మొత్తం వ్యయంతో 2030-31 వరకు అనుమతించిన ఫెలోషిప్, గ్రాంట్లను మంజూరు చేయడం ఈ కార్యక్రమం ఉద్దేశం. దీనిలో రూ.1,000 కోట్లను డీబీటీ, రూ.500 కోట్లను యూకేకు చెందిన డబ్ల్యూటీ సమకూరుస్తాయి.

నైపుణ్యాలనూ, నవకల్పననూ ప్రోత్సహించాలన్న వికసిత్ భారత్ లక్ష్యాలకు అనుగుణంగా బయోమెడికల్ రిసర్చ్ కెరియర్ ప్రోగ్రామ్ (బీఆర్‌సీపీ)లో మూడో దశను బయోటెక్నాలజీ విభాగం మొదలుపెట్టింది. ఈ కార్యక్రమం అత్యాధునిక బయోమెడికల్ రిసర్చ్ కృషిలో అగ్రగామి శాస్త్రవేత్తలకు తోడ్పడుతుంది. నవకల్పనను ట్రాన్స్‌లేషనల్ ఇన్నొవేషన్ నిమిత్తం వివిధ విషయాల్లో పరిశోధనలు నిర్వహించేలా ప్రోత్సాహాన్ని అందిస్తుంది. ఇది అంతర్జాతీయంగా ప్రభావాన్ని చూపే ప్రపంచ స్థాయి బయోమెడికల్ పరిశోధనా సామర్థ్యాన్ని అభివృద్ధిపరచడానికి గాను అధిక నాణ్యత కలిగిన పరిశోధనలకు సాయపడే వ్యవస్థలను కూడా బలోపేతం చేయడంతో పాటు, బయోమెడికల్ రిసర్చ్‌లో ప్రాంతీయ అసమానతలను తగ్గిస్తుంది.

యూకేకు చెందిన వెల్‌కం ట్రస్టుతో డీబీటీ భాగస్వామ్యాన్ని ఏర్పరుచుకొని 2008-2009లో బయోమెడికల్ రిసర్చ్ కెరియర్ ప్రోగ్రామ్ (బీఆర్‌సీపీ)ని ప్రారంభించింది. దీనికోసం డీబీటీ, వెల్‌కం ట్రస్ట్ ఇండియా అలయన్స్ పేరుతో ఒక స్పెషల్ పర్పస్ వెహికిల్ (ఎస్‌పీవీ)ని ఏర్పాటు చేశారు. ఇది బయోమెడికల్ రిసర్చ్‌లో ప్రపంచ శ్రేణి ప్రమాణాలను అందుకోవాలన్న లక్ష్యంతో, భారత్‌లోనే రిసర్చ్ ఫెలోషిప్పులను అందిస్తోంది. దీని తరువాత, విస్తారిత పోర్ట్‌ఫోలియోతో రెండో దశను 2018, 19లో అమలు చేశారు.

మూడో దశలో, ఈ కింద పేర్కొన్న కార్యక్రమాలను అమలు చేయాలని ప్రతిపాదించారు: తి.) మౌలిక, రోగ చికిత్సలకు సంబంధించిన (క్లినికల్), ప్రజారోగ్యం పరంగా ప్రారంభ కెరియర్, మధ్య స్థాయి రిసర్చ్ ఫెలోషిప్పులు. ఇవి ప్రపంచ స్థాయిలో గుర్తింపు లభించినవీ, ఒక శాస్త్రవేత్తకు పరిశోధన ప్రధాన కెరియర్లో మొదటి దశలకు ఉద్దేశించినవీ. తితి.) సహకార ప్రధాన గ్రాంట్ల కార్యక్రమం. భారత్‌లో పటిష్ఠ పరిశోధన ట్రాక్ రికార్డు కలిగి ఉన్న ప్రారంభ, మధ్య స్థాయి సీనియర్ స్థాయి కెరియర్ పరిశోధకుల కోసం ఉద్దేశించిన రెండు, మూడు పరిశోధక బృందాలకు కెరియర్ డెవలప్‌మెంట్ గ్రాంట్లు, కెటలిటిక్ కొలాబరేటివ్ గ్రాంట్లను అందించడం ఈ కార్యక్రమంలో భాగం. తితితి) ముఖ్య పరిశోధన ప్రయత్నాలను బలోపేతం చేయడానికి ఉద్దేశించిన రిసర్చ్ మేనేజ్‌మెంట్ ప్రోగ్రామ్. మూడో దశలో మెంటార్‌షిప్పు, నెట్‌వర్కింగ్, ప్రజలను భాగస్వాములను చేయడం.. వీటిని బలపరచడంతో పాటు కొత్త, నవోన్మేష జాతీయ, అంతర్జాతీయ భాగస్వామ్యాలను అభివృద్ధిపరుచుకోవడంపై కూడా దృష్టి పెడతారు.

రిసర్చ్ ఫెలోషిప్పులు, సహకార ప్రాతిపదిక కలిగిన గ్రాంట్లు, రిసర్చ్ మేనేజ్‌మెంట్ ప్రోగ్రాం... ఇవి అన్నీ కలిసి విజ్ఞాన శాస్త్ర పరమైన ఎక్స్‌లెన్సునూ, నైపుణ్యాభివృద్ధినీ, సహకారాన్నీ, జ్ఞానాన్ని మార్పిడి చేసుకోవడాన్నీ పెంపొందిస్తాయి. దీనివల్ల లభిస్తాయనుకుంటున్న ఫలితాల్లో.. 2,000 కన్నా ఎక్కువ మంది విద్యార్థులు, పోస్ట్ డాక్టరల్ ఫెలో శిక్షణ కార్యక్రమం, అధిక ప్రభావాన్ని చూపగలిగే ప్రచురణలను సిద్ధం చేయడం, పేటెంట్ అర్హతను పొందగలిగే ఆవిష్కారాలకు ఊతాన్నివ్వడం, సమకాలిక పక్షాల్లో గుర్తింపును తెచ్చుకోవడం, మహిళలకు అందించే సహాయాన్ని10-15 శాతం మేర పెంచడం, 25 నుంచి 30 శాతం సహకారాత్మక కార్యక్రమాలను టీఆర్ఎల్4, అంతకన్నా ఎక్కువ స్థాయికి చేర్చడం, టైర్-2,3 సెట్టింగులలో కార్యకలాపాలనూ, అనుబంధాన్నీ విస్తరించడం వంటివి భాగంగా ఉన్నాయి.

ఒకటో దశ, రెండో దశలు భారత్‌ను అంతర్జాతీయ స్థాయి కలిగిన బయోమెడికల్ సైన్సుకు సరికొత్త కూడలిగా నిలిపాయి. విజ్ఞానశాస్త్రంలో భారత్ పెట్టుబడులను పెంచుతుండడంతోనూ, ప్రపంచ జ్ఞాన ప్రధాన ఆర్థిక వ్యవస్థలో భారత్ పాత్ర అంతకంతకూ పెరుగుతుండడంతోనూ వ్యూహాత్మక ప్రయత్నాల్లో ఒక కొత్త దశను ఆవిష్కరించాల్సిన అవసరం ఏర్పడింది. ఒకటో, రెండో దశలతో లభించిన ప్రయోజనాలను స్ఫూర్తిగా తీసుకొని, మూడో దశ ఇక జాతీయ ప్రాధాన్యాలతో పాటు ప్రపంచ ప్రమాణాలకు కూడా తులతూగే ప్రతిభావంతులకు అండదండలను అందించడం, సామర్థ్య సాధన, రూపాంతరణ (ట్రాన్స్‌లేషన్) ప్రక్రియలపై దృష్టి సారించనుంది.

# ప్రభుత్వ ఎలక్ట్రానిక్స్ విడిభాగాల తయారీ పథకానికి దేశీయ, అంతర్జాతీయ పరిశ్రమల నుంచి అపూర్వ స్పందన

న్యూఢిల్లీ, అక్టోబర్ 3:ఎలక్ట్రానిక్స్ విడి భాగాల తయారీ పథకానికి దేశీయ, అంతర్జాతీయ పరిశ్రమల నుంచి అద్భుతమైన స్పందన లభించింది. ఇది ప్రపంచ వేదికపై పెరుగుతున్న భారత్ స్థాయినీ.. ఎలక్ట్రానిక్స్ తయారీలో స్వయం-సమృద్ధి సాధన పట్ల బలమైన ఆసక్తిని కనబరుస్తున్న ఎమ్ఎస్ఎమ్ఈలు సహా దేశీయ పరిశ్రమ వ్యాప్తంగా పెరుగుతున్న విశ్వాసాన్నీ ప్రతిబింబిస్తుంది.

ఈ పథకం లక్ష్యమైన 91,600కు మించి అత్యధికంగా 1,42,000 ప్రత్యక్ష ఉద్యోగాలు, అనేక రకాల పరోక్ష ఉద్యోగాలనూ సృష్టిస్తుందని అంచనా వేశారు. ఇది పెద్ద ఎత్తున ఉపాధి కల్పించే సామర్థ్యాన్నీ ప్రదర్శిస్తుంది.

ఈ ఉత్సాహకరమైన స్పందన పట్ల సంతోషం వ్యక్తం చేసిన కేంద్ర మంత్రి శ్రీ అశ్వినీ వైష్ణవ్.. రాష్ట్రాలు ఈ సువర్ణావకాశాన్ని ఉపయోగించుకుంటూ వారి ప్రాంతాల్లో ఎలక్ట్రానిక్స్ తయారీకి అనుకూలమైన ప్రాథమిక ప్రణాళికను అభివృద్ధి చేయాలని కోరారు. న్యూఢిల్లీలోని ఎలక్ట్రానిక్స్ నికేతన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎలక్ట్రానిక్స్ తయారీ పరిశ్రమ యువతకు గణనీయమైన ప్రత్యక్ష-పరోక్ష ఉపాధి అవకాశాలను సృష్టిస్తుందని స్పష్టం చేశారు.

రూ. 22,919 కోట్ల ఆర్థిక వ్యయంతో 2025 మే 1న మంత్రివర్గం ఆమోదించిన ఈ పథకానికి రూ. 1,15,351 కోట్ల పెట్టుబడి హామీతో 249 దరఖాస్తులు వచ్చాయి. ఈ పథకం లక్ష్యంగా ఉన్న రూ. 59,350 కోట్ల కంటే దాదాపు రెట్టింపు స్పందన ఈ పథకానికి లభించింది. రాబోయే ఆరు సంవత్సరాల్లో ఈ పథకం కింద ఎలక్ట్రానిక్స్ భాగాల ఉత్పత్తి విలువ రూ. 10,34,700 కోట్లు ఉంటుందని అంచనా. ఈ పథకం లక్ష్యంగా నిర్దేశించిన రూ. 4,56,000 కోట్ల ఉత్పత్తి విలువ కంటే ఇది 2.2 రెట్లు ఎక్కువ.

ఈ భారీ స్పందన దేశ ప్రజలకు ప్రత్యక్షంగా, పరోక్షంగా మరిన్ని ఉద్యోగాలను కల్పించనుంది. దరఖాస్తులకు మొదట 2025 మే 1 నుంచి 3 నెలల వరకు అవకాశం కల్పించగా.. తరువాత ఈ గడువును 2025 సెప్టెంబరు 30 వరకు పొడిగించారు.

### బలోపేతమైన భారత ఎలక్ట్రానిక్స్ తయారీ రంగం

ఈసీఎమ్ఎస్ పథకాన్ని విజయవంతంగా ప్రారంభించడం ద్వారా 2030-31 నాటికి 500 బిలియన్ డాలర్ల దేశీయ ఎలక్ట్రానిక్స్ తయారీ వ్యవస్థను సాధించాలనే గౌరవనీయ ప్రధానమంత్రి దార్శనికతకు అనుగుణంగా దేశం ముందుకు సాగుతోందని శ్రీ అశ్వినీ వైష్ణవ్ స్పష్టం చేశారు. మొబైల్ ఫోన్లు, ఐటీ హార్డ్‌వేర్ కోసం ఈఎమ్‌సీ, ఎస్‌పీఈసీఎస్, ప్రొడక్షన్ లింక్డ్ ఇన్సెంటివ్ (పీఎల్ఐ) పథకం వంటి పలు పథకాల ద్వారా ఉత్పన్నమయ్యే ఆసక్తిని మెరుగుపరుస్తూ ప్రభుత్వ వ్యూహాత్మక లక్ష్యాల సహజ పురోగతిని ఈసీఎమ్ఎస్ సూచిస్తుంది.

ఈ వరుస పథకాలు భారత ఎలక్ట్రానిక్స్ తయారీ వ్యవస్థను బలోపేతం చేశాయనీ, భారతదేశాన్ని సమగ్ర ప్రపంచ తయారీ కేంద్రంగా నిలబెట్టే వాణిజ్య కార్యకలాపాల ఏకీకరణను పూర్తి చేయడానికి ఈసీఎమ్ఎస్ ఇప్పుడు సంసిద్ధంగా ఉందని ఆయన తెలిపారు.

### దేశీయ వాణిజ్య కార్యకలాపాల విస్తరణ

దేశంలో ఎలక్ట్రానిక్స్ తయారీ వాణిజ్య కార్యకలాపాలను మరింతగా విస్తరించడం, మొత్తం మీద దేశీయ ఆర్థిక విలువ గణనీయంగా పెరిగేలా చూసుకోవడమన్నది ప్రాథమిక ఆలోచనగా ఉందని ఎలక్ట్రానిక్స్-ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ కార్యదర్శి శ్రీ ఎస్. కృష్ణన్ పేర్కొన్నారు. ఆ తర్వాత ప్రపంచ వాణిజ్య కార్యకలాపాల ఏకీకరణపై దృష్టి సారించనున్నట్లు ఆయన తెలిపారు.

భారత ఎలక్ట్రానిక్స్ తయారీ వ్యవస్థపై దేశీయ, ప్రపంచ పరిశ్రమ భాగస్వాములందరూ చూపిన అపారమైన విశ్వాసాన్నీ ఎలక్ట్రానిక్స్-ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ ప్రశంసించింది. భారత తయారీ నైపుణ్యం, విధాన స్థిరత్వం, పోటీ ప్రయోజనాల పట్ల వ్యాపార వర్గాల్లో పెరుగుతున్న నమ్మకాన్ని ఈ అపూర్వమైన పెట్టుబడులు ప్రతిబింబిస్తున్నాయి. దేశంలో బలమైన, స్వయం-సమృద్ధమైన, ప్రపంచంతో పోటీపడే సమర్థమైన ఎలక్ట్రానిక్స్ తయారీకి అవసరమైన పునాదిని ఏర్పాటు చేయడంలో మన పరిశ్రమ భాగస్వాముల సమష్టి నిబద్ధతను ఈ విజయం ప్రతిబింబిస్తుంది. అర్హత కలిగిన దరఖాస్తులను మంత్రిత్వ శాఖ ఇప్పటికే ఆమోదిస్తోంది.

# హక్కు కోరని ఆర్థిక ఆస్తులపై 3 నెలల దేశవ్యాప్త అవగాహన కార్యక్రమానికి -కేంద్ర ఆర్థికమంత్రి శ్రీమతి నిర్మలా సీతారామన్ శ్రీకారం

న్యూఢిల్లీ, అక్టోబర్ 3:దేశవ్యాప్తంగా వివిధ సంస్థలలోగల హక్కు కోరని ఆర్థిక ఆస్తులపై 3 నెలలపాటు నిర్వహించే జాతీయ ప్రచార కార్యక్రమాన్ని ఈ నెల 4న కేంద్ర ఆర్థిక-కార్పొరేట్ వ్యవహారాల శాఖ మంత్రి శ్రీమతి నిర్మలా సీతారామన్ గుజరాత్‌లోని గాంధీనగర్‌లో ప్రారంభిస్తారు. 'మీ సొమ్ము-మీ హక్కు' (ఆప్ కీ పుంజీ-ఆప్ కా అధికార్) నినాదంతో అక్టోబరు నుంచి డిసెంబరు వరకూ ఈ కార్యక్రమం కొనసాగుతుంది. భారత రిజర్వు బ్యాంకు (ఆర్‌బీఐ), బీమా నియంత్రణ-అభివృద్ధి ప్రాధికార సంస్థ (ఐఆర్‌డీఏఐ), సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా (సెబీ), మదుపుదారుల అవగాహన-రక్షణ నిధి ప్రాధికార సంస్థ (ఐఈపీఎఫ్ఏ)ల సమన్వయంతో ఆర్థిక మంత్రిత్వశాఖ పరిధిలోని ఆర్థిక సేవల విభాగం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తుంది.

ప్రజల్లో అవగాహన లేమితో పాటు పాత ఖాతాల వివరాలు తెలియక ప్రజలు వాటిపై తమ హక్కును కోరని కారణంగా బీమా పాలసీలు, బ్యాంకు డిపాజిట్లు, డివిడెండ్లు, షేర్లు, మ్యూచువల్ ఫండ్ ఆదాయం వంటి ఆర్థిక ఆస్తులు తరచూ ఆయా సంస్థల ఖాతాల్లో పేరుకుపోతుంటాయి. ఈ నేపథ్యంలో అటువంటి ఆస్తులపై హక్కు పొందడం గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

ఇందులో భాగంగా అటువంటి ఆస్తుల శోధన, రికార్డుల నవీకరణ సహా వాటిపై హక్కు కోరే విధానాలను అధికారులు ఎక్కడికక్కడ ప్రజలకు వివరిస్తారు. ఈ కార్యక్రమం తోపాటు డిజిటల్ ఉపకరణాలు, వాటి వినియోగ విధానంపై ప్రదర్శనలు కూడా నిర్వహిస్తారు.

దేశ ప్రజలు ఆదా చేసిన ప్రతి రూపాయి వాస్తవ ఖాతాదారులకు లేదా వారి చట్టబద్ధ వారసులు, నామినీలకు దక్కేవిధంగా చూడాలని కేంద్ర ప్రభుత్వం నిబద్ధతతో కృషి చేస్తోంది.

దీనికి అనుగుణంగా ప్రారంభిస్తున్న ఈ ప్రచార కార్యక్రమంలో ప్రజల చురుకైన భాగస్వామ్యం ద్వారా అవగాహన పెరుగుతుంది. దీంతోపాటు ఇంటింటా ఆర్థిక సార్వజనీనత బలోపేతానికీ ఈ కార్యక్రమం ఉపయోగపడుతుంది. హక్కు కోరే ప్రక్రియ సరళంగా, పారదర్శకంగా ఉండేవిధంగా ప్రామాణిక నిర్వహణ విధానాలను రూపొందించారు. ఈ మేరకు సంబంధిత నిధి నియంత్రణ సంస్థలు నందేహాలు-సమాధానాల (ఎఫ్ఏక్యూ)ను కూడా రూపొందించాయి. వీటి ద్వారా హక్కుదారుల గుర్తింపు, అభ్యర్థన విధానం తదితరాలపై విస్పష్ట సమాచారం లభిస్తుంది.

ఈ ప్రచార కార్యక్రమం కింద బ్యాంకులు, బీమా కంపెనీలు, మ్యూచువల్ ఫండ్‌లు, పెన్షన్ సంస్థల స్టాళ్ల ఏర్పాటు ద్వారా ప్రత్యేక ఆర్థిక సార్వజనీనత ప్రదర్శన కూడా నిర్వహిస్తారు.

# సిద్దిపేట అంటే సేవకు పెట్టింది పేరు : హరీశ్‌రావు



సిద్దిపేట, అక్టోబర్ 3 : సిద్దిపేట అంటే సేవకు పెట్టింది పేరని, సిద్దిపేట నుంచి ప్రారంభమైన అన్నదానం ఎల్లలు దాటి అమర్‌నాథ్ అయోధ్య వరకు సాగుతుందంటే సిద్దిపేట మట్టి మహిమ అని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. సిద్దిపేట పట్టణంలోని కరీంనగర్ రోడ్డు అయ్యప్ప దేవాలయ సమీపంలో నిర్మించ తలపెట్టిన అమర్‌నాథ్ సేవా సమితి భవనం భూమి పూజ కార్యక్రమంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ అమర్ నాథ్ సేవా సమితి సర్వజన హితం అని, సిదిపేటలో ఆరంభించిన ఈ కార్యక్రమం ఎల్లలు దాటి విశ్వ వ్యాప్తమైందన్నారు. అమర్ నాథ్ సేవా సమితి స్ఫూర్తితో కేదార్ నాథ్, అయోధ్య వరకు సిద్దిపేట అన్నం భక్తులకు అందుతుందడటం ఎంతో సంతోషంగా ఉందన్నారు. సిద్దిపేట అంటే సేవకు సామాజిక, ధార్మిక ఆధ్యాత్మికతకు నిలయంగా మారిందన్నారు. తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందన్నారు.

# న్యూఢిల్లీలోని ఖాదీ ఇండియా షోరూమ్‌లో కేంద్ర హోం-సహకారశాఖ మంత్రి శ్రీ అమిత్ షా

న్యూఢిల్లీ, అక్టోబర్ 3:గాంధీ జయంతి నేపథ్యంలో ఇవాళ కేంద్ర హోం-సహకార శాఖ మంత్రి శ్రీ అమిత్ షా న్యూఢిల్లీలోని కన్నాట్ ప్లేస్ లోగల ఖాదీ ఇండియా షోరూమ్‌లో ఖాదీ ఉత్పత్తులు కొనుగోలు చేసి, ఆన్‌లైన్ చెల్లింపు చేశారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ- భారత ఆత్మ చైతన్యాన్ని గుర్తించిన మహాత్మా గాంధీ బ్రిటీష్ పాలకులపై పోరాటం దిశగా సామాన్య ప్రజానీకంలో ఉత్తేజం నింపారని ఆయన పేర్కొన్నారు. అలాగే, దేశ భవిష్యత్ స్వరూపావిష్కరణలో భాగంగా స్వాతంత్ర్య ఉద్యమానికి గాంధీజీ జోడించిన అనేక అంశాల్లో ఖాదీ, స్వదేశీ అత్యంత కీలకమైనవిగా రూపొందాయని చెప్పారు. అందువల్లనే స్వాతంత్ర్య ఉద్యమాన్ని ఖాదీ-స్వదేశీల నుంచి వేరుగా చూడలేమని స్పష్టం చేశారు. ఈ రెండింటినీ ప్రోత్సహించడం ద్వారా స్వాతంత్ర్య ఉద్యమ వేగం పెంచడమేగాక దేశంలోని లక్షలాది ప్రజల జీవితాల్లో మహాత్ముడు వెలుగులు నింపారని గుర్తుచేశారు.

మన దేశం అనేక ఏళ్లపాటు ఖాదీ, స్వదేశీ భావనలను విస్మరించిందని శ్రీ అమిత్ షా వ్యాఖ్యానించారు. కానీ, శ్రీ నరేంద్ర మోదీ గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు 2003లో ఖాదీకి పూర్వ వైభవం దిశగా ప్రారంభించిన ఓ కీలక కార్యక్రమం నేటి ఖాదీ ఉద్యమానికి నాంది పలికిందని వివరించారు. అటుపైన ఖాదీ మరోసారి ప్రజా జీవనంలో భాగంగా మారిందని హోంమంత్రి పేర్కొన్నారు. అంతేగాక దేశ ప్రధానిగా శ్రీ మోదీ 11 ఏళ్ల పదవీ కాలంలో ఖాదీ-గ్రామీణ పరిశ్రమ ఉత్పత్తుల అమ్మకాలు 5 రెట్లు పెరిగి రూ.33,000 కోట్ల నుంచి రూ.1.7 లక్షల కోట్ల స్థాయిని అధిగమించాయని వెల్లడించారు.

ప్రధానమంత్రి మోదీ తన రేడియో కార్యక్రమం 'మన్ కీ బాత్' ద్వారా స్వదేశీ భావనను పునరుజ్జీవింపజేశారని గుర్తుచేశారు. దీనికి అనుగుణంగా దేశ ఆర్థికాభివృద్ధిని 'మేక్ ఇన్ ఇండియా' కార్యక్రమంతో అనుసంధానిస్తూ ప్రజలకు స్ఫూర్తినిచ్చారని కొనియాడారు. దీంతో దేశవ్యాప్తంగా లక్షలాది కుటుంబాలు విదేశీ వస్తు వినియోగానికి స్వస్తి చెప్పాలని నిర్ణయించుకున్నట్లు పేర్కొన్నారు. మరోవైపు లక్షలాదిగా దుకాణదారులు కూడా విదేశీ ఉత్పత్తుల విక్రయం నిలిపివేతకు నిర్ణయం తీసుకున్నారని ఆయన చెప్పారు. ఖాదీ, స్వదేశీ ఉద్యమాల విజయం దిశగా దేశంలోని ప్రతి కుటుంబం ఏటా కనీసం రూ.5,000 విలువైన ఖాదీ ఉత్పత్తుల కొనుగోలుకు సంకల్పం పూనాలని శ్రీ అమిత్ షా పిలుపునిచ్చారు. తద్వారా లక్షలాది మందికి ఉపాధి లభించడంతోపాటు వారి జీవితాల్లో వెలుగులు పూస్తాయని ఆయన చెప్పారు. దేశాన్ని 2047 నాటికి 'వికసిత భారత్'గా తీర్చిదిద్ది, ప్రపంచంలోనే అగ్రస్థానానికి చేర్చే ప్రతిష్ఠాత్మక కార్యక్రమానికి అనుగుణంగా స్వదేశీ వస్తు వినియోగంపై మనం ప్రతినబూనాలని సూచించారు. ఈ దిశగా ప్రధానమంత్రి మోదీ శ్రీకారం చుట్టిన ఖాదీ వాడకం, స్వదేశీ వినియోగం మనకు సాధికారతనిస్తాయని తెలిపారు. ఈ జంట కార్యక్రమాలను మన జీవనంలో అంతర్భాగం చేసుకోవడమేగాక భావితరాలకూ సంక్రమింపజేయాలని పిలుపునిచ్చారు.

# నేడు ఖాతాల్లోకి రూ.15వేలు.. ఏపీ కేబినెట్ కీలక నిర్ణయం



అమరావతి, అక్టోబర్ 3:ఆటో, క్యాబ్ డ్రైవర్లకు రూ.15వేలు ఆర్థికసాయం అందించే పథకానికి ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు రేపు శ్రీకారం చుట్టనున్నారు. విజయవాడ సింగ్ నగర్‌లోని మాకినేని బసవపున్నయ్య స్టేడియంలో చంద్రబాబు ఈ పథకాన్ని ప్రారంభిస్తారు. ఆటో, క్యాబ్ డ్రైవర్ల ఖాతాలోకి రూ.15వేలను జమ చేస్తారు. ఈ మేరకు ఈ పథకం ప్రారంభానికి ఏపీ కేబినెట్ ఆమోదం తెలిపింది.

ఏపీ సీఎం చంద్రబాబు అధ్యక్షతన అమరావతి సచివాలయంలో కెబినెట్ భేటీ అయ్యింది. దాదాపు 20 అజెండా అంశాలపై చర్చించింది. ఈ సందర్భంగా ల్యాండ్ ఇన్సెంటివ్ ఫర్ టెక్నికల్ హబ్స్ (లిఫ్ట్) పాలసీ 2024-29 అనుబంధ ప్రతిపాదనలకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. జలవనరుల శాఖకు సంబంధించి పలు పనులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. కారవాన్ పర్యటకానికి, అమృత్ పథకం 2.0 పనులకు ఆమోదం తెలిపింది. అమరావతిలో వివిధ పనుల వేగవంతానికి స్పెషల్ పర్పస్ వెహికిల్ ఏర్పాటుకు ఆమోదం తెలిపింది. కుష్టు వ్యాధి పదం తొలగించేందుకు చట్ట సవరణ చేయాలని నిర్ణయంతో పాటు, విద్యుత్ శాఖకు సంబంధించి పలు ప్రతిపాదనలకు , కార్మిక చట్టాల్లో పలు సవరణల ప్రతిపాదనలను ఆమోదించింది.

# రూ.5862 కోట్లకు పైగా వ్యయంతో కొత్తగా 57 కేంద్రీయ విద్యాలయాల (కేవీఎస్) ఏర్పాటుకు క్యాబినెట్ ఆమోదం

న్యూఢిల్లీ, అక్టోబర్ 3:కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఖ్య పెరిగిన దృష్ట్యా వారి పిల్లల విద్యావసరాలను తీర్చేందుకు దేశవ్యాప్తంగా ప్రజా విభాగంలో 57 కొత్త కేంద్రీయ విద్యాలయాలను (కేవీ) ఏర్పాటు చేసేందుకు ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ అధ్యక్షతన సమావేశమైన ఆర్థిక వ్యవహారాల క్యాబినెట్ కమిటీ ఆమోదం తెలిపింది. 2026-27 మధ్య తొమ్మిది సంవత్సరాల పాటు ఈ 57 కొత్త కేవీల ఏర్పాటు, నిర్వహణకు దాదాపు రూ. 5862.55 కోట్లు వ్యయమవుతుందన్న అంచనా ఉంది. ఇందులో రూ. 2585.52 కోట్లు (సుమారుగా) మూలధన వ్యయం కాగా.. రూ. 3277.03 కోట్లు (సుమారుగా) నిర్వహణ వ్యయం. ఎన్ఈపీ 2020కి ఆదర్శవంతమైన పాఠశాలలుగా నిలిచేలా మొదటిసారిగా ఈ 57 విద్యాలయాల్లో బాలవాటికలు అంటే 3 సంవత్సరాల ఫౌండేషన్ దశ సౌకర్యాలు (ప్రీ-ప్రైమరీ) ఉండనున్నాయి.

రక్షణ, పారామిలిటరీ దళాలతో సహా బదిలీ అయ్యే, బదిలీ కాని కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల పిల్లల విద్యా అవసరాలను తీర్చేందుకు, దేశవ్యాప్తంగా ఒకే ప్రామాణిక విద్యనందించేందుకు భారత ప్రభుత్వం 1962 నవంబర్‌లో కేంద్రీయ విద్యాలయాల పథకాన్ని ఆమోదించింది. దీనికి అనుగుణంగా కేంద్ర ప్రభుత్వ విద్యా మంత్రిత్వ శాఖ పరిధిలో "కేంద్రీయ పాఠశాలల సంస్థ (సెంట్రల్ స్కూల్స్ ఆర్గనైజేషన్)" ప్రారంభమైంది.

కొత్త కేవీలను ప్రారంభించటం నిరంతర ప్రక్రియ. కొత్త కేవీలను ఏర్పాటుచేసేందుకు కేంద్ర ప్రభుత్వ మంత్రిత్వ శాఖలు-విభాగాలు, రాష్ట్రాలు- కేంద్రపాలిత ప్రాంతాలతో సహా వివిధ స్పాన్సరింగ్ యంత్రాంగాల నుంచి మంత్రిత్వ శాఖ, కేవీఎస్‌లు (కేంద్రీయ విద్యాలయ సంఘటన్) తరచుగా ప్రతిపాదనలు అందుకుంటుంటాయి. ఈ ప్రతిపాదనలను సంబంధిత స్పాన్సరింగ్ యంత్రంగాలు అంటే రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు, మంత్రిత్వ శాఖలు, కేంద్ర ప్రభుత్వ విభాగాలు స్పాన్సర్ చేస్తాయి. నేటికి 1288 కేవీలు పనిచేస్తున్నాయి. వీటిలో 3 విదేశాల్లో (మాస్కో, ఖాట్మండు, టెహ్రాన్) ఉన్నాయి. 2025 జూన్ 30 నాటికి నమోదైన మొత్తం విద్యార్థుల సంఖ్య 13.62 లక్షలు (దాదాపు).

దేశవ్యాప్తంగా కేవీలను నెలకొల్పటంతో పాటు కేవీలకు ఉన్న అధిక డిమాండ్‌కు అనుగుణంగా గతంలో మంజూరు చేసిన 85 కేవీలకు కొనసాగింపుగా ఈ తాజా మంజూరు ఉంది. ఈ 57 విద్యాలయాల్లో 7 కేవీలను హోం మంత్రిత్వ శాఖ స్పాన్సర్ చేయగా.. మిగిలిన 50 కేవీలకు రాష్ట్ర, కేంద్ర పాలిత ప్రాంతాలు స్పాన్సర్‌గా ఉన్నాయి. కేంద్రీయ విద్యాలయాల కోసం వచ్చిన 57 కొత్త ప్రతిపాదనలు వెనుకబడిన, వ్యూహాత్మకంగా ముఖ్యమైన ప్రాంతాలను చేరుకునే విషయంలో బలమైన నిబద్ధతను తెలియజేస్తున్నాయి. తూర్పు ప్రాంతంలో వృద్ధిని నిర్ధారిస్తూ ఉత్తర, దక్షిణ, పశ్చిమ ప్రాంతాలకు సమతుల్య ప్రాతినిధ్యం ఉండేలా చూసుకుంటూ సమ్మిళితత్వం, జాతీయ సమైక్యతను బలోపేతం చేసేందుకు అవలంబించిన విధానాన్ని ఈ కొత్త విద్యాలయాలు మంజూరు తెలియజేస్తోంది. డిసెంబర్ 2024లో మంజూరు చేసిన 85 కేవీలకు కొనసాగింపుగా ప్రస్తుతం ముంజూరైన కేవీలు 17 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో రానున్నాయి. ప్రస్తుతం ఆమోదించిన వాటిలో 20 కేవీలు.. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు గణనీయంగా ఉన్నప్పటికీ... కేవీల్లేని జిలాల్లో రానున్నాయి. ఆకాంక్షాత్మక జిల్లాల్లో 14 కేవీలు, ఎల్‌డబ్ల్యుఈ జిల్లాల్లో 4 కేవీలు, ఎన్ఈఆర్-కొండ ప్రాంతాల్లో 5 కేవీలు ఉన్నాయి. మార్చి 2019 నుంచి కేవీల మంజూరులో ప్రాధాన్యత లభించని రాష్ట్రాలకు ఈ విడతలో కేవీలను కేటాయించారు. డిసెంబర్ 2024లో చేసిన 85 కేవీల మంజూరుకు కొనసాగింపుగా ప్రస్తుతం 57 విద్యాలయాల ఏర్పాటుకు ఆమోదం తెలిపారు. కొత్త కేవీల ప్రాజెక్టును అమలుచేసేందుకు దాదాపు 1520 మంది విద్యార్థుల సామర్థ్యంతో ఒక పూర్తి స్థాయి కేవీని నిర్వహించేందుకు సంఘటన్ నిర్ణయించిన నిబంధనలకు అనుగుణంగా ప్రభుత్వ ఉద్యోగాలను సృష్టించాల్సి ఉంటుంది. మొత్తంగా 86640 మంది విద్యార్థులు ప్రయోజనం పొందుతారు. ప్రస్తుతం ఉన్న నిబంధనల ప్రకారం ఒక పూర్తి స్థాయి కేవీ (బాల్‌వాటిక నుంచి 12వ తరగతి వరకు) 81 మందికి ఉపాధి కల్పిస్తుంది. తదనుగుణంగా 57 కొత్త కేవీల ఆమోదంతో ప్రత్యక్షంగా మొత్తం 4617 మంది శాశ్వత ఉపాధి పొందనున్నారు. కేవీల నిర్మాణం, సౌకర్యాల పెంపుతో సంబంధం ఉన్న పనులు.. అనేక మంది నైపుణ్యం కలిగిన, నైపుణ్యం లేని కార్మికులకు ఉపాధి అవకాశాలు సృష్టించే అవకాశం ఉంది.

జాతీయ విద్యా విధానం 2020 ప్రకారం 913 కేవీలను 'పీఎం శ్రీ' పాఠశాలలుగా మార్చారు. ఇది ఎన్ఈపీ 2020 అమలవుతోన్న తీరును తెలియజేస్తోంది. నాణ్యమైన విద్య, వినూత్న బోధన, అధునాతన మౌలిక సదుపాయాల కారణంగా కేవీలకు డిమాండు ఎక్కువగా ఉంది. ప్రతి సంవత్సరం కేవీలలో బాలవాటిక, ఒకటో తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకునే వారి సంఖ్య పెరుగుతూనే ఉంది. సీబీఎస్ నిర్వహించే బోర్డు పరీక్షల్లో కేంద్రీయ విద్యాలయ విద్యార్థుల ఉత్తీర్ణత అన్ని విద్యా వ్యవస్థలతో పోల్చితే అత్యుత్తమంగా ఉంది.

కేవీలు మోడల్ పాఠశాలలుగా ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వం ఇంతకుముందు చేసిన మంజూరులలో ప్రాతినిధ్యం పొందని లేదా తక్కువ ప్రాతినిధ్యం లభించిన రాష్ట్రాలలో నాణ్యమైన విద్యను పెంపొందించేందుకు తాజా మంజూరు ఉపయోగపడుతుంది. అదే సమయంలో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు గణనీయమైన సంఖ్యలో ఉండి అధిక డిమాండ్ ఉన్న ప్రాంతాలలో, ఆకాంక్షాత్మక జిల్లాల్లో కేవీలను బలోపేతం చేయడం.. కేవీఎస్ నెట్‌వర్క్‌ను భౌగోళిక సవాళ్లున్న, సామాజికంగా కీలకమైన ప్రాంతాలకు విస్తరించేలా ప్రస్తుత ప్రతిపాదన చూసుకోనుంది.

# టీటీడీకి రూ.30 లక్షలు విరాళం అందజేత

తిరుపతి, అక్టోబర్ 3:ఖమ్మం జిల్లాకు చెందిన గుర్రం వెంకటేశ్వర్లు టెక్స్ టైల్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ డైరెక్టర్అంకిత్ టీటీడీ బాలాజీ ఆరోగ్య వరప్రసాదిని (స్విమ్స్) పథకానికి రూ.30 లక్షలు విరాళంగా అందించారు. ఈ మేరకు తిరుమలలోని టీటీడీ చైర్మన్ క్యాంపు కార్యాలయంలో చైర్మన్ బీ.ఆర్.నాయుడుకు చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో టీటీడీ బోర్డు సభ్యులు శాంతా రామ్ తదితరులు పాల్గొన్నారు.తిరుమలలో భక్తుల రద్దీ కొనసాగుతుంది. వివిధ ప్రాంతాల నుంచి శ్రీవారిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులతో అన్ని కంపార్టుమెంట్లు నిండిపోయాయి.

# నేషనల్ కేడెట్ కార్ప్స్ డైరెక్టర్ జనరల్‌గా బాధ్యతలు స్వీకరించిన లెఫ్టినెంట్ జనరల్ వీరేంద్ర వత్స్

న్యూఢిల్లీ, అక్టోబర్ 3:లెఫ్టినెంట్ జనరల్ వీరేంద్ర వత్స్ నేషనల్ కేడెట్ కార్ప్స్ (ఎన్‌సీసీ) డైరెక్టర్ జనరల్‌గా ఈ రోజు బాధ్యతలు స్వీకరించారు. లెఫ్టినెంట్ జనరల్ గుర్బీర్‌పాల్ సింగ్ స్థానంలో ఆయన నూతన జనరల్‌గా బాధ్యతలు చేపట్టారు. యూనిఫాం ధరించే యువజన సంస్థల్లో ప్రపంచంలోనే అతిపెద్ద సంస్థగా ఎన్‌సీసీ 28 రాష్ట్రాలు, 8 కేంద్రపాలిత ప్రాంతాల్లో తన కేడెట్ల సంఖ్యను 20 లక్షలకు విస్తరిస్తున్న కీలక సందర్భంలో ఆయన బాధ్యతలు చేపట్టారు. ఐక్యత, క్రమశిక్షణ నినాదంతో ఎన్‌సీసీ సంస్థ వికసిత్ భారత్‌ఏ2047తో కలిసి పురోగమిస్తోంది. ఆవిష్కరణలు, డిజిటల్ నైపుణ్యాలు, ప్రపంచ అవగాహనను తన సాంప్రదాయిక విలువలైన వ్యక్తిత్వ నిర్మాణం, దేశభక్తితో ఏకీకృతం చేస్తోంది.

1988 డిసెంబర్ 17న భారత సైన్యంలోని 19వ కుమావోన్ రెజిమెంట్‌లో చేరిన లెఫ్టినెంట్ జనరల్ వీరేంద్ర వత్స్ 37 సంవత్సరాల పాటు విశిష్ట సేవలందించారు. తిరుగుబాటు నిరోధక, ఉగ్రవాద నిరోధక కార్యకలాపాల్లో ఆయన సేవలందించారు. అరుణాచల్ ప్రదేశ్, కాశ్మీర్ లోయ, ఆర్మీ ప్రధాన కార్యాలయంలో కీలక బాధ్యతలు నిర్వహించారు. డెమొక్రాటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగోలో ఐక్యరాజ్యసమితి మిషన్ కింద పదాతిదళ బ్రిగేడ్‌కూ ఆయన నాయకత్వం వహించారు. ఈ నియామకానికి ముందు ఆయన వెల్లింగ్టన్‌లోని డిఫెన్స్ సర్వీసెస్ స్టాఫ్ కాలేజీ కమాండెంట్‌గా పనిచేశారు.

ఖడక్వాస్లాలోని నేషనల్ డిఫెన్స్ అకాడమీ, డెహ్రాడూన్‌లోని ఇండియన్ మిలిటరీ అకాడమీ, సికింద్రాబాద్‌లోని కాలేజ్ ఆఫ్ డిఫెన్స్ మేనేజ్‌మెంట్, న్యూఢిల్లీలోని నేషనల్ డిఫెన్స్ కాలేజీల్లో విద్యాభ్యాసం చేసిన లెఫ్టినెంట్ జనరల్ వీరేంద్ర వత్స్ కార్యాచరణ, నాయకత్వంలో విశేష అనుభవాన్ని గడించారు. ఆయన నైపుణ్యం, దార్శనికత ఎన్‌సీసీని నూతన శక్తితో నడిపించగలవని, దేశం కోసం క్రమశిక్షణ గల, బాధ్యతాయుతమైన, భవిష్యత్తుకు సిద్ధంగా ఉన్న యువతను రూపొందించడంలో ఎన్‌సీసీ పాత్రను ఆయన మరింత మెరుగుపరచగలరని భావిస్తున్నారు.

# బ్రిడ్జి రోడ్డు మరమ్మతు పనులు పూర్తి చేయాలి : కలెక్టర్ రాహుల్ రాజ్



మెదక్, అక్టోబర్ 3:బ్రిడ్జి రోడ్డు మరమ్మతు పనులు పూర్తి చేయాలి అని కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. మెదక్ నుండి ముక్త భూపతిపూర్ వెళ్లే తాత్కాలిక బ్రిడ్జి రోడ్డు నిర్మాణాన్ని, మహిళా శక్తి భవనం నిర్మాణ పనులు శుక్రవారం కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

వర్షాలు వరదలు తాకిడికి గతంలో మెదక్ ముక్త భూపతిపూర్ బ్రిడ్జి భారీగా దెబ్బతిన్న దానిని తాత్కాలిక మరమ్మతులు చేపట్టడం జరిగిందని వాటిని పరిశీలించి పనులు తొందరగా పూర్తి చేయాలని ఆదేశించామని చెప్పారు.

అలాగే మహిళా శక్తి భవనం నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని ఆదేశించామని వివరించారు.

# టెట్ తీర్పుపై రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే అప్పీల్ చేయాలి : టీఎస్ యూటీఎఫ్

ఖమ్మం, అక్టోబర్ 3: సుప్రీంకోర్టు ఇటీవల ఇచ్చిన తీర్పుతో టెట్ ఉత్తీర్ణత సర్వీస్‌లో కొనసాగడానికి, పదోన్నతి పొందడానికి తప్పనిసరి కావడం సీనియర్ ఉపాధ్యాయులకు ఆశనిపాతంగా మారిందని టీఎస్ యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పారుపల్లి నాగేశ్వరరావు ఆందోళన వ్యక్తం చేశారు. శుక్రవారం మధిర డివిజన్ కార్యాలయంలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. టెట్ మినహాయింపు విషయంలో ప్రభుత్వం జోక్యం చేసుకుని సీనియర్ ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు టెట్ తీర్పుపై తక్షణమే అప్పీల్ చేసి, సీనియర్ ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని కోరారు. ఎన్‌సీటీఈ నోటిఫికేషన్‌కు ముందు నియమించబడిన ఉపాధ్యాయులందరికీ టెట్ నుండి మినహాయింపు ఇవ్వాలన్నారు. టెట్ సిలబస్, ఉత్తీర్ణత మార్కుల శాతాన్ని ఉపాధ్యాయులకు అనుకూలంగా సవరించాలన్నారు. పదోన్నతుల్లో మిగిలిపోయిన ఖాళీ పోస్టులకు వెంటనే పదోన్నతులు కల్పించాలని, గిరిజన సంక్షేమ శాఖ ఉపాధ్యాయుల పదోన్నతుల షెడ్యూల్ విడుదల చేయాలన్నారు. మోడల్ స్కూల్స్‌లో దశాబ్ద కాలంగా నిలిచిపోయిన పదోన్నతుల సమస్యలను పరిష్కరించి, పదోన్నతులు కల్పించి, ఖాళీగా ఉన్న ఎంఈఓ, డిప్యూటీ డీఈఓ, డైట్ లెక్చరర్ పోస్టులకు పదోన్నతులు కల్పించాలని కోరారు. తెలుగు, హిందీ, పీఈటీ పోస్టులు ఖాళీగా ఉన్నందున సర్వీస్ రూల్స్ సవరించి, ఎస్‌జీటీలకు పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు.

# ఇంద్రకీలాద్రి దసరా ఉత్సవాలు



**-అపురూపంగా కనకదుర్గమ్మ అలంకరణ**
**-ఏకాదశ అలంకారాల్లో దుర్గమ్మ దర్శనం**
**-తన్మయంతో వీక్షించిన భక్తజనం**
**-14 లక్షల మంది రాక..**
**-30 లక్షలకు పైగా లడ్డు విక్రయం**
**-అమ్మవారికి కోట్ల రూపాయల ఆదాయం**
**-బంగారం, వెండి, విదేశీ డాలర్లు అమ్మకు బహుమానం**
**-ఫలించిన ఉన్నతాధికారుల కష్టం**
**-లోటుపాట్లకు తావివ్వని అధికార యంత్రాంగం**
**-అధికారులకు సీఎం చంద్రబాబు ప్రశంసలు..**



అమరావతి, అక్టోబర్ 3: శ్రీ విశ్వవసు నామ సంవత్సర దసరా శరన్నవరాత్రి మహోత్సవాలు విజయవాడ ఇంద్రకీలాద్రిపై అట్టహాసంగా జరిగాయి. ఉత్సవాల సందర్భంగా అమ్మవారి దివ్య మంగళ అలంకరణ, మిరమిడ్లు గులిపే విద్యుత్ దీపాల అంకరణ, జై భవాని నామస్మరణ.. వర్ణమాల శోభితమైన పొలాలంకరణ.. వెరసి ఇలా వైకుంఠాన్ని తలపించేలా ఇంద్ర గిరిలు పులకరించాయి. ఆధ్యాత్మిక వైభవాన్ని చాటి చెబుతూ సకలజనులకు భక్త పారవశ్యంలో వాళ్లలాడించేలా శ్రీ కనకదుర్గమ్మ వారి దసరా శరన్నవరాత్రి మహోత్సవాలు పరమ పవిత్రంగా 11 రోజులపాటు నిర్వహించారు.

జగదంబ వేడుకల కోసం నగరమంతా వెలుగు రవ్వలు పూయగా 11అలంకరణలో కనకదుర్గమ్మ వారు భక్తులకు అనుగ్రహించారు. మనసారా కనులారా వీక్షించిన భక్తజనం కనకదుర్గమ్మకు బంగారం వెండి విదేశీ డాలర్లు నగదుతో ముక్కులను చెల్లించుకున్నారు. పరమ పవిత్రంగా జరిగిన దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా చివరి రోజు దసరా పర్వదినం నాడు పూర్ణాహుతితో ఉత్సవాలు ముగియగా, సాయంత్రం సమయాన గంగా పార్వతి సమేత మల్లేశ్వర స్వామి వారు నగరోత్సవంలో భక్తులకు కనువిందు చేసి హంస వాహనంపై ప్రత్యేక పూజలను అందుకున్నారు.

**లక్షల్లో తరలి వచ్చిన భక్తులు..**

ఈ ఏడాది విజయవాడలోని ఇంద్రకీలాద్రిపై నిర్వహించిన దసరా శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా జిల్లాలు రాష్ట్రాలు దేశాలు దాటి భక్తులు లక్షల సంఖ్యలో తరలివచ్చారు. మొదటి మూడు రోజులు లక్షలోపు భక్తుల రాక అమ్మవారి ఆలయానికి ఉండగా తర్వాత రోజుల్లో లక్షకు దాటుతూ ప్రతిరోజు భక్తులు తరలి వస్తూనే ఉన్నారు. శరన్నవరాత్రి ఉత్సవాల 11 రోజుల్లో సుమారు 14 లక్షలకు పైగా భక్తులు అమ్మవారిని వివిధ రూపాలలో దర్శించుకున్నారు. ఉత్సవాల సందర్భంగా అమ్మవారి ప్రసాదమైన లడ్డు మూడు లక్షలకు పైగా విక్రయాలు జరిగాయి. అలాగే పలు అర్జిత సేవలతో పాటు తలనీలాలు వివిధ రూపాల్లో టికెట్లు కొనుగోలుతో కనకదుర్గమ్మ వారికి కోట్ల రూపాయల ఆదాయం సమకూరింది. ఈ వేడుకల్లో అమ్మవారి దర్శనానికి భక్తులకు మూడు నుండి గరిష్టంగా ఏడు గంటల సమయం పట్టగా, ప్రతిరోజు హోల్డింగ్ ఏరియాలో భక్తులు అమ్మ దర్శనం కోసం ఎదురుచూడాల్సి వచ్చింది.

**క్రమంగా పెరిగిన భవానీల రాక..**

ఇంద్రకీలాద్రి దసరా ఉత్సవాల సందర్భంగా చివరి నాలుగు రోజుల్లో భవానీల రాక క్రమక్రమంగా పెరుగుతూ వచ్చింది. మండల దీక్ష అర్థ మండల దీక్ష 11 రోజుల దీక్ష తీసుకుంటున్న భవానీలు కనకదుర్గమ్మను దర్శించుకుని ఇరుముడులు సమర్పించుకుని దీక్షా విరమణ చేసేందుకు రాష్ట్రంలోని పలు జిల్లాల నుండి మారుమూల ప్రాంతాల నుండి పెద్ద ఎత్తున తరలి వచ్చారు. ఉత్తరాంధ్ర నుండి ఎక్కువ సంఖ్యలో వచ్చిన భవానీల రాకతో పాటు పశ్చిమగోదావరి తూర్పుగోదావరి తో పాటు ఉమ్మడి కృష్ణాజిల్లా నుండి పెద్ద ఎత్తున భక్తులు కాలినడకన తమ ప్రాంతం నుండి ఇంద్రకీలాద్రి కి తరలివచ్చారు. భవానీల రాక పెరుగుతుండడం జై భవాని నామస్మరణ మారుమోగుతుండడంతో క్యూ లైన్లన్నీ గరిష్టంగా భక్తులతో కిటకిటలాడుతూ వచ్చాయి. చివరి రోజుల్లో భవానీల రాక పెరిగిన సందర్భంలో అధికారులు క్యూ లైన్లు అన్నింటిని ఉచితం చేయడంతో అమ్మవారి దర్శనం సాధారణ భక్తులకు త్వరగా అయ్యేలా జరిగింది.

**పూర్ణాహుతితో ముగిసిన ఉత్సవాలు**

ఇంద్రకీలాద్రిపై 11 రోజులు అత్యంత వైభవంగా జరిగిన దసరా శరన్నవరాత్రి మహోత్సవాలు చివరి రోజు దసరా పర్వదినం గురువారం నాడు పూర్ణాహుతితో ఉత్సవాలు ముగిశాయి. ఇంద్రకీలాద్రిపై ఉన్న పాత యాగశాలలో అత్యంత వైభవంగా నిర్వహించిన పూర్ణాహుతి కార్యక్రమంలో కమిషనర్ రామచంద్ర మోహన్ ఈవో శీనా నాయక్ దుర్గ గుడి చైర్మన్ బొర్రా రామకృష్ణ గాంధీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలను పూర్ణాహుతి కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉత్సవాల చివరి రోజు స్వామివారిని కొండపై నుండి ఊరేగింపుగా నగరోత్సవంలో భాగంగా కనకదుర్గ నగరకు తీసుకువచ్చి అక్కడ నుండి ఊరేగింపుగా దుర్గా ఘాటులోని హంస వాహనంపై కూర్చుండబెట్టి ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఈ ఏడాది నీటి ప్రవాహం అత్యధికంగా ఉన్న నేపథ్యంలో అధికారులు జలవిహారాన్ని రద్దు చేయడంతో కేవలం హంస వాహనంపై అమ్మవారికి ప్రత్యేక పూజలను నిర్వహించిన అనంతరం ఉత్సవ విగ్రహాలను వంటల్లోని పోలీస్ స్టేషన్ కు ఊరేగింపుగా తీసుకువెళ్లారు.

**ఏర్పాట్లు సమర్థవంత నిర్వహణపై సీఎం ప్రశంసలు**

మునుపెన్నడూ లేని విధంగా ఈ ఏడాది దసరా శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఇంద్రకీలాద్రిపై భక్తుల సౌకర్యం కోసం చేసిన ఏర్పాట్లపై సీఎం చంద్రబాబు నాయుడు అధికారులకు ప్రత్యేకంగా ప్రశంసించారు. అంకిత భావం పూర్తి సమన్వయంతో సమర్థవంతంగా లక్షల సంఖ్యలో వచ్చిన భక్తులకు అమ్మవారి దర్శనాన్ని అత్యంత ప్రశాంత వాతావరణంలో నిర్వహించినందుకు సీఎం చంద్రబాబు నాయుడు అధికారులకు అభినందనలు తెలిపారు. దసరా పర్వదినం నాడు ఉత్సవాల నిర్వహణ ఏర్పాట్లను ప్రశంసిస్తూ సీఎం చంద్రబాబు నాయుడు ప్రత్యేక ట్వీట్లు అధికారులకు ప్రశంసల జల్లు కురిపించారు.

## దేశంలో 2025-26 నుంచి 2030-31 వరకు కాయ ధాన్యాల

# స్వయంసమృద్ధ కార్యక్రమం అమలుకు కేంద్ర మంత్రిమండలి ఆమోదం

న్యూఢిల్లీ, అక్టోబర్ 3:ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ అధ్యక్షతన సమావేశమైన కేంద్ర మంత్రిమండలి ఇవాళ కాయధాన్యాల స్వయంసమృద్ధ కార్యక్రమం అమలుకు ఆమోదం తెలిపింది. దేశంలో పప్పుగింజల ఉత్పత్తి పెంపు సహా స్వావలంబన సాధించడమే ఈ వినూత్న కార్యక్రమ లక్ష్యం. దీన్ని 2025-26 నుంచి 2030-31 వరకూ రూ.11,440 కోట్ల అంచనా వ్యయంతో ఆరేళ్లపాటు అమలు చేస్తారు.

భారతీయ వంట సాగు వ్యవస్థలు, ఆహార పదార్థాల్లో కాయధాన్యాలకు ప్రత్యేక ప్రాధాన్యం ఉంది. అలాగే భారత్ ప్రపంచంలోనే అతిపెద్ద పప్పుగింజల ఉత్పత్తిదారు మాత్రమేగాక వినియోగదారు కావడం గమనార్హం. ఈ నేపథ్యంలో జీవన ప్రమాణాలతోపాటు ఆదాయాల పెరుగుదల కారణంగా దేశంలో వీటి వినియోగం కూడా పెరిగింది. అయితే, దేశీయంగా ఉత్పత్తి ఈ డిమాండుకు తగినట్లు లేనందువల్ల పప్పుగింజల దిగుమతి 15 నుంచి 20 శాతం దాకా పెరిగింది.

దేశీయ డిమాండ్ తీర్చే దిశగా ఉత్పత్తి పెంపు, దిగుమతి పరాధీనత తగ్గింపు సహా రైతుల ఆదాయం పెంచే లక్ష్యంతో ఆరేళ్లపాటు "కాయధాన్యాల స్వయంసమృద్ధ కార్యక్రమం" అమలు చేస్తామని ప్రభుత్వం 2025-26 ఆర్థిక సంవత్సరం బడ్జెట్‌లో ప్రకటించింది.

ఇందులో భాగంగా పరిశోధన, విత్తన వ్యవస్థలు, సాగు విస్తీర్ణం పెంపు, పంట కొనుగోళ్లు, ధరల స్థిరీకరణ వగైరాలతో కూడిన సమగ్ర వ్యూహాన్ని అనుసరిస్తారు.

ఉత్పాదకత, తెగులు నిరోధం, వాతావరణ సహిష్ణుతగల ఆధునిక రకాల విత్తనాల అభివృద్ధి, విస్తరణకూ ప్రాధాన్యమిస్తారు. ప్రాంతీయ అనుకూలత నిర్ధారణ కోసం పప్పుగింజలు సాగుచేసే కీలక రాష్ట్రాల్లో బహుళ ప్రాంతాల్లో పరీక్షలు నిర్వహిస్తారు.

దీంతోపాటు అత్యుత్తమ నాణ్యతగల విత్తన లభ్యతకు భరోసా ఇస్తూ, రాష్ట్రాలు ఐదేళ్ల పాటు రోలింగ్ విత్తనోత్పత్తి ప్రణాళికలను రూపొందిస్తాయి. ఇందులో భాగంగా విత్తన సాగు ఉత్పత్తిని 'ఐసీఏఆర్' పర్యవేక్షిస్తే, ఫౌండేషన్-సర్టిఫైడ్ విత్తనోత్పత్తి బాధ్యతను కేంద్ర-రాష్ట్ర స్థాయి సంస్థలు నిర్వర్తిస్తాయి. అలాగే 'సీడ్ అథెంటికేషన్, ట్రేసబిలిటీ అండ్ హోలిస్టిక్ ఇన్వెంటరీ' (సాథీ) పోర్టల్ ద్వారా పురోగతిపై నిశిత పర్యవేక్షణ ఉంటుంది.

మెరుగైన రకాల విస్తృత లభ్యత లక్ష్యంగా 2030-31 నాటికి 370 లక్షల హెక్టార్లలో పప్పుగింజల సాగు కోసం రైతులకు 126 లక్షల క్వింటాళ్ల సర్టిఫైడ్ విత్తనాలను పంపిణీ చేస్తారు.

అంతేగాక భూసార మెరుగుదల కార్యక్రమం, వ్యవసాయ యాంత్రీకరణపై ఉప-కార్యక్రమం, సమతుల ఎరువుల వినియోగం, మొక్కల రక్షణ, ఉత్తమ పద్ధతులకు ప్రోత్సాహం కోసం "ఐసీఏఆర్, కేవీకే"లతోపాటు రాష్ట్ర వ్యవసాయ శాఖలు విస్తృత ప్రదర్శనలు నిర్వహిస్తాయి.

వరి సాగు అనంతర తాత్కాలిక బీడు ప్రాంతాలు, ఇతర మార్పిడి హిత భూముల సద్వినియోగంతో కాయధాన్యాల విస్తీర్ణాన్ని మరో 35 లక్షల హెక్టార్ల మేర విస్తరించడం ఈ కార్యక్రమంలో ఒక భాగంగా ఉంది. అంతర పంటలు, పంటల మార్పిడిని ప్రోత్సహించడం ద్వారా దీనికి ప్రభుత్వం మద్దతిస్తుంది. ఈ దిశగా రైతులకు 88 లక్షల విత్తన కిట్లను ఉచితంగా పంపిణీ చేస్తారు.

సుస్థిర పద్ధతులు, ఆధునిక సాంకేతికతలను ప్రోత్సహిస్తూ నిర్మాణాత్మక శిక్షణ కార్యక్రమాలతో రైతులు, విత్తన సాగుదారుల సామర్థ్య వికాసానికి కృషి చేస్తారు.

మార్కెట్లు, విత్తనోత్పత్తి వ్యవస్థల బలోపేతం లక్ష్యంగా మిషన్-1000 ప్రాసెసింగ్ యూనిట్లు సహా పంటకోత అనంతర మౌలిక సదుపాయాల కల్పనలో ప్రభుత్వం తోడ్పాటునిస్తుంది. తద్వారా పంట నష్టాల తగ్గింపు, విలువ జోడింపులో మెరుగుదల, రైతు ఆదాయం పెంపు లక్ష్యాల సాధనకు కృషి చేస్తుంది. అలాగే ప్రాసెసింగ్, ప్యాకేజింగ్ యూనిట్ల ఏర్పాటుకు గరిష్ఠంగా రూ.25 లక్షల రాయితీ కూడా లభిస్తుంది.

మిషన్ క్లస్టర్ ఆధారిత విధానం ద్వారా ప్రతి క్లస్టర్ నిర్దిష్ట అవసరాల మేరకు కార్యక్రమాలను రూపొందిస్తారు. దీనికింద వనరుల సమర్థ కేటాయింపు, ఉత్పాదకత పెంపు, పప్పు గింజల ఉత్పత్తిలో భౌగోళిక వైవిధ్యానికి ప్రోత్సాహం వంటి చర్యలు చేపడతారు.

'పీఎం-ఆశా' కింద ధరల మద్దతు పథకం (పీఎస్ఎస్) ప్రకారం ప్రధానంగా కంది, మినుము, సెనగ పంటలను గరిష్ఠ స్థాయిలో కొనుగోలు చేస్తారు. ఈ కార్యక్రమంలో పాలుపంచుకునే రాష్ట్రాల్లో తమతో ఒప్పందం కుదుర్చుకునే రైతుల నుంచి 'నాఫెడ్, ఎన్‌సీసీఎఫ్' సంస్థలు నాలుగేళ్లపాటు 100 శాతం పంటను కొంటాయి.

అంతేగాక రైతులలో ఆత్మవిశ్వాసం ఇనుమడించే దిశగా ప్రపంచ పప్పుగింజల ధరల పర్యవేక్షణ కోసం ఈ కార్యక్రమం కింద ఒక యంత్రాంగం ఏర్పాటవుతుంది.

దేశవ్యాప్తంగా 2030-31 నాటికి పప్పుగింజల సాగు విస్తీర్ణాన్ని 310 లక్షల హెక్టార్లకు పెంచడంతోపాటు ఉత్పత్తిని 350 లక్షల టన్నులకు, దిగుబడి 1130 కిలోలకు పెంపు ఈ కార్యక్రమ లక్ష్యాలు. ఈ విధంగా ఉత్పాదకత ప్రయోజనాలతోపాటు ఈ కార్యక్రమం ద్వారా గణనీయ ఉపాధి కూడా లభిస్తుంది.

కాయధాన్యాల ఉత్పాదనలో స్వావలంబన సాధన, దిగుమతి పరాధీనత తగ్గింపు, రైతుల ఆదాయం పెంపు సహా విలువైన విదేశీ మారకద్రవ్యం ఆదా చేయడం ఈ కార్యక్రమ లక్ష్యాలు.

వాతావరణ సహిష్ణుత పద్ధతులు, భూసారం మెరుగుదల, పంట అనంతర తాత్కాలిక బీడు ప్రాంతాల ఉత్పాదకత సద్వినియోగం వంటి గణనీయ పర్యావరణ ప్రయోజనాలను కూడా సాధించాలన్నది దీని ధ్యేయం.

# వ్యక్తిగత వికాసంతో పాటు శాఖలో చైతన్యాన్ని నింపేందుకు రాచమార్గమైన జాతి నిర్మాణ లక్ష్యమే ఆర్ఎస్ఎస్ వందేళ్ల కృషికి పునాదిరాయి: ప్రధానమంత్రి

న్యూఢిల్లీ, అక్టోబర్ 3:రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) శత వార్షికోత్సవాలు ఈ రోజు న్యూఢిల్లీలో నిర్వహించగా ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఈ కార్య క్రమానికి ముఖ్య అతిథిగా హాజరై, సభను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ముందుగా దేశ ప్రజలకు నవరాత్రి శుభాకాంక్షలు తెలిపారు. ఈ రోజున మహా నవమి.. సిద్ధిధాత్రి అమ్మవారిని ఆరాధించేది ఈ రోజేనని ఆయన గుర్తు చేశారు. రేపు విజయదశమి మహా పర్వదినం.. ఈ పండుగ భారతీయ సంస్కృతిలో ఓ శాశ్వత జయఘోషకు సంకేతం.. అన్యాయంపై న్యాయం, అసత్యంపై సత్యం, చీకటిపై వెలుగు పైచేయిని సాధించిన సన్నివేశమని ఆయన అభివర్ణించారు. అంతటి పవిత్ర సందర్భంలో, వంద సంవత్సరాల కిందట రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్‌ను స్థాపించారు. ఇది యాదృచ్ఛిక ఘటన ఏమీ కాదని ఆయన ఉద్ఘాటించారు. ఇది వేల సంవత్సరాలుగా కొనసాగుతూ వస్తున్న ప్రాచీన సంప్రదాయాన్ని పునరుద్ధరించడమే.. దీనిలో భాగంగా ప్రతి యుగంలోనూ అప్పటి సవాళ్లను ఎదుర్కోవడానికి జాతీయ అంతశ్చేతన కొత్త కొత్త రూపాలను తీసుకొంటూ ఉంటుందని ఆయన అన్నారు. ఈ యుగంలో, నిత్య జాతీయ చైతన్యం మూర్తీభవించిన ఓ ప్రతిరూపంగా సంఘ్ నిలుస్తోందని ఆయన తేల్చి చెప్పారు.

రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ వందో సంవత్సరానికి సాక్షులుగా నిలవడం ఇప్పటి తరానికి దక్కిన భాగ్యమని శ్రీ మోదీ ముఖ్యంగా ప్రస్తావించారు. దేశ సేవకు సంకల్ప బద్ధులైన అనేక మంది స్వయంసేవకులకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. సంఘ్ స్థాపకుడు, ఆదర్శ నేత డాక్టర్ హెడ్గేవార్ చరణాలకు ప్రధానమంత్రి శ్రద్ధాంజలి ఘటించారు. సంఘ్ 100 సంవత్సరాల వైభవోపేత యాత్రను స్మరించుకోవడానికి భారత ప్రభుత్వం ఒక ప్రత్యేక తపాలా బిళ్లనూ, ఒక స్మారక నాణేన్నీ విడుదల చేసిందని ఆయన ప్రకటించారు. 100 రూపాయల నాణెంలో ఒక వైపు జాతీయ చిహ్నం ఉంటే, మరో వైపు సింహం, వరద ముద్రతో ఉన్న భారత్ మాత భవ్య చిత్రానికి వందనాన్ని ఆచరిస్తున్న స్వయంసేవకులు ఉన్నారు. భారతీయ కరెన్సీలో భారత్ మాత బొమ్మ కనిపించడం స్వతంత్ర భారతదేశ చరిత్రలో బహుశా ఇది మొదటి సారి కావచ్చని శ్రీ మోదీ ముఖ్యంగా ప్రస్తావించారు. సంఘ్‌కు మార్గదర్శిగా నిలిచిన "రాష్ట్రాయ స్వాహా, ఇదం రాష్ట్రాయ, ఇదం న మమ" అనే ఆదర్శ వాక్యం కూడా ఈ నాణెంలో చోటు చేసుకుందని ఆయన వివరించారు.

ఈ రోజున విడుదల చేసిన స్మారక తపాలా బిళ్లకున్న ప్రాధాన్యాన్ని ప్రధానమంత్రి తెలియజేస్తూ, దీనికి చారిత్రక నేపథ్యం ఉందన్నారు. 1963లో జనవరి 26న గణతంత్ర దిన కవాతు విశిష్టతను ఆయన గుర్తుకు తెస్తూ, ఆ పరేడ్‌లో ఆర్ఎస్ఎస్ స్వయంసేవకులు ఎంతో అభిమానంతో పాల్గొని, దేశభక్తి గీతాల లయకు అనుగుణంగా కదం తొక్కారన్నారు. ఆనాటి చరిత్రాత్మక ఘట్టం జ్ఞాపకాలను ఈ స్టాంపు ఒడిసిపట్టుకుని మన కళ్లెదుట నిలుపుతోందని ఆయన వ్యాఖ్యానించారు.

''ఈ స్మారక తపాలా బిళ్ల ఆర్ఎస్ఎస్ స్వయంసేవకుల అచంచల అంకిత భావానికి కూడా అద్దంపడుతోంది.. స్వయంసేవకులు దేశానికి క్రమం తప్పక సేవలందిస్తూ, సమాజాన్ని శక్తిమంతం చేస్తున్నార"ని శ్రీ మోదీ చెప్పారు. ఈ స్మారక నాణెం, తపాలా బిళ్ల విడుదల సందర్భంగా భారతీయులకు శ్రీ మోదీ మన స్ఫూర్తిగా అభినందనలు తెలిపారు.

గొప్ప నదులు.. తీరప్రాంతాల్లో మానవ నాగరికతను పెంచి పోషించినట్లుగానే, రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ కూడా ఎంతో మంది జీవనాన్ని తీర్చిదిద్ది సుసంపన్నం చేసిందని ప్రధానమంత్రి అభివర్ణించారు. నది తాను ప్రవహించిన చోట భూమినీ, పల్లెలనూ, ప్రాంతాలనూ సారవంతం చేస్తే, సంఘ్ సైతం భారతీయ సమాజంలో ప్రతి రంగాన్నీ, దేశంలో ప్రతి ప్రాంతాన్నీ స్పర్శించిందని శ్రీ మోదీ వివరించారు. ఇది నిరంతరాయ అంకితభావం, శక్తిమంతమైన జాతీయతా ప్రవాహాల పర్యవసానమేనని ఆయన అన్నారు.

ఒక నది అనేక పాయలుగా విస్తరించే మాదిరే, రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ కూడా శాఖోపశాఖలుగా విస్తరించిందనీ, ఈ రెండూ... వివిధ ప్రాంతాలను సమృద్ధం చేస్తున్నాయనీ ప్రధానమంత్రి పోల్చారు. సంఘ్ తన ప్రస్థానంలో వేర్వేరు అనుబంధ సంస్థల సాయంతో... విద్య, వ్యవసాయం, సమాజ సంక్షేమం, గిరిజనుల అభ్యున్నతి, మహిళలకు సాధికారత కల్పన, కళలు, విజ్ఞానశాస్త్రాలు, కార్మిక రంగం వంటి రంగాల్లో పనిచేయడం ద్వారా దేశానికి సేవ చేయడంలో నిమగ్నం అయిందన్నారు. సంఘ్ అనేక భాగాలుగా విస్తరించినప్పటికీ, వాటి మధ్య చీలిక ఎన్నడూ రాలేదని శ్రీ మోదీ ముఖ్యంగా ప్రస్తావించారు. "ప్రతి ఒక్క శాఖకూ, విభిన్న రంగాల్లో పనిచేస్తున్న ఒక్కొక్క సంస్థకూ ఒకే పరమార్థం, భావోద్వేగం ఉన్నాయి.. అది.. దేశమే అన్నింటి కన్నా మిన్న అనేదే" అని ప్రధానమంత్రి స్పష్టం చేశారు.

"నాందీ ప్రస్తావన జరిగినప్పటి నుంచీ దేశ నిర్మాణం అనే ఒక మహాధ్యేయాన్ని రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ అనుసరిస్తూ, ముందుకుపోతోంది" అని శ్రీ మోదీ అన్నారు. ఈ లక్ష్యాన్ని సాధించడానికి సంఘ్ వ్యక్తిగత వికాసాన్ని సాధించే దారిని ఎన్నుకొని, ఆ బాటలో ముందుకు పోయి దేశాభివృద్ధిని సాధించాలనుకుందని ఆయన చెప్పారు. ఈ మార్గంలో ముందుకు కదలడానికి సంఘ్ ఒక క్రమశిక్షణతో కూడిన పనితీరును ఒక పద్ధతినీ ఆలంబనగా చేసుకుందనీ, శాఖలను ప్రతిరోజూ, క్రమం తప్పకుండా నిర్వహిస్తూ ఉండడమే ఆ పద్ధతి" అని శ్రీ మోదీ వివరించారు.

"పౌరులు దేశం పట్ల తమ బాధ్యతను గుర్తించినప్పుడే దేశం నిజంగా బలపడుతుందనీ, దేశం కోసం ప్రతి ఒక్కరూ పాటుపడితేనే భారత్ ఉన్నత స్థితికి చేరుకొంటుందనీ పూజ్యుడు డాక్టర్ హెడ్గేవార్ గ్రహించార''ని ప్రధానమంత్రి అన్నారు. ఈ కారణంగానే డాక్టర్ హెడ్గేవార్ వ్యక్తిగత వికాసానికి కట్టుబడి ఉంటూ, ఒక అపూర్వ వైఖరిని అవలంబించారని శ్రీ మోదీ చెప్పారు. "ప్రజలను వారు ఎలా ఉంటే అలా స్వీకరించి, వారిని ఎలా మలిస్తే బాగుంటుందో అలా తీర్చిదిద్దాలి" అనే సిద్ధాంతం బాటలో సాగాలని డాక్టర్ హెడ్గేవార్ చెప్పేవారని శ్రీ మోదీ తెలిపారు. కుండలను తయారు చేసే వ్యక్తి బంకమట్టిని తీసుకొని, నిష్ఠగా పనిచేస్తూ, ఒక ఆకారాన్ని తీర్చిదిద్ది బట్టీలో కాల్చి.. చివరకు ఇటుకలను ఉపయోగించి ఒక గొప్ప నిర్మాణాన్ని రూపొందిస్తాడు. డాక్టర్ హెడ్గేవార్ కూడా ప్రజలతో అనుబంధాన్ని ఇదే రకంగా విస్తరించారు. సామాన్యులను ఎంపిక చేసి, వారికి శిక్షణనిచ్చి, దృష్టికోణాన్ని అలవరచి, దేశం కోసం పనిచేసే అంకితభావం కల స్వయంసేవకులుగా మార్చారని శ్రీ మోదీ వివరించారు. ఈ కారణంగానే సంఘ్ గురించి చెప్పేటప్పుడు, అసాధారణ, అపూర్వ పనులను పూర్తి చేయడానికి ఒక చోట గుమికూడేది సాధారణ ప్రజానీకమేనని చెబుతారని ప్రధానమంత్రి అన్నారు.

రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్‌కు చెందిన శాఖల్లో వ్యక్తిగత వికాసం అనే ఒక పవిత్ర క్రతువు ఈనాటికీ వర్ధిల్లుతోందని శ్రీ మోదీ ముఖ్యంగా ప్రస్తావించారు. శాఖ కార్యక్రమాలను నిర్వహించే మైదానాన్ని ప్రేరణనందించే ఒక పవిత్ర స్థలంగా ఆయన అభివర్ణించారు. "ఈ స్థలంలో స్వయంసేవక్ తన ప్రయాణాన్ని "నేను" నుంచి ఆరంభించి, "మనం" వైపునకు సాగిపోతుంది. ఇది సమష్టి భావనను ప్రతిబింబిస్తుంది" అని శ్రీ మోదీ చెప్పారు. ఒక వ్యక్తి స్వభావాన్ని తీర్చిదిద్ది, శారీరక, మానసిక, సాంఘిక ఉన్నతికి తోడ్పడే యజ్ఞ వేదికలే శాఖలు అని ఆయన వ్యాఖ్యానించారు. శాఖలలో దేశ సేవ, సాహస భావన అంకురిస్తాయి, త్యాగం, అంకితభావం అలవడుతాయి. వ్యక్తిగత బాగోగుల ఆపేక్ష తగ్గిపోయి, స్వయంసేవక్ లో సామూహిక నిర్ణయాలు తీసుకొనేందుకూ, జట్టు స్ఫూర్తి ప్రతిఫలించే విలువలను ఇముడ్చుకొనేందుకూ ముందుకు ఉరుకుతారు అని ప్రధానమంత్రి వివరించారు.

రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ వందేళ్ల ప్రయాణం జాతి నిర్మాణ దృక్పథం.. వ్యక్తిత్వ వికాసం కోసం స్పష్టమైన మార్గం.. శాఖల రూపంలో నిరాడంబరమైన, అద్భుతమైన పని విధానం.. అనే మూడు మూలస్తంభాలపై ఆధారపడిందని శ్రీ మోదీ స్పష్టం చేశారు. ఈ స్తంభాల ఆధారంతోనే సంఘ్ లక్షలాది స్వయంసేవకులను రూపొందించిందన్నారు. అంకితభావం, సేవ, జాతీయ శ్రేష్ఠత పట్ల నిబద్ధతతో విభిన్న రంగాల్లో వారు దేశాన్ని ముందుకు తీసుకెళ్తున్నారని ప్రధానమంత్రి వ్యాఖ్యానించారు.

రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ ఆవిర్భావం నుంచీ తన ప్రాధాన్యాలను దేశం ప్రాధాన్యాలతో అనుసంధానించిందని స్పష్టం చేసిన ప్రధానమంత్రి... ప్రతి యుగంలోనూ దేశం ఎదుర్కొంటున్న ప్రధాన సవాళ్లను సంఘ్ ఎదుర్కొందన్నారు. స్వాతంత్ర్య పోరాటాన్ని గుర్తుచేసుకుంటూ.. గౌరవనీయ డాక్టర్ హెడ్గేవార్ సహా అనేక మంది సంఘ్ కార్యకర్తలు స్వాతంత్ర్యోద్యమంలో చురుగ్గా పాల్గొన్నారని, డాక్టర్ హెడ్గేవార్ అనేకసార్లు జైలు శిక్షనూ అనుభవించారని ఆయన పేర్కొన్నారు. సంఘ్ అనేక మంది స్వాతంత్ర్య సమరయోధులకు మద్దతునిచ్చిందనీ, వారితో భుజం భుజం కలిపి పనిచేసిందని ప్రధానమంత్రి ప్రధానంగా ప్రస్తావించారు. 1942లో చిమూర్‌లో జరిగిన ఉద్యమాన్ని ప్రస్తావిస్తూ అక్కడ చాలా మంది స్వయంసేవకులు బ్రిటిష్ దురాగతాలను భరించారని తెలిపారు. స్వాతంత్ర్యం తర్వాత కూడా హైదరాబాద్‌లో నిజాం అణచివేతను ప్రతిఘటించడం నుంచి గోవా, దాద్రా-నగర్ హవేలి విముక్తికి దోహదపడటం వరకు సంఘ్ తన త్యాగాలను కొనసాగించిందని ఆయన వ్యాఖ్యానించారు. ఈ మొత్తం ప్రయాణంలో "దేశమే ముందు" అనే మార్గదర్శక భావన.. "ఏక్ భారత్, శ్రేష్ఠ భారత్'' అనే మహోన్నత లక్ష్యంతో సంఘ్ ముందుకు సాగుతోందని శ్రీ నరేంద్ర మోదీ తెలిపారు.

దేశసేవ ప్రయాణంలో రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ ఎన్నో దాడులు, కుట్రలనూ ఎదుర్కొందని తెలిపిన ప్రధానమంత్రి.. స్వాతంత్ర్యానంతరం కూడా సంఘ్‌ను అణచివేయడానికి, ప్రధాన స్రవంతితో దాని ఏకీకరణను నిరోధించేందుకు జరిగిన ప్రయత్నాలను శ్రీ మోదీ గుర్తు చేసుకున్నారు. పూజ్య గురూజీని తప్పుడు ఆరోపణలతో జైలుకు పంపారని ఆయన పేర్కొన్నారు. జైలు నుంచి విడుదలైన తర్వాత గురూజీ అత్యంత ప్రశాంతతతో స్పందిస్తూ.. "కొన్నిసార్లు నాలుక దంతాల కింద చిక్కుకుని నలిగిపోతుంది. కానీ మనం దంతాలు విరగ్గొట్టం.. ఎందుకంటే దంతాలు, నాలుక రెండూ మనవే" అని చెప్పిన మాటలను ఉటంకించారు. తీవ్రమైన హింస, వివిధ రకాల అణచివేతను భరించినప్పటికీ గురూజీకి ఎటువంటి ఆగ్రహంగానీ, ద్వేషంగానీ లేదని ప్రధానమంత్రి స్పష్టం చేశారు. మహర్షుల వ్యక్తిత్వం, సైద్ధాంతిక స్పష్టతతో గురూజీ ప్రతి స్వయంసేవకుడికీ మార్గదర్శకులుగా దారి చూపుతూ.. సమాజంలో ఐక్యతను, సానుభూతి విలువలను బలోపేతం చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. నిషేధాలు, కుట్రలు, తప్పుడు కేసులు ఎదుర్కొన్నప్పటికీ స్వయంసేవకులు ఎప్పుడూ ద్వేషానికి చోటివ్వలేదన్నారు. వారూ సమాజంలో భాగంగానే భావించారనీ.. అందుకే మంచీ వారికే చెందుతుంది.. తక్కువ మంచి కూడా వారికే చెందుతుందని భావించినట్లు ప్రధానమంత్రి వివరించారు.

రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ ఎప్పుడూ ద్వేషాన్ని పెంచుకోలేదనీ.. ప్రజాస్వామ్యం, రాజ్యాంగ సంస్థలపై ప్రతి స్వయంసేవక్‌కు గల అచంచల విశ్వాసమే దానికి ప్రధాన కారణమని ప్రధానమంత్రి స్పష్టం చేశారు. అత్యవసర పరిస్థితి సమయంలో ఈ నమ్మకమే స్వయంసేవకులకు సాధికారతను, ప్రతిఘటించే శక్తినీ ఇచ్చిందని ప్రధానమంత్రి గుర్తుచేసుకున్నారు. సమాజంతో ఏకత్వం, రాజ్యాంగ సంస్థలపై విశ్వాసం అనే విలువలు స్వయంసేవకులను ప్రతి సంక్షోభంలోనూ, సామాజిక అవసరాల్లోనూ సున్నితంగా వ్యవహరించేలా మార్గదర్శనం చేశాయన్నారు. కాలక్రమేణా అనేక సవాళ్లను ఎదుర్కొన్నప్పటికీ సంఘ్ ఒక శక్తిమంతమైన మర్రి చెట్టులా స్థిరంగా నిలబడి దేశానికీ, సమాజానికీ నిరంతరం సేవ చేస్తోందని శ్రీ మోదీ వ్యాఖ్యానించారు.

రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ ప్రారంభం నుంచీ దేశభక్తి, సేవకు పర్యాయపదంగా ఉందని శ్రీ మోదీ అన్నారు. విభజన సమయంలో లక్షలాది కుటుంబాలు నిరాశ్రయులైనప్పుడు స్వయంసేవకులు పరిమిత వనరులతో శరణార్థులకు సేవ చేయడంలో ముందంజలో నిలిచారని ఆయన గుర్తు చేసుకున్నారు. ఇది కేవలం సహాయ చర్య మాత్రమే కాదనీ.. ఇది జాతి ఆత్మను బలోపేతం చేసే చర్యగా ఆయన అభివర్ణించారు.

1956లో గుజరాత్‌లోని అంజార్‌లో సంభవించిన వినాశకరమైన భూకంపాన్ని ప్రధానమంత్రి ప్రధానంగా ప్రస్తావించారు. ఆ విధ్వంసం గురించి వివరిస్తూ.. అలాంటి విపత్కర పరిస్థితుల్లోనూ స్వయంసేవకులు సహాయక, రక్షణ చర్యల్లో చురుగ్గా పాల్గొన్నారని తెలిపారు. మరొకరి బాధను తగ్గించడానికి నిస్వార్థంగా కష్టాలను భరించడం గొప్ప హృదయానికి నిదర్శనమని పేర్కొంటూ గౌరవనీయ గురూజీ అప్పటి గుజరాత్‌లోని సంఘ్ అధినేత వకీల్ సాహెబ్‌కు ఒక లేఖ రాశారని ఆయన గుర్తు చేశారు.

''ఇతరుల బాధలను తగ్గించడానికి నిరంతరం శ్రమించడం ప్రతి స్వయంసేవకుడి లక్షణం" అని శ్రీ మోదీ వ్యాఖ్యానించారు. 1962 యుద్ధాన్ని గుర్తుచేసుకుంటూ.. ఆర్ఎస్ఎస్ స్వయంసేవకులు సాయుధ దళాలకు అవిశ్రాంతంగా అండగా నిలుస్తూ వారి మనోధైర్యాన్ని పెంపొందించడమే కాకుండా సరిహద్దు సమీపంలోని గ్రామాల ప్రజలకూ సహాయం అందించారని తెలిపారు.

తూర్పు పాకిస్తాన్ నుంచి లక్షలాది మంది శరణార్థులు ఆశ్రయం, వనరులు కరువై భారతదేశానికి వలస వచ్చిన 1971 సంక్షోభాన్నీ ప్రధానమంత్రి ప్రస్తావించారు. ఆ క్లిష్ట సమయంలో స్వయంసేవకులు వారికి ఆహారాన్ని సమకూర్చారు.. ఆశ్రయం కల్పించారు.. ఆరోగ్య సంరక్షణ సేవలనూ అందించారు.. వారి కన్నీళ్లు తుడిచారు.. వారి బాధను పంచుకున్నారని తెలిపారు. 1984 అల్లర్ల సమయంలోనూ స్వయంసేవకులు అనేక మంది సిక్కులకు ఆశ్రయం కల్పించారని శ్రీ మోదీ గుర్తుచేశారు.

చిత్రకూట్‌లోని నానాజీ దేశ్‌ముఖ్ ఆశ్రమంలో సేవా కార్యకలాపాలను చూసి మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏ.పీ.జే. అబ్దుల్ కలాం ఎంతో ఆశ్చర్యపోయారని శ్రీ మోదీ గుర్తుచేసుకున్నారు. నాగ్‌పూర్ పర్యటన సందర్భంగా మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ సంఘ్ క్రమశిక్షణ, నిరాడంబరతకు ఎంతగానో ఆకర్షితులయ్యారని ఆయన ప్రస్తావించారు.

పంజాబ్‌లో వరదలు.. హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్‌లలో విపత్తులు.. కేరళలోని వయనాడ్‌లో జరిగిన విషాదం వంటి విపత్తుల్లో కూడా స్వయంసేవకులే మొదట స్పందిస్తున్నారని ప్రధానమంత్రి స్పష్టం చేశారు. కోవిడ్-19 మహమ్మారి సమయంలో ప్రపంచం మొత్తం సంఘ్ ధైర్యాన్ని, సేవా స్ఫూర్తిని ప్రత్యక్షంగా చూసిందని ఆయన ధ్రువీకరించారు.

సమాజంలోని విభిన్న వర్గాల్లో స్వీయ-అవగాహనను, ఆత్మగౌరవాన్ని మేల్కొల్పడం రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ తన 100 సంవత్సరాల ప్రయాణంలో సాధించిన అత్యంత ముఖ్యమైన విజయంగా ప్రధానమంత్రి అభివర్ణించారు. దేశంలోని అత్యంత మారుమూల ప్రాంతాల్లో ముఖ్యంగా దేశంలోని దాదాపు పది కోట్ల మంది గిరిజన సోదరీ సోదరులతో సంఘ్ నిరంతరం పనిచేస్తోందని పేర్కొన్నారు. మునుపటి ప్రభుత్వాలు తరచుగా ఈ వర్గాలను పట్టించుకోకపోయినా సంఘ్ వారి సంస్కృతి, పండగలు, భాషలు, సంప్రదాయాలకు ప్రాధాన్యమిచ్చిందన్నారు. సేవా భారతి, విద్యా భారతి, వనవాసి కళ్యాణ్ ఆశ్రమం వంటి సంస్థలు గిరిజన సాధికారతకు మూలస్తంభాలుగా మారాయన్నారు. నేడు గిరిజన వర్గాల్లో పెరుగుతున్న ఆత్మవిశ్వాసం వారి జీవితాలను మారుస్తోందని శ్రీ మోదీ ధ్రువీకరించారు.

దేశంలోని మారుమూల ప్రాంతాలకు చెందిన గిరిజన వర్గాల జీవితాలను మెరుగుపరచడానికి అవిశ్రాంతంగా పనిచేస్తున్న లక్షలాది మంది రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ స్వచ్ఛంద సేవకులకు కృతజ్ఞతలు తెలిపిన ప్రధానమంత్రి.. వారి అంకితభావం దేశ సాంస్కృతిక గుర్తింపును కాపాడటంలో కీలక పాత్ర పోషించిందన్నారు. గిరిజన ప్రాంతాలు లక్ష్యంగా ఎదురైన సవాళ్లు, జరిగిన దోపిడీని ప్రస్తావిస్తూ.. సంఘ్ నిశ్శబ్దంగా, దృఢంగా తన త్యాగాలతో అటువంటి సంక్షోభాల నుంచి దేశాన్ని రక్షించే తన కర్తవ్యాన్ని దశాబ్దాలుగా నెరవేర్చుతోందని ప్రధానమంత్రి వ్యాఖ్యానించారు.

సామాజిక, వర్ణపరమైన వివక్షత, తిరోగమన ఆలోచనల వంటి లోతైన సామాజిక రుగ్మతలు చాలా కాలంగా హిందూ సమాజానికి తీవ్రమైన సవాళ్లను విసురుతున్నాయని ప్రధానమంత్రి వ్యాఖ్యానించారు. ఈ సమస్యలను పరిష్కరించేందుకు రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ నిరంతరం కృషి చేస్తోందన్నారు. వార్ధాలోని సంఘ్ శిబిరాన్ని మహాత్మాగాంధీ సందర్శించిన విషయాన్ని గుర్తు చేసిన ఆయన.. సమానత్వం, కరుణ, సామరస్యం అనే సంఘ్ భావనలను గాంధీజీ బహిరంగంగానే ప్రశంసించారని అన్నారు. డాక్టర్ హెడ్గేవార్ నుంచి నేటి వరకు సంఘ్‌లోని ప్రతి ఒక్క ప్రముఖులు, సర్‌సంఘ్‌చాలక్.. వివక్ష, అంటరానితనానికి వ్యతిరేకంగా పోరాడారని ఆయన పేర్కొన్నారు. గౌరవ గురూజీ ఇచ్చిన "న హిందూ పతితో భవేత్'' అనే భావనను నిరంతరం ముందుకు తీసుకెళ్లారన్న ఆయన.. దీని అర్థం ప్రతి హిందువు ఒకే కుటుంబంలో భాగమని, ఎవరూ తక్కువ లేదా అట్టడుగు వారు కాదని చెప్పారు.

"అస్పృశ్యత పాపం కాకపోతే, ప్రపంచంలో ఏదీ పాపం కాదు" అని చెప్పిన పూజ్య బాలాసాహెబ్ దేవరస్‌ను ఆయన ఉటంకించారు. పూజ్యనీయులైన రజ్జు భయ్యా, సుదర్శన్ జీలు కూడా సరసంఘ్‌చాలక్‌గా పదవీకాలంలో ఈ భావనను ముందుకు తీసుకెళ్లారని ఆయన అన్నారు. ప్రస్తుత సర్‌సంఘ్‌చాలక్ శ్రీ మోహన్ భగవత్ జీ "ఒక బావి, ఒక ఆలయం, ఒక శ్మశానవాటిక" అనే దార్శనికతతో సామాజిక సామరస్యం కోసం స్పష్టమైన సమాజ లక్ష్యాన్ని నిర్దేశించారని ప్రధానమంత్రి పేర్కొన్నారు. ఎలాంటి వివక్ష, విభజన, అసమ్మతి లేని సమాజాన్ని ప్రోత్సహిస్తూ ఈ సందేశాన్ని దేశంలోని ప్రతి మూలకు సంఘ్ తీసుకెళ్లిందని అన్నారు.

## అస్సాంలో ఎన్ హెచ్ -715 లోని కాలీబోర్ - నుమాలిగఢ్ సెక్షన్ రహదారిని

న్యూఢిల్లీ, అక్టోబర్ 3:అస్సాంలో కాజీరంగా జాతీయ పార్కు (కేఎన్పీ) మార్గంలో ప్రతిపాదించిన వన్యప్రాణుల సంరక్షణ చర్యలను అమలు చేయడంతో సహా, జాతీయ రహదారి 715 లోని కాలీబోర్ - నుమాలిగఢ్ సెక్షన్ రహదారిని నాలుగు లైన్లుగా వెడల్పు చేయడానికి, మెరుగుపరచడానికి ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన ఆర్థిక వ్యవహారాల క్యాబినెట్ కమిటీ (సీసీఈఏ) ఆమోదం తెలిపింది. ఇంజినీరింగ్, ప్రొక్యూర్మెంట్, కన్‌స్ట్రక్షన్ (ఈపీసీ) పద్ధతిలో మొత్తం 85.675 కిలోమీటర్ల పొడవున రూ 6957 కోట్ల పెట్టుబడి వ్యయంతో ఈ ప్రాజెక్టును అమలు చేస్తారు.

ప్రస్తుతం ఎన్ హెచ్ - 715 (పాత ఎన్ హెచ్ -37) లోని కాలీబోర్ - నుమాలిగఢ్ మార్గం రెండు లైన్లుగా జఖలాబంధ (నాగావ్), బోకాఖత్ (గోలాఘాట్) పట్టణాలలోని ప్రాంతాలను కలుపుతోంది. ఇందులో కొంతభాగం పేవ్ మెంట్ తోను, కొంతభాగం పేవ్ మెంట్ లేకుండా ఉంది. ప్రస్తుత రహదారిలో అధిక భాగం కాజీరంగా జాతీయ పార్క్ మీదుగా లేదా పార్క్ దక్షిణ సరిహద్దు వెంబడి వెళుతుంది. దీనికి 16 నుంచి 32 మీటర్ల పరిమిత రైట్ ఆఫ్ వే (ఆర్ఓడబ్ల్యు) ఉంది. దీనికి తోడు రోడ్డు నిర్మాణ లోపాలు పరిస్థితిని మరింత క్లిష్టతరం చేశాయి. వర్షాకాలంలో, పార్కు లోపలి ప్రాంతం ముంపునకు గురవుతోంది. దీనివల్ల వన్యప్రాణులు పార్కు నుంచి ఎత్తయిన కర్బీ-ఆంగ్లాంగ్ కొండల వైపు వెళ్లడానికి ప్రస్తుత రహదారిని దాటాలి. అయితే, రహదారిపై రాత్రింబవళ్లు ఉండే భారీ ట్రాఫిక్ కారణంగా, వన్యప్రాణులు తరచుగా ప్రమాదాలకు గురై మరణిస్తున్నాయి.

ఈ సవాళ్లను పరిష్కరించడానికి, ఈ ప్రాజెక్ట్‌లో భాగంగా కాజీరంగా జాతీయ పార్క్ నుంచి కర్బీ - ఆంగ్లాంగ్ కొండల వరకు వన్యప్రాణులకు అడ్డంకుల్లేకుండా స్వేచ్ఛగా రాకపోకలు సాగించేందుకు దాదాపు 34.5 కిలోమీటర్ల ఎలివేటెడ్ కారిడార్‌ను నిర్మిస్తారు. ఇప్పటికే ఉన్న 30.22 కిలోమీటర్ల రహదారిని అప్‌గ్రేడ్ చేయడంతో పాటు జఖలాబంధ, బోకాఖత్ చుట్టూ 21 కిలోమీటర్ల గ్రీన్‌ఫీల్డ్ బైపాస్‌లను కూడా నిర్మిస్తారు. ఇది కారిడార్ లో రద్దీని తగ్గిస్తుంది. భద్రతను మెరుగుపరుస్తుంది. గౌహతి (రాష్ట్ర రాజధాని), కాజీరంగా జాతీయ పార్క్ (పర్యాటక ప్రదేశం), నుమాలిగఢ్ (పారిశ్రామిక పట్టణం) మధ్య అనుసంధానాన్ని పెంచుతుంది.

ప్రాజెక్ట్ అలైన్‌మెంట్ 2 ప్రధాన జాతీయ రహదారులు (ఎన్ హెచ్-127, ఎన్ హెచ్ -129), ఒక రాష్ట్ర రహదారి (ఎస్ హెచ్ - 35 )తో అనుసంధానమై అస్సాం అంతటా కీలక ఆర్థిక, సామాజిక, రవాణా కేంద్రాలకు నిరంతర అనుసంధానాన్ని అందిస్తుంది. అప్‌గ్రేడ్ చేసిన కారిడార్ 3 రైల్వే స్టేషన్లు (నాగావ్, జఖలబంధ, విశ్వనాథ్ చార్లీ), 3 విమానాశ్రయాలు (తేజ్‌పూర్, లియాబరి, జోర్హాట్) లతో అనుసంధానం కావడం ద్వారా మల్టీమోడల్ సమన్వయాన్ని మెరుగుపరుస్తుంది. తద్వారా ఈ ప్రాంతమంతటా వస్తువుల, ప్రయాణికుల వేగవంతమైన రాకపోకల్ని సులభతరం చేస్తుంది. ప్రాజెక్ట్ అలైన్‌మెంట్ రెండు సామాజిక, ఆర్థిక కేంద్రాలు, నోడ్‌లు, 8 పర్యాటక, మతపరమైన ప్రదేశాలకు రాకపోకలను మెరుగుపరుస్తుంది. తద్వారా ప్రాంతీయ ఆర్థిక వృద్ధిని, ఆధ్యాత్మిక పర్యాటకాన్ని బలోపేతం చేస్తుంది.

ఈ ప్రాజెక్టు పూర్తయిన తర్వాత, కాలీబోర్ - నుమాలిగఢ్ విభాగం ప్రాంతీయ ఆర్థిక వృద్ధిలో కీలక పాత్ర పోషిస్తుంది. ప్రధాన పర్యాటక, పారిశ్రామిక, ఆర్థిక కేంద్రాల మధ్య అనుసంధానాన్ని బలోపేతం చేస్తుంది. కజిరంగా జాతీయ పార్క్‌కు పర్యాటకాన్ని పెంచుతుంది. వాణిజ్య, పారిశ్రామిక అభివృద్ధికి కొత్త మార్గాలను తెరుస్తుంది. ఈ ప్రాజెక్ట్ సుమారు 15.42 లక్షల పనిదినాల ప్రత్యక్ష, 19.19 లక్షల పనిదినాల పరోక్ష ఉపాధిని కూడా సృష్టిస్తుంది. చుట్టుపక్కల ప్రాంతాలలో పెరుగుదల, అభివృద్ధి, అభివృద్ధి, సౌభాగ్యానికి కొత్త అవకాశాలను కల్పిస్తుంది.

# స్వగ్రామంలో విజయదశమి వేడుకల్లో పాల్గొన్న ఖమ్మం కలెక్టర్ అనుదీప్



ఖమ్మం, అక్టోబర్ 3:ఖమ్మం జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తన కుటుంబ సభ్యులతో కలిసి విజయ దశమి వేడుకల్లో పాల్గొనడానికి తన స్వగ్రామం మల్లాపూర్ మండలం చిట్టాపూర్ గ్రామానికి వచ్చారు. ఈ వేడుకల్లో గ్రామస్తులు, యువకులు, విద్యార్థులు కలెక్టర్ ను కలిసి జమ్మి ఆకు అందించి శుభాకాంక్షలు తెలియజేశారు.

ఈ సందర్భంగా అనుదీప్ యువకులనుద్దేశించి మాట్లాడుతూ యువత సెల్ ఫోన్లు, దురలవాట్లకు బానిసలు కావద్దని చదువుపట్ల దృష్టి పెట్టాలని, చదువే మనల్ని సమాజంలో ఉన్నత స్థానంలో నిలబెడుతుందని ఉద్బోధించారు. గురువారం రాత్రి గ్రామంలో జరిగిన దుర్గామాత శోభాయాత్ర లో పాల్గొని పూజలు నిర్వహించగా, అర్చకులు ఆశీర్వదించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ఈ కార్యక్రమంలో ప్యాక్స్ చైర్మన్ మోహన్ రెడ్డి, కొత్తపల్లి రాజారెడ్డి, రాజేందర్, కట్కం సర్సారెడ్డి, మైలారం సురేష్, అజయ్, బాలసాని లక్ష్మీనారాయణ, సురకంటి హనుమాండ్లు, బొల్లపెల్లి శ్రీనివాస్ గౌడ్, గుజ్జెరి శ్రీనివాస్, బర్ల మల్లేష్, విష్ణువర్ధన్ రాజు తదితరులు పాల్గొన్నారు.

# చెడుపై మంచి విజయానికి ప్రతీక దసరా : మాజీమంత్రి తలసాని



హైదరాబాద్, అక్టోబర్ 3: హైదరాబాద్ నగరం లో దసరా ఉత్సవాలు ఘనంగా జరిగాయి. పలు ప్రాంతాల్లో జనం రావణదహనం నిర్వహించి సంబురాలు చేసుకున్నారు. సనత్‌నగర్‌లోని హనుమాన్ టెంపుల్‌లో, అమీర్‌పేటలోని మున్సిపల్ గ్రౌండ్‌లో నిర్వహించిన రావణ దహనం కార్యక్రమంలో ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చెడుపై మంచి విజయానికి ప్రతీక దసరా అని చెప్పారు. ప్రజలంతా మంచిని పాటించాలని, చెడుకు దూరంగా ఉండాలని సూచించారు. అదేవిధంగా ప్రజలందరికీ విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు. రావణ దాహన కార్యక్రమాలను చూసేందుకు జనం పెద్దసంఖ్యలో హాజరయ్యారు.

# రామగుండంకు ఉత్తమ ర్యాంకు సాధించడమే లక్ష్యంగా పనిచేయాలి..

## -స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే అరుణశ్రీ



కరీంనగర్, అక్టోబర్ 3:రామగుండం నగర పాలక సంస్థకు స్వచ్ఛ సర్వేక్షణ్-2025లో ఉత్తమ ర్యాంకు సాధించడమే ధ్యేయమని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, కమిషనర్ జే.అరుణ శ్రీ అన్నారు. పక్షం రోజుల పాటు నిర్వహించిన స్వచ్ఛత హీ సేవా ముగింపు పురస్కరించుకొని ఉత్తమ సేవలందించిన పారిశుధ్య సిబ్బందికి నగర పాలక సంస్థ కార్యాలయంలో శాలువాల కప్పి సన్మానించి, మెమెంటోలు బహుకరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ స్వచ్ఛ సర్వేక్షణ్ లో మెరుగైన మార్కులు సాధించడానికి అవసరమైన అన్ని అంశాలపై దృష్టి సారించాలన్నారు. ప్రజల ఆకాంక్షకు అనుగుణంగా పారిశుధ్యంను మెరుగుపర్చాలన్నారు. కాగా, సత్కారం అందుకున్న వారిలో డ్రైయిన్ క్లీనర్లు అవినాష్, రాజు, వెంకటేష్, రమేష్, సారయ్య, విశ్వనాథ్. నాయక్, మల్లేష్, సదయ్య, కొంరయ్య, లింగమూర్తి, పోషం, కంపోస్టు యార్డు ఆపరేటర్ ప్రకాశ్, జవాన్లు తిరుపతి, సారయ్య, దయానంద్, వెహికిల్ ఇన్చార్జి నరేష్, శానిటరీ ఇన్స్పెక్టర్ సంపత్, నాగభూషణం, పిఆర్ఓ కుమార్ ఉన్నారు. కార్యక్రమంలో నగర పాలక సంస్థ అడిషనల్ కమిషనర్ మారుతి ప్రసాద్, డిప్యూటీ కమిషనర్ వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

# సీఎం వస్తున్నారని పరిగి - కొడంగల్ చౌరస్తా వద్ద గంటల తరబడి ట్రాఫిక్‌ను ఆపేసిన పోలీసులు

## – సీఎం డౌన్ డౌన్ అంటూ రేవంత్ రెడ్డికి వ్యతిరేకంగా ప్రయాణికుల నినాదాలు

## –మీకు దండం పెడుతా కాసేపు ఓపిక పట్టండి అని వాహనదారులను వేడుకున్నపోలీసు ఉన్నతాధికారి

హైదరాబాద్ అక్టోబర్ 3 (ఎక్స్ ప్రెస్ న్యూస్ బి):: దసరా పండుగ వేళ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మీద సొంత నియోజకవర్గం కొండగల్ ప్రజలు తిరగబడిన సంగతి తెలిసిందే. సీఎం కొడంగల్‌కు వస్తున్నారని చెప్పి.. గురువారం రాత్రి పరిగి ? కొడంగల్ చౌరస్తా వద్ద గంటల తరబడి పోలీసులు ట్రాఫిక్‌ను ఆపేశారు. దీంతో సీఎం డౌన్ డౌన్ అంటూ రేవంత్ రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ క్రమంలో అక్కడ విధుల్లో ఉన్న ఓ పోలీసు ఉన్నతాధికారి ప్రయాణికులను, వాహనదారులకు సముదాయించే ప్రయత్నం చేశారు. మీకు దండం పెడుతా కాసేపు ఓపిక పట్టండి అని వాహనదారులను వేడుకున్నారు ఆ పోలీసు ఉన్నతాధికారి. ఇక ప్రయాణికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ.. దాదాపు గంట అయింది.. రేవంత్ రెడ్డి కోసం ఎంతసేపు ఆపుతారు? అని పోలీసులను నిలదీశారు. పండగ పూట కొడంగల్ జనాలను ఇబ్బంది పెట్టడం ఎంత వరకు కరెక్ట్ అని ప్రశ్నించారు. చిన్న పిల్లలు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అయినా కూడా పోలీసులు పరిస్థితిని అర్థం చేసుకోకుండా గంటల తరబడి ట్రాఫిక్‌ను ఆపేయడం సరికాదన్నారు. రాత్రి 10 గంటలు అవుతున్నా తమను రోడ్లపై నిలబెట్టడం సరికాదని పోలీసుల తీరుపై మండిపడ్డారు. ఈ సందర్భంగా పోలీసు ఉన్నతాధికారి కలగజేసుకుని.. మీకు దండం పెడుతాము.. మేము



కూడా అన్నీ వదులుకొని ఇక్కడే రోడ్డు మీద ఉన్నాము అంటూ జనాలకి సర్ది చెప్పే ప్రయత్నం చేశారు. అయినా కూడా ప్రజలు శాంతించలేదు. సీఎంకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

# పొద్దు తిరుగుడు విత్తనాలు తినడం వాళ్ళ అనేక లాభాలు



హైదరాబాద్ అక్టోబర్ 3 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );సాయంత్రం సమయంలో చాలా మంది చిరుతిళ్లను తినేందుకు ఆసక్తిని చూపిస్తుంటారు. బయట రహదారుల పక్కన బండ్లపై లేదా ఫుడ్ కోర్టులు వంటి వాటిల్లో సమోసాలు, బజ్జీలు, పునుగుల తోపాటు బేకరీలలో వివిధ రకాల ఆహారాలను సాయంత్రం సమయంలో స్నాక్స్ లా తింటుంటారు. అయితే ఇవి మన ఆరోగ్యానికి ఎంతో హాని చేస్తాయి. శరీరంలో కొలెస్ట్రాల్ స్థాయిలను పెంచుతాయి. డయాబటిస్, గుండె జబ్బులు వచ్చేలా చేస్తాయి. కనుక ఈ ఆహారాలను తినకూడదు. సాయంత్రం సమయంలో ఆకలి అయితే ఆరోగ్యవంతమైన స్నాక్స్‌ను తినాల్సి ఉంటుంది. ఇవి ఆకలిని తీర్చడమే కాదు, మనకు పోషకాలను, ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తాయి. ఇక అలాంటి ఆరోగ్యవంతమైన స్నాక్స్‌లో పొద్దు తిరుగుడు విత్తనాలు కూడా ఒకటి. చాలా మంది వీటిని తినేందుకు అంతగా ఇష్టపడరు. కానీ ఇవి మనకు అనేక లాభాలను అందిస్తాయని పోషకాహార నిపుణులు చెబుతున్నారు.

హైబీపీ తగ్గేందుకు..

పొద్దు తిరుగుడు విత్తనాల్లో మోనో అన్‌శాచురేటెడ్, పాలీ అన్‌శాచురేటెడ్ కొవ్వులతోపాటు ఒమెగా 6 ఫ్యాటీ యాసిడ్లు ఉంటాయి. ఇవి ఆరోగ్యకరమైన కొవ్వుల జాబితాకు చెందుతాయి. అందువల్ల ఈ విత్తనాలను తింటే మెదడు పనితీరు మెరుగు పడుతుంది. కణాల నిర్మాణం సరిగ్గా జరుగుతుంది. అన్ని విధాలుగా ఆరోగ్యంగా ఉంటారు. ఈ కొవ్వులతోపాటు ఈ విత్తనాల్లో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు గుండెకు ఎంతో మేలు చేస్తాయి. ఇవి మన శరీరంలోని కొలెస్ట్రాల్ స్థాయిలను నియంత్రణలో ఉంచుతాయి. బీపీ తగ్గేలా చేస్తాయి. ఈ విత్తనాల్లో ఉండే మెగ్నిషియం గుండె వేగంగా కొట్టుకోవడాన్ని తగ్గిస్తుంది. దీంతో హైబీపీ ఉన్నవారికి ఎంతో మేలు జరుగుతుంది. ఈ విత్తనాల్లో యాంటీ ఆక్సిడెంట్లు, విటమిన్ ఇ, ఫ్లేవనాయిడ్స్ అధికంగా ఉంటాయి. ఇవి శరీర కణాలకు జరిగే నష్టాన్ని నివారిస్తాయి. ఫ్రీ ర్యాడికల్స్ ప్రభావాన్ని తగ్గిస్తాయి. దీని వల్ల శరీరంలో అంతర్గతంగా ఉండే వాపులు తగ్గుతాయి. దీంతో క్యాన్సర్, గుండె పోటు వంటి ప్రాణాంతక వ్యాధులు రాకుండా సురక్షితంగా ఉండవచ్చు.

డయాబెటిస్ ఉన్నవారికి..

పొద్దు తిరుగుడు విత్తనాలను తినడం వల్ల షుగర్ లెవల్స్ నియంత్రణలో ఉంటాయి. ఈ విత్తనాల్లో ఉండే ఫైబర్, ఆరోగ్యకరమైన కొవ్వుల కారణంగా మనం తినే ఆహారాల్లో ఉండే పిండి పదార్థాలు రక్తంలో గ్లూకోజ్‌గా నెమ్మదిగా మారుతాయి. దీని వల్ల షుగర్ లెవల్స్ అమాంతం పెరగకుండా ఉంటాయి. డయాబెటిస్ నియంత్రణలో ఉంటుంది. ఈ విత్తనాల్లో జింక్, సెలీనియం, విటమిన్ ఇ అధికంగా ఉంటాయి. ఇవి రోగ నిరోధక వ్యవస్థను పటిష్టం చేస్తాయి. దీని వల్ల శరీరం ఇన్ఫెక్షన్లు, వ్యాధులకు వ్యతిరేకంగా పోరాటం చేస్తుంది. రోగాలు రాకుండా ఉంటాయి. ఈ విత్తనాల్లో ఉండే ఫైబర్ జీర్ణక్రియను మెరుగు పరుస్తుంది. మలబద్దకం తగ్గేలా చేస్తుంది. ఈ విత్తనాల్లో వృక్ష సంబంధ ప్రోటీన్లు అధికంగా ఉంటాయి. కనుక నాన్ వెజ్ తినని వారికి ఈ విత్తనాలను చక్కని ఆహారంగా చెప్పవచ్చు. ఈ విత్తనాలను తింటే ప్రోటీన్లు లభించి శరీరానికి శక్తి అందుతుంది. ఉత్సాహంగా ఉంటారు. యాక్టివ్‌గా పనిచేస్తారు. బద్దకం పోతుంది. నీరసం, అలసట తగ్గిపోతాయి.

గుప్పెడు పొద్దు తిరుగుడు విత్తనాలను తింటే సుమారుగా 165 క్యాలరీల శక్తి లభిస్తుంది. ప్రోటీన్లు 5.5 గ్రాములు, కొవ్వులు 14.4 గ్రాములు, పిండి పదార్థాలు 6.5 గ్రాములు, ఫైబర్ 3 గ్రాములు ఉంటాయి. అలాగే విటమిన్ ఇ, మెగ్నిషియం, సెలీనియం, జింక్, కాపర్ కూడా ఈ విత్తనాల్లో అధిక మొత్తాల్లో ఉంటాయి. పొద్దు తిరుగుడు విత్తనాలను గుప్పెడు మోతాదులో తినవచ్చు. అధికంగా తింటే వికారం, వాంతికి వచ్చినట్లు అనిపించడం, పొట్టలో అసౌకర్యంగా ఉండడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. ఈ విత్తనాలను నేరుగా తింటే వికారంగా అనిపిస్తుంది. కనుక పెనంపై కాస్త వేయించి తింటే మంచిది. పొద్దు తిరుగుడు విత్తనాలను సాయంత్రం సమయంలో స్నాక్స్‌లా తినవచ్చు. లేదా రాత్రి నిద్రకు ముందు తినవచ్చు. ఉదయం వ్యాయామం చేసిన తరువాత కూడా తినవచ్చు. ఇలా ఈ విత్తనాలను రోజూ తింటుంటే అనేక లాభాలను పొందవచ్చు.

# కాంగ్రెస్ పాలనలో తెలంగాణ ఆర్థిక వ్యవస్థ విధ్వంసం: కేటీఆర్

హైదరాబాద్ అక్టోబర్ 3 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ); : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ పాలనలో తెలంగాణ ఆర్థిక వ్యవస్థ సంపూర్ణ విధ్వంసానికి గురైందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర స్థాయిలో విమర్శించారు. తాజాగా, సెప్టెంబర్ 2025 నెలలో వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) వసూళ్ల వృద్ధి రేటులో తెలంగాణ దేశంలోనే అట్టడుగున ఉండటం దారుణమని కేటీఆర్ అన్నారు. తెలంగాణ ఆర్థిక విధ్వంసానికి సంబంధించిన మరో స్పష్టమైన సూచిక ఇదేనని ఆయన పేర్కొన్నారు. సరిగ్గా రెండేళ్ల క్రితం, కేసీఆర్ సమర్థ పాలనలో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే నెంబర్ వన్ స్థానంలో నిలిచిందని ఆయన గుర్తు చేశారు. జీఎస్టీ వృద్ధిలో ఈ పతనం, రేవంత్ రెడ్డి పరిపాలనలో రాష్ట్ర ఆర్థికవ్యవస్థ ఎంత విధ్వంసం పాలయ్యిందో చెప్పే ఒక నిదర్శనమని కేటీఆర్ ధ్వజమెత్తారు. గత బీఆర్ఎస్ హయాంలో వ్యవసాయం నుండి ఐటీ వరకూ అన్ని రంగాలకు రాష్ట్ర ప్రభుత్వం గట్టి దన్ను ఇవ్వడంతో ఆర్థికవ్యవస్థ పరుగులు తీసి, రికార్డులు తిరగరాసిందని కేటీఆర్ తెలిపారు. కానీ, నేడు కాంగ్రెస్ పాలనలో, పండుగ వచ్చినా, పబ్బం వచ్చినా కూడా అన్ని రంగాలూ నేలచూపులే చూస్తున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయం నుండి రియల్ ఎస్టేట్ వరకూ అన్ని రంగాల్లోనూ దైన్యవే తాండవిస్తోందని మండిపడ్డారు. "అరాచకత్వం, అవినీతి, అనుభవలేమి కలగలసిన రేవంత్ పాలనలో తెలంగాణ ఆర్థిక విధ్వంసానికి గురవుతోంది. కాంగ్రెస్ ప్రభుత్వం ఈ విధ్వంసాన్ని వెంటనే ఆపడానికి చర్యలు తీసుకోవాలి" అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు.

# ఎంఐఎం పార్టీలో మొదలైన స్థానిక ఎన్నికల కోలాహలం

-ఈనెల 6న ఉమ్మడి జిల్లాలో పర్యటించనున్న ఎంఐఎం పార్టీ ఇన్చార్జి యాసర్ అర్ఫాత్

-మక్కాకు వెళ్లిన గులాం అహ్మద్ అర్ధాంతరంగా ముగించుకొని ఇండియాకు రాక



కరీంనగర్, అక్టోబర్ 3:ఎంఐఎం పార్టీలో స్థానిక సంస్థల ఎన్నికల కోలాహలం మొదలైంది. సర్పంచ్ ఎంపీటీసీ జెడ్పీటీసీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఎంఐఎం పార్టీ తొలిసారిగా ఓ అడుగు ముందుకేసింది. ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీ వర్గాలను కలుపుకొని స్థానిక సంస్థల ఎన్నికల్లో బరిలోకి నిలిచేందుకు కసరత్తు ప్రారంభించింది. పట్టణ ప్రాంతాలకు పరిమితమైన ఎంఐఎం పార్టీ ఈసారి పంచాయతీ ఎన్నికల్లో సైతం పోటీ చేసేందుకు అధిష్ఠానం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో కరీంనగర్ ఉమ్మడి జిల్లాలోని ఎంఐఎం పార్టీ నాయకులు ఉమ్మడి జిల్లాలోని తమకు అనుకూలంగా ఉన్న పంచాయతీల్లో పోటీ చేసేందుకు స్థానిక నాయకులు నుంచి అభ్యర్థుల వివరాలు సేకరించి నివేదికలు సిద్ధం చేసుకున్నారు. ఎంఐఎం పార్టీ అధినేత బారిష్టర్ అసదుద్దీన్ ఓవైసీ ఆదేశాల మేరకు ఈనెల 6న సోమవారం ఉదయం 11గంటలకు కరీంనగర్ ఉమ్మడి జిల్లాలో ఎంఐఎం పార్టీ ఉమ్మడి జిల్లా ఇన్చార్జ్ యాసర్ అర్ఫాత్ పర్యటిస్తున్నారు. మొదటగా కరీంనగర్ చేరుకొని బైపాస్ రోడ్ నుంచి పెద్దపల్లి జిల్లాకు వెళతారు. అక్కడ రామగుండం గోదావరిఖని పెద్దపల్లి సుల్తానాబాద్ నాయకులతో సమావేశం అయ్యాక మధ్యాహ్నం జగిత్యాల జిల్లా కేంద్రానికి చేరుకొని అక్కడ స్థానిక ఎంఐఎం పార్టీ నాయకులతో స్థానిక సంస్థల ఎన్నికలపై సమావేశం అవుతారు. సాయంత్రం కరీంనగర్ జిల్లా కేంద్రానికి చేరుకొని ఎంఐఎం పార్టీ కార్యాలయం దారుసలాంలో మగ్రిబ్ నమాజ్ అనంతరం కరీంనగర్ మానకొండూర్ హుజురాబాద్ జమ్మికుంట తదితర ప్రాంతాల ఎంఐఎం పార్టీ నాయకులతో స్థానిక సంస్థల ఎన్నికలపై సమావేశం నిర్వహించి, ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై చర్చిస్తారు. గత నాలుగు రోజుల క్రితం మక్కా యాత్రకు వెళ్లిన ఎంఐఎం పార్టీ కరీంనగర్ అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ ఉమ్రా యాత్రను అర్ధాంతరంగా ముగించుకొని హుటాహుటిన అధిష్ఠానం ఆదేశాల మేరకు నేడు ఇండియాకు తిరిగి వస్తున్నారు. ఏదిఏమైనా ఎంఐఎం పార్టీలో స్థానికుల స్థానిక సంస్థల ఎన్నికల సందడి నెలకొంది. ఈ వెనువెంటనే కార్పొరేషన్, మున్సిపల్ ఎన్నికలు సైతం ప్రభుత్వం నిర్వహిస్తే,ఈ స్థానిక సంస్థల ఎన్నికలు తమకు సెమీఫైనల్‌గా భావించి పార్టీని కరీంనగర్ ఉమ్మడి జిల్లాలో మరింత బలోపేతం చేసేందుకు దోహదపడుతుందని ఎంఐఎం పార్టీ నాయకులు అంచనా వేస్తున్నారు. యాసర్ అర్ఫాత్ కు ఘనంగా స్వాగతం పలికేందుకు ఎంఐఎం పార్టీ కరీంనగర్ అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ ఆధ్వర్యంలో, ఆపార్టీ ఉమ్మడి జిల్లా నాయకులు సిద్ధమయ్యారు.

# దేవరగట్టు బన్ని జైత్రయాత్రలో హింస.. ముగ్గురు మృతి



అమరావతి అక్టోబర్ 3 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: కర్నూల్ జిల్లా హోళగుంద మండలం దేవరగట్టులో ప్రారంభమైన బన్ని జైత్రయాత్రలో హింస చెలరేగింది. యాత్రలో భాగంగా దేవతామూర్తులను రక్షించుకునేందుకు మూడు గ్రామాల భక్తులు ఒక వైపు, మరో 7 గ్రామాల భక్తులు మరోవైపు కర్రలతో తలపడ్డారు. ఈ సమరంలో ముగ్గురు ప్రాణాలు కోల్పోగా, 100 మందికి పైగా తీవ్రంగా గాయపడ్డారు. వీరిలో ఐదుగురి పరిస్థితి విషమంగా ఉంది. తీవ్రంగా గాయపడిన వారిందరిని ఆదోని ఆస్పత్రికి తరలించారు. దేవరగట్టులో పోలీసులు భారీగా మోహరించారు. జిల్లా ఎస్పీ విక్రాంత పాటిల్, ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, పత్తికొండ ఆర్డీవో భరత్ నాయక్ పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు.

# దసరా పండుగకు రెండు రోజుల్లో దాదాపు రూ.419 కోట్ల మద్యం అమ్మకాలు

హైదరాబాద్, అక్టోబర్ 3 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ); దసరా పండుగ సందర్భంగా తెలంగాణ రాష్ట్రంలో రికార్డు స్థాయిలో మద్యం అమ్మకాలు జరిగాయి. సెప్టెంబర్ 30, అక్టోబర్ ఒకటవ తేదీల్లో మందు బాబులు భారీగా మద్యం కొనుగోలు చేశారు. ఈ రెండు రోజుల్లో దాదాపు రూ.419 కోట్ల మద్యం అమ్మకాలు జరిగాయి. సెప్టెంబర్ 30న రూ.333 కోట్ల మద్యాన్ని మందుబాబులు కొనుగోలు చేశారని ఎక్సైజ్ శాఖ ప్రకటించింది. అక్టోబర్ ఒకటో తేదీన రూ.86 కోట్ల మద్యం సేల్స్ జరిగినట్లు అధికారులు వెల్లడించారు. సాధారణ రోజులతో పోలిస్తే సెప్టెంబర్ 26 నుంచి మద్యం అమ్మకాలు రెట్టింపయ్యాయి. అయితే అక్టోబర్ 2న గాంధీ జయంతి సందర్భంగా మద్యం అమ్మకాలతోపాటు మాంసం దుకాణాలు కూడా బంద్ అయ్యాయి. దీని ఎఫెక్ట్ దసరా పండుగపై పడింది. అక్టోబర్ 2న గాంధీ జయంతితోపాటు దసరా పండుగ కూడా వచ్చింది. ఆ రోజు మద్యం షాపులు బంద్ నేపథ్యంలో ఒకరోజు ముందుగానే అంటే అక్టోబర్ 1వ తేదీనే వైన్ షాపుల వద్ద రద్దీ పెరిగింది. వైన్ షాపులు, లిక్కర్ మార్ట్ ముందు మందుబాబులు క్యూ కట్టిన పరిస్థితి. ఈ క్రమంలో దసరా, అక్టోబర్ 2 ఒకేరోజు వచ్చినప్పటికీ అంతకు ముందు రోజు భారీగా మద్యం విక్రయాలు జరిగాయిని ఎక్సైజ్ శాఖ వెల్లడించింది.

# శాంతితోనే అభివృద్ధి సాధ్యం

ఇండియన్ ప్రజా కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలు డాక్టర్ పద్మిని



హైదరాబాద్ అక్టోబర్ 3 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ); మహాత్మా గాంధీ జయంతి ని పురస్కరించుకుని రోడ్ నెంబర్ వన్ కెపిహెచ్బి కాలనీ హైదరాబాద్ నందుగల మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించిన సందర్భంగా డాక్టర్ పద్మిని గారు మాట్లాడుతూ గాంధీ బోధించిన అహింస శాంతి మార్గంతో ఆ రోజుల్లో ఏ విధంగా స్వాతంత్రాన్ని సంపాదించుకున్నాము అలాగే శాంతితో ముఖ్యంగా యువత తమ భవిష్యత్తుని సన్మార్గ మార్గంలో పయనించి దేశాభివృద్ధికి పాటుపడాలని విజ్ఞప్తి చేశారు ప్రభుత్వం కూడా పాఠ్యపుస్తకాలలో గాంధీ బోధించిన శాంతి మార్గాన్ని విద్యార్థుల్లో ప్రభావితం చేసే విధంగా పాఠ్యాంశాలుగా మరింతగా ప్రవేశపెట్టాలని కోరారు కార్యక్రమంలో ఇండియన్ ప్రజా కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు కేబి శ్రీధర్ ఇండియన్ ప్రజా కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నాదెండ్ల సుధాకర్ సామాజికవేత్తలు వేల్పూర్ శ్రీనివాస్ విజయదేవి తదితరులు పాల్గొన్నారు

# రోడ్డు ప్రమాదంలో మూలసాల బిల్ కలెక్టర్‌కు తీవ్రగాయాలు.. పరిస్థితి విషమం హైదరాబాద్ కు తరలింపు



కరీంనగర్, అక్టోబర్ 3: పెద్దపల్లి మండలం మూలసాల గ్రామానికి చెందిన బిల్ కలెక్టర్, మాజీ సర్పంచ్ మామిడి పద్మ భర్త కొమురయ్య బుధవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. పెద్దపల్లికి పనుల నిమిత్తం వచ్చి పనులు ముగించుకుని తిరుగు ప్రయాణంలో మూలసాలకు తన ద్విచక్ర వాహనంపై వెళ్తున్న కొమురయ్యను కరీంనగర్ వైపు వెళ్తున్న కారు వేగంగా ఢీ కొట్టడంతో కొమురయ్య తీవ్రంగా గాయపడ్డాడు.

ఈ క్రమంలోనే అటుగుండా కాన్వాయ్ గా వెళ్తున్న రాష్ట్ర ఐటీ పరిశ్రమలు, శాసనసభా వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ప్రమాదం తెలుసుకుని వాహనాన్ని ఆపి పెద్దపల్లి దవాఖాన వైద్యులతో మాట్లాడి క్షతగాత్రుడికి అవసరమైన చర్యలు, చికిత్సలు అందించాలని సంబంధిత శాఖ అధికారులను ఫోన్ ద్వారా ఆదేశించారు. సంఘటనా స్థలానికి పెద్దపల్లి రూరల్ ఎస్సై మల్లేష్ తన సిబ్బందితో అక్కడికి చేరుకుని ట్రాఫిక్ ను క్రమబద్ధీకరిస్తూ రక్షణ చర్యలు చేపట్టారు.

పలువురు నాయకులు ,గ్రామస్తులు పాల్గొని కొమురయ్య ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. చివరికి కరీంనగర్ లో వైద్యచికిత్స అనంతరం హైదరాబాద్ లోని నిమ్స్ దవాఖానకు మంత్రి శ్రీధర్ బాబు ఆదేశాల మేరకు మెరుగైన వైద్యం కోసం తరలించారు. ఈ కార్యక్రమంలో తాడిశెట్టి శ్రీకాంత్, తాడిశెట్టి అరుణ్, కుర్మ ప్రవీణ్, కుర్మ శివ, కొండా రేవంత్, సుతారి ప్రణయ్, రాజిరెడ్డి తరుణ్, బంటీ తదితరులు పాల్గొన్నారు.

# భారీ వర్షాలతో ఉప్పొంగిన నాగావళి, వంశధార నదులు

-శ్రీకాకుళం, మన్యం, విజయనగరం కలెక్టర్లు, ఎస్పీలతో హోంమంత్రి వంగలపూడి అనిత సమీక్ష

-ప్రజలకు ఎటువంటి అసౌకర్యం లేకుండా చూడాలని అధికారులకు ఆదేశం

అమరావతి, అక్టోబర్ 3 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: భారీ వర్షాలతో నాగావళి, వంశధార నదులు ఉప్పొంగిన నేపథ్యంలో శ్రీకాకుళం, మన్యం, విజయనగరం కలెక్టర్లు, ఎస్పీలతో హోంమంత్రి వంగలపూడి అనిత ఈరోజు (శుక్రవారం) సమీక్ష నిర్వహించారు. ప్రస్తుత వరద పరిస్థితులపై ఆరా తీశారు. జిల్లాల్లో కంట్రోల్ రూమ్స్ 24/7 అలెర్ట్‌గా ఉండాలని ఆదేశించారు. ప్రజలకు ఎటువంటి అసౌకర్యం లేకుండా చూడాలని... ప్రాణ నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. వరద సహాయక చర్యలకు ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్, పోలీస్, ఫైర్ సిబ్బంది ఎప్పటికప్పుడు స్పందించాలన్నారు. వంశధార, నాగావళి నది లోతట్టు ప్రాంత ప్రజలకు ఎప్పటికప్పుడు హెచ్చరిక మెసేజ్లు పంపాలని ఆదేశించారు. విపత్తుల సమాచారం, సహాయం కోసం టోల్ ఫ్రీ నెంబర్లు 112, 1070, 18004250101 సంప్రదించాలన్నారు. విపత్తుల సంస్థ హెచ్చరిక సందేశం వచ్చినప్పుడు ప్రజలు సురక్షితమైన భవనాల్లో ఉండాలని హోం, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి అనిత సూచనలు చేశారు. మరోవైపు వంశధార నది పరివాహక ప్రాంతంలో దిగువన ఉన్న గ్రామ ప్రజలకు మూడవ ప్రమాద హెచ్చరిక జారీ చేయడమైనని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ప్రకటించారు. వంశధార నదికి గొట్ట బ్యారేజ్ వద్ద దిగువకు 1, 04, 891 క్యూసెక్కుల నీరు వస్తుందన్నారు. లోతట్టు ప్రాంతంలో ఉన్న ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. అధికారులు ఎప్పకప్పుడు సమాచారం తెలియజేయాలని కలెక్టర్ స్వప్నిల్ ఆదేశించారు.

# విజయదశమి రోజున శ్రీ వేంకటేశ్వర కాలనీలో ఆర్ఎస్ఎస్ కొత్త శాఖ ప్రారంభం....



కరీంనగర్, అక్టోబర్ 3: (నేటినిజం ప్రతినిధి) రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా తిమ్మాపూర్ మండలం శ్రీ వెంకటేశ్వర కాలనీ బస్తీ (అలుగునూర్) లో విజయదశమి ఉత్సవాన్ని నిర్వహించారు. అలాగే ప్రప్రథమంగా శాఖ కార్యకలాపాలను శ్రీ వెంకటేశ్వర కాలనీలోని జెండా గద్దె వద్ద ఘనంగా ప్రారంభించారు. ముఖ్యంగా కాలనీలోని చిన్నారులను భాగస్వామ్యం చేస్తూ శాఖ ను మొదలుపెట్టారు. ఇట్టి శాఖ ప్రారంభోత్సవ కార్యక్రమానికి తిమ్మాపూర్ ఖండ కార్యవాహ ఆవుల కుమార్ జి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆవుల కుమార్ జి చిన్నారులకు సరదాగా ఆట, పాటలను నిర్వహించి , ఆర్ఎస్ఎస్ గురించి తెలియజేశారు. శ్రీ వెంకటేశ్వర కాలనీలో విజయదశమి రోజున నూతన శాఖ ప్రారంభం కావడం సంతోషకరంగా ఉందని ఆవుల కుమార్ అన్నారు . శాఖకు హాజరైన స్వయం సేవకులను ఉద్దేశించి ఆవుల కుమార్ మాట్లాడారు. రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ భారతదేశాన్ని తమ మాతృభూమిగా భావించే ప్రజల ప్రయోజనాలను రక్షించడమే ఆశయంగా డాక్టర్ కేశవ్ రావు బలి రామ్ పంత్ హెడ్గేవార్ (డాక్టర్ జి) ఆర్ఎస్ఎస్ సంస్థను మహారాష్ట్ర లోని నాగపూర్ లో 1925 న విజయదశమి రోజున ప్రారంభించారని తెలిపారు. పది మంది చిన్నపిల్లలతో మొదలుపెట్టిన ఆర్ఎస్ఎస్ నేడు కోట్లాదిమంది స్వయం సేవకులను కలిగి , దేశ, సమాజ సేవలో అత్యంత ప్రభావిత సంస్థగా మారిందన్నారు. ఈ విజయదశమి కి ఆర్ ఎస్ఎస్ 100 ఏళ్లు పూర్తి చేసుకుంటున్నా శుభ సందర్భంలో శతజయంతి ఉత్సవాలను దేశవ్యాప్తంగా నిర్వహిస్తుందని తెలిపారు. ఎటువంటి సభ్యత్వ నమోదు, ఐడెంటిటీ కార్డులు వంటివి లేకుండా ఆర్ఎస్ఎస్ వందేళ్లు దిగ్విజయంగా పూర్తిచేసుకుని ప్రపంచంలోనే అతిపెద్ద స్వచ్ఛంద సంస్థగా (ఎన్జీవో) ఖ్యాతిగాంచిన జాతీయవాద సంస్థగా నిలిచిందన్నారు. . ఆర్ఎస్ఎస్ ఆలోచన విధానాన్ని వ్యాప్తి చేయడానికి ఎన్నో అనుబంధ సంస్థలకు దారి చూపిందన్నారు. ఒకనాడు మహారాష్ట్రకే పరిమితమైన ఆర్ఎస్ఎస్ నేడు దేశంలోని అన్ని రాష్ట్రాలు, జిల్లాలు, మండలాలు, గ్రామాలకు విస్తరించిందనీ చెప్పారు. ముఖ్యంగా ఆర్ఎస్ఎస్ కు సర్ సంఘ చాలకులుగా పని చేసిన ఎంతోమంది పెద్దలు ఆర్ఎస్ ఎస్ ను ఒక మహా వృక్షం మాదిరిగా యావత్ భారతదేశం అంతటా విస్తరించడానికి తమ జీవితాలను ధార పోశారని తెలిపారు. రాష్ట్రీయ స్వయసే సంఘ్ శాఖలలో మొదటగా ధ్వజారోహణము, సూర్య నమస్కారములు, యోగ, ఆటలు, కర్రసాము, సుభాషితాలు, అమృత వచనాలు , సూచనలు, భారతీయ చరిత్ర, సంస్కృతి, సాంప్రదాయాలను తెలియజేసే ప్రసంగాలు, ఒకరితో ఒకరు సత్సంబంధాలు పెంచుకోవడం వంటి కార్యక్రమాలు నిత్యం జరుగు తుంటాయి. చివరగా ప్రార్థన వంటి విషయాలు నిత్యం జరుగుతుంటాయని ఆయన వివరించారు. ఆర్ఎస్ఎస్ పుట్టిందే మాతృభూమి సేవ కోసమని, హైందవాన్ని ఒక మతంగా కాక ఒక జీవన విధానంగా, భారత ప్రజలను భరత మాత రూపంగా భావించి, భారతదేశాన్ని తమ మాతృభూమిగా భావించే ప్రజల కోసం, దేశ సంస్కృతి సాంప్రదాయాలను పరిరక్షించడం కోసం, సమాజసేవ కోసం ఆర్ఎస్ఎస్ పనిచేస్తున్న స్వయం సేవకులు సంఘ్ పరివార్ నిర్మాణం చేపట్టారని తెలియజేశారు. సమాజం లోని రైతులు ,విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారులు, కార్మికులు, న్యాయవాదులు, డాక్టర్లు, వెనుకబడిన వర్గాలకు ప్రాతినిధ్యం వహించే విధంగా ఎన్నో అనుబంధ సంస్థలను స్వయం సేవకులు ప్రారంభించారన్నారు. ఆర్ఎస్ఎస్ నిస్వార్థ సేవ లక్ష్యంతో ముందుకు కొనసాగుతుందన్నారు. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ శతాబ్ది ఉత్సవాలు పంచ పరివర్తన్ లక్ష్యం దిశగా కొనసాగుతున్నాయన్నారు. ఇందులో ముఖ్యం గా ఐదు అంశాలను స్వయం సేవకులు ప్రతి ఇంటికి వెళ్లి తెలియజేసే విధంగా కార్యక్రమాలు చేపట్టడం జరిగిందన్నారు. ముఖ్యంగా ఆర్ఎస్ ఎస్ ను ప్రతి ఒక్కరూ అర్థం చేసుకోవాలన్నారు. ఆర్ఎస్ఎస్ ఒక పవర్ హౌస్ లాంటిదని , ఒక పవర్ హౌస్ నుండి కరెంటు దేశంలోని అన్ని అవసరాలకు ఎలా ఉపయోగపడుతుందో ... ఆర్ఎస్ఎస్ కూడా అదేవిధంగా దేశం కోసం ఉపయోగపడే పని చేస్తుందన్నారు. ముఖ్యంగా వ్యక్తి సరైన వాడైతే సమాజం కూడా సరైన దిశలో ప్రయాణిస్తుందని తెలిపారు. ప్రధానంగా సంఘం నిర్వహించే శాఖ పద్ధతి ద్వారా వ్యక్తి నిర్మాణాన్ని చేస్తుందనీ, గంటసేపు శాఖలో జరిగే వివిధ కార్యక్రమాల తో వ్యక్తి వికాసం కోసం కృషి చేస్తుందన్నారు. . హిందూ సమాజాన్ని సంఘటితం చేయడం, దేశాన్ని ప్రపంచంలోనే గురువు స్థానంలో ఉంచాలనే సంకల్పంతో ఆర్ఎస్ఎస్ నిరంతరం పనిచేస్తుందని ఆయన తెలిపారు. శ్రీ వెంకటేశ్వర కాలనీ (అలుగునూరు) శాఖ కొత్త శాఖ ప్రారంభంలో తరుణ20మంది, బాల13 మంది, శిశు2,మహిళ15 లతో పాటు తిమ్మాపూర్ మండల ఉప ప్రముక్ కన్నం సాయి కృష్ణ, స్వయం సేవకులు పాల్గొన్నారు.

# బాధ్యతలు చేపట్టిన గుడిసె సదానందంకు సన్మానం

-జూనియర్ సివిల్ జడ్జిని మర్యాదపూర్వకంగా కలిసిన అధ్యక్షులు



రాజన్న సిరిసిల్ల, అక్టోబం3:(నేటినిజం ప్రతినిధి): వేములవాడ న్యాయవాదుల సంఘం అధ్యక్షునిగా బాధ్యతలు చేపట్టిన సీనియర్ న్యాయవాది గుడిసె సదానందం ను శుక్రవారం న్యాయవాదులు శాలువాలతో ఘనంగా బార్ అసోసియేషన్ హాల్లో సన్మానించారు. అనంతరం వేములవాడ ఇన్చార్జ్ జూనియర్ సివిల్ జడ్జి ప్రవీణ్ ను మర్యాదపూర్వకంగా కలిసి దసరా శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జడ్జి నూతన బార్ అధ్యక్షునికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గడ్డం సత్యనారాయణ రెడ్డి ఉపాధ్యక్షులు కటకం జనార్ధన్, నాగుల సత్యనారాయణ, రేగుల దేవేందర్, పొత్తూరు అనిల్ కుమార్, వేముల సుధాకర్ రెడ్డి, పర్లపెల్లి అంజయ్య తదితరులున్నారు.

# అంబులెన్స్‌లో గర్భిణీల ప్రసవం.. తల్లీబిడ్డలు క్షేమం

మహబూబ్‌నగర్, అక్టోబర్ 3: నారాయణపేట జిల్లా మాగనూర్,కృష్ణ మండలంలో ఇద్దరు గర్భిణీలు అంబులెన్స్ లో ప్రసవమయ్యారు. తల్లీబిడ్డలు క్షేమంగా ఉన్నారని ఈఎంటీ శేఖర్, పైలట్ జంబేష్ మల్లికార్జున్ వెల్లడించారు. కృష్ణ మండలం కూసుమూర్తి గ్రామానికి చెందిన భీమ్ బాయ్ నొప్పులు రావడంతో ఆశ వర్కర్ శోభా సమాచారం అందజేసి 108 అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో నొప్పులు ఎక్కువయ్యాయి.

దీంతో సిబ్బంది అంబులెన్స్‌లో కుటుంబ సభ్యుల మధ్య ప్రసవం చేశారు. కొద్ది గంటల్లోనే మాగనూరు మండలం కోల్పూర్ గ్రామానికి చెందిన గర్భిణి అశ్వినిని ఆసుపత్రికి తరలిస్తుండగా ఇద్దరు కూడా మగబిడ్డలకు జన్మనిచ్చారు. అనంతరం తల్లి బిడ్డలను మాగనూర్ పీహెచ్‌సీలో చేర్పించారు. అక్కడి వైద్యులు తల్లి బిడ్డను పరిశీలించి తల్లి బిడ్డ ఆరోగ్యంగా క్షేమంగా ఉన్నారని తెలిపారు. సమయస్ఫూర్తితో గర్భిణీలకు సుఖప్రసవం చేసిన 108 సిబ్బందిని కుటుంబ సభ్యులతో పాటు ఆసుపత్రి వైద్యులు అభినందించారు.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana.'Editor: **BAISA DEVADAS.** RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com